1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 1
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

మార్చి 2019

మూలభాషలూ సమాజాల సంస్కృతుల అంతర్జాతీయ సదస్సు






బోధనా మాధ్యమం:తెలుగు అభివృద్ధి

భాషలు అంతరించి పోవడానికి కారణం...

ఉద్యమాలతోనే మాతృభాష రక్షణ

అడవి బిడ్డలు ఈదేశ పౌరులేనా...





పాలన విద్యారంగాల్లో తెలుగు:ప్రతిపక్షాల విధానం ఏమిటి?

తెనాలిలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని భాషా హక్కుల దినోత్సవంగా తెలుగు రాష్ట్రాలలో జరపాలని తెలుగుభాషోద్యమ సమాఖ్య ఇచ్చిన పిలుపునసుసరించి తెనాలిలో పెద్ద కార్యక్రమం జరిగింది. ప్రజల భాషలో పరిపాలన జరగాలని, ప్రాథమిక విద్య తప్పనిసరిగా మాతృభాషలో జరగాలని పిలుపునిచ్చారు. పార్టీ పేరులో తప్ప పాలనలో తెలుగు లేదని తెలుగుజాతి ఆత్మ గౌరవం పేరుతో అధికారంలోకి వచ్చి భాషా విధ్వంసానికి పాల్పడుతున్న ప్రస్తుత పాలకుల తీరుకు నిరసన తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో వారి తెలుగుభాషా విధానం ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని రెవెన్యూ డివిజన్ అధికారికి, పురపాలక సంఘ కమీషనర్‌కు స్థానిక శాసన సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌గారికి వైయస్సార్ పార్టీ బాధ్యులు అన్నాబత్తుని శివకుమార్‌గారికి జనసేన పార్టీ బాధ్యులు నాదెండ్ల మనోహర్ గారికి నివేదికలను సమర్పించారు.

హైదరాబాదులో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



సమైక్య భారతి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో ఫిబ్రవరి నెల 21 న పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో డా.నందమూరి తారకరామారావు కళామందిరంనందు మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణా సాహిత్య అకాడమీ చైర్మన్ డా.నందిని సిధారెడ్డి, సభాధ్యక్షులుగా ఈ సదస్సులో, తెలంగాణ ఎంప్లాయిస్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు కె.గోపాల్ రెడ్డి, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డా. సామల రమేష్ బాబు, సమైక్య భారతి కోశాధికారి వాదా ప్రసాదరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎం.రామరాజు, జాతీయ కన్వీనర్ పి కన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుప్పిలి విజయ్ కుమార్ రెడ్డి రచయిత్రి డా. సుధారాణి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణా సాహిత్య అకాడమీ చైర్మన్ డా. నందిని సిధారెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో తెలుగు మీడియంలో చదువుకున్నవారికి 20% రిజర్వేషన్ కల్పించాలని అందుకు తెలుగు వారందరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

మార్చి 2019



- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో www.ammanudi.org చూడండి.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు: పావులూరి చిదంబరేశ్వరరావు

వ్యంగ్యచిత్రాలు: సరసి

కంప్యూటరీకరణ : లంకె జనార్దన్

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

– సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136 *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

హెచ్చరిక

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసే ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com



'అమ్మనుడి' పత్రికకు చందాదారులుగా చేరండి

ప్రతినెలా పత్రికను పోస్టులో మీ ఇంటికే అందుకోండి.

చందా వివరాలు

శాశ్వత చందా: రూ.5000

5 సం॥ : రూ.1000

3 సం॥ : రూ. 700

1 సం॥ : రూ. 240

కొత్తగా చందాదారులుగా చేరి బహుమతులుగా ఈ పుస్తకాలను పొందండి


✦ శాశ్వత చందా రు. 5000/- చెల్లించి '**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**', '**ద్రావిడ మంగోలు భాషల జన్యుసంబంధం**' రెండు పుస్తకాలనూ ఉచితంగా పొందండి.

✦✦ 5 స॥లకు చందా రు.1000/-లు చెల్లించి '**ఎల్లలులేని తెలుగు**' పుస్తకాన్ని ఉచితంగా పొందండి.

✦✦✦ 3 సం॥ చందా రు. 700/- చెల్లించి, '**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**' పుస్తకాన్ని ఉచితంగా పొందండి.

భాషాభిమానులు, రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల ప్రజలు అందరూ చదువదగ్గ ఈ క్రింది పుస్తకాలు మా వద్ద విడిగా కూడా లభిస్తాయి.

స.వెం.రమేశ్ రచన



ఎల్లలు లేని తెలుగు
వెల : రు.200/-లు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు




తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం
వెల :రు. 100/-



ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం
వెల : రు.350/-

బంగారయ్య రచన




నుడి - నానుడి
వెల : రు.200/-

పుస్తకాల ధరను ఎం.ఒ.గా ఈ క్రింది చిరునామాకు పంపిస్తే పుస్తకాలను కొరియర్‌లోగాని, స్పీడ్ పోస్టులో గాని పంపిస్తాము.

'అమ్మనుడి' పత్రిక, 8-386, జీవక భవనం
అంగల కుదురు (పోస్టు) తెనాలి, గుంటూరు -522210
డా॥ సామల లక్ష్మణబాబు (9440448244) ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

మాననీయ యునెస్కో డైరెక్టర్ జనరల్ ఓడ్రే అలై సందేశం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఫిబ్రవరి 21 2019 సందర్భంగా



"మన భాష దుఃఖంతో ఆపకుండా కన్నీరు కారుస్తోంది, అందుకు కారణం ఆమె సొంత పిల్లలే ఆమెను విడిచిపెట్టేసారు, ఆమె సమస్యల భారంతో ఒంటరిగా ఉంది." – ఉసెయ్ను గెయ్ కౌసాన్, వొలొఫ్ భాషలో రాసిన కవిత నుండి (సెనెగల్) యునెస్కో దృష్టిలో ప్రతి మాతృభాషను అందరూ తెలుసుకోవాలి, గుర్తించాలి, రోజువారీ మనుగడలోని అన్ని అంశాల్లో మాతృభాషలు అధిక ప్రాముఖ్యతను పొందాలి. ఇది ఎల్లప్పుడు సాధ్యం కాదు. మాతృభాషలకు జాతీయ భాషగానో, అధికార భాషగానో, బోధనా భాషగానో గుర్తింపు ఉండాలన్న నిబంధన లేదు. అటువంటి పరిస్థితుల్లో మాతృభాష తన విలువను కోల్పోయి, చివరాఖరున అదృశ్యమయ్యే ప్రమాదమూ ఉంది. ఈనాడు మనం ఇరవయ్యవ సారి అంతర్జాతీయ మాతృభాష దినోత్సవానికంటూ సంవత్సరంలో ఒక రోజును కేటాయించి జరుపుకుంటున్నాం. ఈరోజు మనమందరం కచ్చితంగా గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే అన్ని మాతృభాషలు విలువైనవే. ప్రపంచ శాంతిని స్థాపించేందుకు, సుస్థిర అభివృద్ధికీ మాతృభాషలు అత్యవసరం.

రాయటం, చదవటం, లెక్కలు చేయడం అనే మౌలిక నైపుణ్యాలను పాఠశాల స్థాయిలో అందిస్తుంది కాబట్టీ సాహిత్యానికి మాతృభాష ముఖ్యం. ఈ నైపుణ్యాలు వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తాయి.

అలానే మాతృభాష సృజనాత్మక వైవిధ్యతను, అస్తిత్వాన్ని ప్రతిబింబించే విలక్షణతను అందించి, విజ్ఞానానికి, వినూత్నతకు వనరుగా ఉంటుంది.

చాలా జరగాల్సి ఉంది. బడిలో చేరిన మొదటి ఏడాదిలో బోధనా భాషగా విద్యార్థి మాతృభాషలో చదువు చాలా అరుదుగా అందుబాటులో ఉంది. యునెస్కో గణాంకాల ప్రకారం, 40 శాతం ప్రపంచ జనాభాకు వారి మాతృభాషలో లేదా వారు మాట్లాడి, వారికి అర్థమయ్యే భాషలో విద్యా బోధన అందుబాటులో లేదు. మాతృభాషలో విద్యాబోధన అత్యుత్తమమని, పిల్లలకు చదువు ఒంటబట్టడంలో బాగా సహకరిస్తుందని, మాతృభాషలో పట్టు ఉంటే వేరే ఏ భాషనైనా ఇట్టే నేర్చుకోవచ్చని ఎన్నో పరిశోధనలు తేటతెల్లం చేసినా, పైన చెప్పిన పరిస్థితే కొనసాగుతోంది.

మూలవాసులు సదా వారి మాతృభాషలలోనే విద్యాబోధన, విద్యా మాధ్యమం ఉండాలని కోరుకుంటున్నారు. ఈ విషయాన్ని ఐక్య రాజ్య సమితి మూలవాసుల హక్కుల ప్రకటనలో తెలపబడింది కూడా.

2019 సంవత్సరాన్ని దేశీయ భాషల అంతర్జాతీయ సంవత్సరంగా జరుపుకుంటున్నాం. అందువలన ఈ సంవత్సరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని – అభివృద్ధి, శాంతిస్థాపన, సయోధ్యలలో దేశీయ భాషల పాత్ర– అన్న అంశంతో జరుపుకుంటున్నాం.

ప్రపంచవ్యాప్తంగా 37 కోట్ల మూలవాసులు నివసిస్తున్నారు, వారు మాట్లాడే దాదాపుగా 7,000 భాషలు మనం మాట్లాడే భాషలలో సింహభాగం. అయినప్పటికీ మూలవాసులు సమాజంలో అట్టడుగు వర్గాలుగా తోసివేయబడుతూ, వివక్షతను ఎదురుకుంటూ కడుపేదవారిగా మిగిలిపోతున్నారు. అంతే కాదు మానవ హక్కుల ఉల్లంఘనలో పీడితులూ వీరే.

అందువలన ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం రోజున నేను యునెస్కో సభ్య దేశాలన్నిటినీ, మా శ్రేయోభిలాషులనీ, విద్యారంగంలో ఉన్నవారినీ మూలవాసుల హక్కులను గుర్తించి, అమలుపరచవలసినదిగా కోరుకుంటూ, ముందుకు రావాలని ఆహ్వానిస్తున్నాను.

నేను ప్రతి నెలా 'అమ్మనుడి' శ్రద్ధతో చదువుతున్నాను. 15-2-2019 యోగి వేమన 'శబ్ద గాండీవి–వ్యాసాలు అద్భుతంగా ఉన్నాయి. ఎన్నో తెలుసుకోవలసిన సత్యాలను ఆ వ్యాసాలు ప్రదర్శిస్తున్నాయి. ముందు ముందు 'అమ్మనుడి' లో అటువంటి విశేషాలను ప్రచురింప గోర్తాను – పత్రిక 'అంతరించి పోతున్న తెలుగు' అనే కుహనా పరీక్షలకు గుణపాఠం చెప్పగలదని ఆశిస్తున్నాను.

– బుద్ధ వరపు వేంకటరత్నం, హైదరాబాదు

ఓట్లు అడిగేది తెలుగులో...పరిపాలించేది ఉత్వర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?

సంపాదకీయం

పాలన, విద్యారంగాల్లో తెలుగు : ప్రతిపక్షాల విధానం ఏమిటి?

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికల వేడి మొదలైంది. వారం రోజుల్లో ఎన్నికల 'కోడి' కూయనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు ఎన్నికల వాగ్దానాలను విరజిమ్ముతున్నాయి. అధికారంలో వున్న పార్టీ తామే మళ్ళీ అధికారంలోకొస్తామనే ధీమాను ప్రదర్శిస్తూ మాట్లాడుతున్నా, అది వారి గుండెల్లోంచి వస్తున్నట్లుగాక, పెదవుల్లోంచి బయటకొస్తున్నటుగా ఉంది. అధినాయకుడూ ఆయన కుమారుడూ తప్ప తక్కిన నేతల్లో అంత ధీమా కనపడడం లేదు. మొత్తం తెలుగుదేశం పార్టీలోనే పైకి కన్పడని ఏదో భయం తమను తరుముతున్నట్లు అన్పిస్తున్నది. అధినాయకుని నుంచి అనునిత్యమూ వెలువడుతున్న ప్రసంగాలు, ప్రకటనలు వాగాడంబరంతో పాటు భయాన్ని, ఆందోళనను ప్రదర్శిస్తున్నాయి. చెప్పే మాటలకూ, ఆచరణకూ తేడా వుంటే వచ్చే ఫలితం ఇలాగే మొదలవుతుంది. ద్వంద్వ నీతి, సమన్వయ లోపం ఎదుటివారికి కన్పిస్తుంది. ఎన్నికల వేడి పెరిగే కొద్దీ అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడవేస్తుంది. ప్రతి పక్షాలకు బలాన్నిస్తుంది.

అధికారాన్నాశిస్తున్న ప్రతిపక్షాలు వైకాపా, జనసేన రెండూ బలాన్ని పుంజుకొంటున్నాయి. కాని, అధికారపక్ష నేతకు ప్రధాన ప్రతిపక్షంగా భాజపా కన్పిస్తున్నది. వ్యూహాత్మకంగా ఆయన జనసేన నేతను ప్రస్తావించకుండా కేవలం జగన్‌కే గురిపెట్టుతున్నారు. జనసేన పార్టీ అధికార పార్టీతో చేరనున్నదనే ప్రచారాన్ని బలంగా తెదేపా శ్రేణులు చేస్తున్నాయి. ఇదే సమయంలో పవన్ మాత్రం రాయలసీమ కేంద్రంగా చేసుకొని తె.దే.పా, వైసిపిలను రెండింటినీ గురిచేసుకొని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. మౌలిక సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ఆయన ప్రధాన బలం యువత. దానితోపాటు, ఔనన్నా కాదన్నా కాపు వర్గం మానసికంగా పవన్‌కు తిరుగులేని సమర్థతను ఇవ్వబోతున్నది. చంద్రబాబు ఆ వర్గాన్ని ఎంత దువ్వినా, వారు ఆయనను నమ్మే స్థితిలో లేరు. ఈ విధంగా ఆయనకు బలమైన ప్రతిపక్ష వర్గంగా వారు రూపు దిద్దుకొంటున్నారు. ఈ పరిస్థితిలో జనసేన తెదేపాలో చేరబోతున్నదనే ప్రచారాన్ని ఎవరూ నమ్మడం లేదు. అంత అవివేకంగా పవన్ కళ్యాణ్ ఉన్నాడనుకోవడం భ్రమ మాత్రమే. ఇదంతా పవన్ శక్తిని పెంచుతోంది.

ఇప్పుడు జనమంతా రాజకీయ నాయకుల వాగ్దానాలను నమ్మడం లేదు. సంక్షేమం పేరుతో చట్టబద్ధంగా ఇస్తున్న ఎన్నికల తాయిలాలనూ వారు అర్థం చేసుకోగలరు. అభివృద్ధి పేరుతో సాగుతున్న స్వార్థ రాజకీయాలను కూడా అర్థం చేసుకోలేనంత బుద్ధితక్కువగా ప్రజలు లేరు. ఇంత కాలంగా తాము మోసానికి బలి అవుతున్నామని వారు భావిస్తున్నారు. అందువల్ల పవన్ కళ్యాణ్ మౌలిక సమస్యలపై – ముఖ్యంగా తమ బిడ్డల చదువు, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలపై లోతుగా ఆలోచించడం జరుగుతున్నది. ఆ రంగాలు ఇంత ఖరీదైనవిగా అందుబాటులో లేనివిగా ఎందుకైనవా అని మథన పడుతున్నారు. గాలి, నీరు, ఆహారం కల్మషాలతో ఎందుకు నిండిపోతున్నాయో ఆరా తీస్తున్నారు. తమ భాషలో తమను పరిపాలించని ప్రభుత్వాలు, తమ భాషలో తమకు తీర్పు చెప్పని న్యాయస్థానాలు ఎందుకుండాలని వారిలో ప్రశ్న మొలకెత్తింది. తమ భాషలో తమకు చదువు చెప్పలేని విధంగా బోధనా వ్యవస్థ, ఎందుకు తయారైందని ప్రశ్నిస్తున్నారు. ప్రపంచంలోనే పెద్ద భాషల్లో ఒకటైన తమ తెలుగు భాషను 'పనికి మాలిన దాన్ని'గా త్రోసిపుచ్చుతున్న పాలకులపై కసి పెంచుకొంటున్నారు. డబ్బు పెట్టి కొనుక్కునేవిగా చదువూ, వైద్యమూ ఉన్న రాజ్యంలో తాము ఎందుకు బతుకుతున్నామని ఆవేదన పడుతున్నారు. మత్తు పానీయాలపై వచ్చే లాభాలు, పన్నులు లేకపోతే పరిపాలించలేము. అనే ప్రభుత్వాలను ఎందుకు ఎన్నుకోవాలని వారు అడుగుతున్నారు. ఆ దురలవాట్ల వల్ల ప్రజలు ముఖ్యంగా పేద ప్రజలకు, కార్మిక వర్గాలకు జరుగుతున్న హానిని తొలగిస్తామని, అందుకు ఫలానా

చర్యలను తీసుకొంటామని హామీనివ్వలేని పార్టీలను, అసలు ఆ అంశం గురించి మాట్లాడని పార్టీలను ఎందుకు ఎన్నుకోవాలనే ప్రశ్న నానాటికీ బలం పుంజుకొంటున్నది.

ఇలాంటి సమస్యలను ప్రముఖంగా ప్రస్తావించి, వాటికై తాము ఏం చెయ్యగలమో రెండు ప్రతిపక్ష పార్టీలూ స్పష్టంగా ప్రకటించాలి. అంతటి సాహసం చెయ్యడానికి ఇప్పుడు పూనుకోగల ధైర్యం అధికార పార్టీకి లేదు– ఇప్పటి దాకా వాళ్ళే అధికారంలో ఉండి ఆ రంగాలను వ్యాపారమయం, స్వార్థ పూరితం, ప్రజా వ్యతిరేకమూ చేసింది వారే గనుక! అంటే ఈ అంశాల మీద, ఇలాంటి అన్ని రంగాలలోని ప్రజా సమస్యల మీద – తాము ఏమి చేయగలరో, తాము అనుసరించదలచే విధానాలేమిటో స్పష్టంగా ప్రకటించవలసిన అవసరం ప్రతిపక్షాలకే ఉందన్నమాట!

ఇక్కడ ఇప్పుడు మేము నిరంతరం పనిచేస్తున్న 'ప్రజల భాషలో పరిపాలన, మాతృభాషలో విద్య' అనే అంశాలపై ప్రధానంగా ప్రశ్నించదలచుకొన్నాం.

గత కొద్దిరోజులుగా పవన్ కళ్యాణ్ విద్యారంగం గురించి మాట్లాడుతున్నారు. పాఠశాల విద్యనూ, ఇంటర్మీడియట్ చదువునూ అందరికీ ఉచితంగా అందిస్తామంటున్నారు. సంతోషం. ఇక్కడ ఆలోచించ వలసింది ఏమిటంటే ఉచితంగానో, చవుకగానో ఇప్పటి ప్రభుత్వాలూ ఈ చదువుల్ని అందిస్తున్నాయి. కాని, వారికి లేని ప్రజాదరణ – వ్యాపారంగానే విద్య నందిస్తున్న కార్పొరేటు సంస్థలకున్నదన్న మాట వాస్తవం. మరి, 1 నుంచి 12 దాకా విద్యారంగాన్ని మొత్తంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, పటిష్టంగా నిర్వహిస్తామని ఎన్నికల వాగ్దాన పత్రంలో ప్రకటించగలరా? ఆ విద్యను అందరికీ సమాన స్థాయిలో అందించేందుకు అత్యున్నత వ్యవస్థను నిర్మాణం చేయగలననీ, భరోసా ఇవ్వగలదా?

ఇందులో మరొక కీలకమైన అంశం – మాతృభాషలో విద్యను అందించడం. కనీసం ప్రాథమిక విద్యను మాతృభాషా మాధ్యమంలో తప్పనిసరి చేసి, పక్కనే – ఆంగ్ల భాషను ఒక సబ్జెక్టుగా మాత్రమే 5వ తరగతి వరకు బోధించాలి. 6 నుంచి – 12 వరకు రెండు మాధ్యమాల్లోనూ చదువుకోవడానికి అవకాశాలు కల్గిస్తూ ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకు తెలుగునూ, తెలుగు మాధ్యమ విద్యార్థులకు ఇంగ్లీషునూ ఒక సబ్జెక్టుగా పటిష్టంగా నేర్పించాలి. ఇలాంటి విధానం వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదు. ప్రజల్లో కొద్దిపాటి నమ్మకాన్ని ప్రభుత్వం కల్గించగలిగితే చాలు. ఇంత వరకు ప్రభుత్వం ఆ నమ్మకాన్ని కోల్పోయినందువల్లే ప్రజలు గందరగోళంలో మునిగి, విద్యా వ్యాపారస్తుల ప్రచారానికి, దుర్మార్గానికీ బలి అయ్యారు. ఆ పరిస్థితి నుండి ప్రజలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ఇందుకు ప్రభుత్వానికి తోడ్పడగల మేధావులకు, సామాజిక నేతలకు ఈ సమాజంలో కొరతలేదు.

ఇదే విధంగా – పరిపాలనను పూర్తిగా, అన్ని దశల్లో, అన్ని స్థాయిల్లో ప్రజల భాషలో అందిస్తామని ప్రతిపక్ష పార్టీలు తమ మానిఫెస్టోల్లో ప్రకటించాలి. ఇది తెలుగు రాష్ట్రం కనుక తెలుగులో పరిపాలించడమూ, న్యాయ వ్యవస్థ కూడా తెలుగులోనే నడిచేట్లు చూడడం కూడా తమ బాధ్యత అనీ ప్రకటించాలి. అంతేకాదు ఆ పార్టీలు తెలుగు రాష్ట్రంలో తెలుగుకీ, తెలుగువారికీ అన్ని రంగాలలో ప్రాధాన్యత అనీ ప్రకటించాలి. తెలుగువారు దేశంలో ఎక్కడ ఉన్నా వారి విద్యా సాంస్కృతిక అవసరాలకు తాము అండగా ఉంటామనీ ప్రకటించాలి.

తెలుగు రాష్ట్రం నిర్మాణమైన మౌలిక కారణాలను విస్మరించి, అరవై ఏళ్లుగా తెలుగు సమాజాన్ని ఇష్టా రాజ్యంగా పరిపాలించిన చరిత్రను సరిదిద్దవలసిన బాధ్యత తమ ముందున్నదని, ప్రతిపక్ష పార్టీలు ఒప్పుకోవాలి. ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అత్యున్నతంగా తీర్చి దిద్దేందుకూ స్వయం సమృద్ధిగా ప్రతి పౌరుడూ బ్రతకగల విధంగా తీర్చిదిద్దేవరకూ బాధ్యత వహిస్తామని ప్రకటించాలి. అప్పుడే ప్రతిపక్ష పార్టీలు ప్రజల సానుభూతిని, సమర్థననూ పొందగలుగుతాయి.

తేదీ : 1–3–2019

సామల రమేష్ బాబు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు
9866128846

బోధనామాధ్యమం:తెలుగు భాష-అభివృద్ధి

జీవకోటి మనుగడకు జీవ వైవిధ్యం ఎంత అవసరమో భాషా వైవిధ్యం కూడా అంతే ముఖ్యం. ప్రపంచంలో సమతూకాన్ని సాధించటంకోసం సమాచారాన్ని మనదైన భాషలో నియంత్రించగలగాలి. అందుకని మాతృభాషలను వాడాలి. అన్ని రంగాలలోనూ వాడాలి.

ప్రత్యేకంగా విద్యా మాధ్యమంగా మాతృభాషలతోనే జ్ఞానం అందరికీ అందుబాటులోకి వస్తుంది. మాతృభాషామాధ్యమం ద్వారానే ఉద్యోగ భద్రత, ఆర్థికాభివృద్ధి సాధ్యం.


మనం నిర్మించుకున్నది ప్రపంచం. దాని కంటే ముందునుంచీ ఉన్నది ప్రకృతి. పూర్వం, ప్రపంచం ప్రకృతిలో ఉండేది కానీ ఇప్పుడు, ప్రపంచం టెక్నాలజీలో ఉంటోంది? అంటే ఆనాడు కంటికి కనపడిందంతా ప్రకృతి అయితే ఈనాడు మన చుట్టూతా కనపడేది టెక్నాలజీనే. ఇంకా చెప్పాలంటే చుట్టూతా కాదు ఇప్పుడు మనం ఉన్నది టెక్నాలజీలోనే. ఇక టెక్నాలజీ, ప్రపంచం మమేకం అయ్యాయి.

ఈ టెక్నాలజీ సమాచారంతో నడుస్తుంది. అయితే ఈ సమాచారం ఏదో ఒక భాషలో ఉంటుంది. అంటే భాష శాసనం ఔతోంది. భాష నియంత్రణాధికారం పొందుతోంది. భాషలు ఆర్థిక పరమైన విలువలను సంతరించుకుంటున్నాయి. మనుషుల ఆర్థిక స్థాయికి భాషలు కొలమానాలుగా తయారవుతున్నాయి.

ఐతే మానవ సమాజాలలో ఇది ఏమీ పూర్తిగా కొత్తది కాదు. కాకపోతే ఆనాడు సమాజంలో చదువుకున్నవారు నూటికి ఒక్కరో ఇద్దరో ఉండేవారు. ఆ ఒకరిద్దరు సంస్కృతాన్నో మరో అధికార భాషనో నేర్చినంత మాత్రాన సమాజం మీద ఏ విధమైన ప్రభావమూ కనపడేదికాదు.

ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ చదువుకోవాలి. నూరు శాతం అక్షరాస్యత ఇప్పటి లక్ష్యం. కొన్ని కారణాలను చూపి సమాజం పరాయి భాషను బోధనా మాధ్యమంగా చేయాలనుకున్నప్పుడు అది మాతృభాషల చావుకు దారితీస్తుంది. అందుకనే ఆధునిక సమాజాలలో ఎలాంటి మార్పు తేవాలన్నా దానికి ఒక తర్కబద్ధమైన హేతుబద్ధమైన శాస్త్రీయ ప్రాతిపదికన సామాజిక స్పృహతో జరగాలి. వేల సంవత్సరాలనుండి బోధనామాధ్యమంగా ఉన్న తెలుగును ఆ స్థానంనుండి ఎలాంటి సైద్ధాంతిక ప్రాతిపదికన తొలగిస్తున్నట్లు? ప్రతిభాశీలురైన సామాజిక శాస్త్రవేత్తలూ విద్యావేత్తలూ అధ్యయనం చేసిన నివేదికల ఆధారంగా జరుగుతోందా. కాదు, అందుకే ఈ ఉద్యమం. ప్రజాస్వామ్యంలో మార్పులు ప్రజాస్వామ్య నిబద్ధంగా జరగాలి. ఎవరో కొందరి నిర్ణయాలను ప్రజలమీద రుద్దడం కాదు. పైపైకి కనబడుతున్న కొన్ని బాహ్య లక్షణాలను చూపి రోగ నిర్ణయం చేసి మందులు ఇచ్చి రోగాన్ని నయం చేయలేరు. ఇంగ్లీషును బోధనా మాధ్యమంగా చేయ దానికి సరైన ప్రాతిపదిక ఏమిటి?

ఉదాహరణకు, 2011 జనాభా లెక్కల ప్రకారం తెలుగు రాష్ట్రాలలో మొత్తం స్థూల రాష్ట్ర ఉత్పత్తి రూ.5 లక్షల, 63 వేల,



509 కోట్లు. ఈ సంపద సృష్టిలో పాలుపంచుకున్నవారి సంఖ్య 1 కోటీ 7 లక్షల 77 వేల 950మంది (మేధాజీవులూ, ఉద్యోగులూ, కార్మి కులూ, శ్రామికులూ రకరకాల పనివారు అందరూ ఇందులో ఉన్నారు). వారిలో 32.55 శాతం మంది నిరక్షరాస్యులే. ఇక మిగిలిన 67.55 శాతం అక్షరాస్యులలో 15.48 శాతం మాత్రమే పట్టభద్రులూ ఆ పైన చదువుకున్నవారు. అంటే నిరక్షరాస్యులనూ గ్రాడ్యుయేట్లుకాని అక్షరాస్యులనూ (52.02%) కలుపుకుంటే మొత్తం 84.52 శాతం ఉద్యోగులు మాతృభాషను మాత్రమే వాళ్లపనిలో వాడగలిగినవారు. వీరిలో హైస్కూలువరకూ చదివినవారి; శాతం 22.95. వీరికి; మాత్రమే కొద్దో గొప్పో ఇంగ్లీషు భాషతో పరిచయం ఉంది. ఇక స్థూలరాష్ట్ర ఉత్పత్తికి తోడ్పడుతున్న ఉద్యో గులలో గ్రాడ్యుయేట్లను (15.48%) మాత్రమే కొంతవరకూ ఇంగ్లీషు వాడగలిగినవారిగా గుర్తించవచ్చు.

అంటే, తెలుగురాష్ట్రాల స్థూలరాష్ట్ర ఉత్పత్తిలో షుమారు 84.52 శాతం తెలుగుభాష వాడుక ద్వారానే సమకూరుతోంది అని ఈ అంకెలు నిరూపిస్తున్నాయి. భాషా ప్రణాళికలకోసం ఇలాంటి ఆధారాలు అవసరం అవుతాయి.

నేలలో నీరు లేనప్పుడు మనకు గుర్తుకువచ్చేది ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని. ఇప్పుడు ఏకంగా తెలుగునేలలో తెలుగు ఎండిపోతోంది. ఇంటింటా ఇంకుడు గుంతలు తవ్వకతప్పదు. తెలుగు మాధ్యమంలో పాఠశాల విద్యలే ఇంకుడు గుంతలు.

నేడు ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది వేల భాషలు ఉన్నాయి. వచ్చే శతాబ్దానికి, వాటిలో కేవలం పది శాతం మాత్రమే మిగులు తాయి. ఎందుకంటే పెట్టుబడిదారీ లక్షణాలు ఉన్న సమాజాలలో పెద్ద భాషలు చిన్నవాటిని మింగేస్తాయి అని ఆపన్న భాషా పరిశో ధకుల అభిప్రాయం.

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ముంచుకొస్తున్న ప్రపంచీ కరణ ఈ మార్పులో పెద్ద పాత్ర పోషిస్తున్నాయి. మనం ఇప్పుడు వినే, చూసే సమాచార మాధ్యమాలు 50 సంవత్సరాల క్రితం ఊహించనైనా ఊహించలేదు. అంటే అనుకొన్నవి ఊహించినవాటి కంటే విపరీత వేగంతో వస్తున్నాయి అన్నమాట.

విపరీత వేగంతో విస్తరిస్తున్న విశ్వవ్యాప్త జాలికా వలయాలు మనం పనిచేసే విధానాన్నీ జీవించే విధానాన్నికూడా మార్చివేస్తు న్నాయి. ఇవి; సమాచార ప్రాప్తీ, మార్పిడులతో ప్రజల జీవితాలలో అనూహ్య మార్పులకు నాంది పలుకుతున్నాయి. సామాజిక సేవలూ పారిశ్రామిక ఉత్పాదనా రంగాలూ, వ్యవసాయం, విద్యా వైజ్ఞానిక రంగాలూ పెను మార్పులకు గురవుతున్నాయి.

మన జీవనవిధానాలను అన్నివిధాలుగా మెరుగు పరిచేందుకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి.

డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం, జ్ఞానాధారిత నైపుణ్య సామర్థ్యా లను ఎవరైనా ఎక్కడైనా ఎప్పుడైనా పంచుకొనేందుకు త్వరగానూ తేలికగానూ పెంచుకునేందుకూ అందుబాటులోకి తేవలసిన అవసరం ఉంది. దీనికి అక్షరాస్యతే ఆలంబన. ఆర్థిక సృష్టిలో అధికభాగం పాలుపంచుకొనేది సామాన్య జనమే.

కంప్యూటర్లపైనా అంతర్జాలంలోనూ మన కంటికి కనిపిస్తున్న చమత్కారం అంతా 'యాప్'లుగా మనం నిత్యం పిలుచుకొంటున్న కంప్యూటర్ అనువర్తనాలూ, వాటికి ఆధారమైన సమాచారనిధులూ, తద్వారా సుదూర అంతర్జాలికా వలయాలు నిర్వహిస్తున్న కోట్లాది సమాచారనిధుల నిల్వలదీ, అవి కావిస్తున్న ప్రక్రియలదీను. ఇది దాదాపు ప్రతి పరిశ్రమ పెరుగుదలనూ వాటి పురోగతినీ నియంత్రిస్తు న్నాయి. ఈ సాఫ్ట్వేర్లు లెక్కలేనంతమంది ప్రజలకు సాధికారతనూ ప్రపంచదేశాల వాణిజ్య వ్యాపారాలనూ తద్వారా మన జీవితాలనూ మెరుగుపరుస్తున్నాయి. ఇది ప్రపంచదేశాల జాతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది.

ప్రపంచ దేశాల ప్రజలు ఈ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు కావాలంటే అక్షరాస్యతే ప్రధానసాధనం. పెరుగుతున్న భాషా సాంకేతికత వలన భాషలమధ్య అంతరం తరిగిపోతోంది. మాండలిక భేదాలు మనని తికమక పెట్టవు. ఎవరికి వచ్చిన భాషలోనో మాండలికంలోనో వారు రాసుకోవచ్చు చదువు కొనేవారు వారికి వచ్చిన నచ్చిన భాషలోనో మాండలికంలోనో చదువు కుంటారు. ఇవి యాంత్రిక అనువాద మార్పిడులద్వారా సుసాధ్యం అవుతాయి.

అక్షరాస్యత ద్వారా నైపుణ్యాలను పెంచి ప్రజల మధ్య అసమాన తలను తగ్గించేందుకు నేటి డిజిటల్ ప్రపంచంలో ఎదురుపడిన సవాళ్లను అధిగమించడానికి కావలసిన అవసరాలను గుర్తించాలి. ఇప్పటికీ ప్రాథమిక అక్షరాస్యతా నైపుణ్యాలు లేనివారు నేటి ప్రపంచంలో చిన్నా పెద్దా కలిపి కనీసం నూరు కోట్ల మంది ఉన్నారు. వీరిలో భారతదేశం వాటా 37% పైనే.

ప్రపంచీకరణ పేరుతో లాభాల అన్వేషణలో ఉత్పాదన పని లోనూ, ఉత్పత్తులను గురించి మాట్లాడడానికీ మాధ్యమంగా ఇంగ్లీ షును మాత్రమే ఉపయోగించాలని బహుళజాతి వాణిజ్య సంస్థలు పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నా ఆ భావన ఆధునిక ప్రజాస్వామిక భావాలతో అసలు ముడిబడదు.

వాస్తవానికి, ప్రపంచీకరణ ప్రపంచాన్ని జయించటానికి కాదు ఉద్దేశించింది. తమ ఉత్పత్తులను ప్రపంచ జనాన్ని చేరడానికి మాత్రమే ఇది ఉద్దేశించింది. దీనికి కావాలసింది స్థానికీకరణ.

స్థానికీకరణలో భాషలపై దాడి జరగదు. ప్రజాస్వామిక పరి ధిలో మాత్రమే ప్రపంచీకరణ జరుగుతుంది.

మాతృభాషా మాధ్యమం అవసరం ఏమిటో అందరం అర్థం చేసుకోవాలి. విదేశాలలో ఉద్యోగాలు వస్తయ్యని చెప్పి తెలుగుకు తిలోదకాలు వదిలి ఇంగ్లీషు మాధ్యమ బోధన అనేక అనర్థాలకు దారి తీస్తుంది. కన్నతల్లినీ, జన్మభూమినీ ఎవరూ మరువకూడదని వల్లించే ప్రతి రాజకీయనాయకుడూ మాతృభాషను ఎలా మట్టి కరిపి స్తున్నారో అర్థంకాదు. ప్రపంచంలో అభివృద్ధిచెందిన ఏ దేశమూ మాతృభాషను వదులుకోలేదు. మాతృభాషలో విద్య సహజం. కావల సిన వనరులు ఉన్నదీ అందరికీ అందుబాటులో ఉన్నదీ. దానివలన లాభాలేగానీ నష్టాలు ఉండవు.

1. ప్రపంచీకరణతో అంతరిస్తున్న మాతృభాషల జాబితాకు అడ్డుకట్టవేసి మాతృభాషా మాధ్యమ ఉద్యమం భాషా వైవిధ్యాన్ని

కాపాడుతుంది.

2. భాషా వైవిధ్యంతో; స్థానిక వనరులతో;; ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.;

3. స్థానిక సామాజిక, ప్రసార మాధ్యమ పరిశ్రమలు (టీవీ, సినిమా, పత్రికలు, అంతర్జాలం) నిలదొక్కుకుంటాయి.;

4. మాతృభాషా కవులూ, గాయకులూ, రచయితలూ, చదువరుల అవకాశాలు పెరుగుతాయి.;

5. ప్రపంచంలోనే అతి పెద్ద పరిశ్రమగా పేరున్న భారతీయ ముద్రణా పరిశ్రమలో భాగమైన తెలుగు పరిశ్రమ మాతృభాషా మాధ్యమంతో కొత్త అవకాశాలు అందిపుచ్చుకుంటుంది.

6. ప్రపంచంలో రోజురోజుకూ పలుభాషల్లో పోగుబడుతున్న జ్ఞాన సృజనతో అనువాదాల అవసరాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి కొత్త ఉద్యోగాలకు అవకాశం వస్తుంది.

7. ప్రతి ఏటా మన విశ్వవిద్యాలయాలూ కాలేజీల లైబ్రరీలు దిగుమతి చేసుకుంటున్న పుస్తకాల విలువ వేలకోట్ల రూపాయల్లో ఉంటుంది. మాతృభాషా మాధ్యమంతో మన టీచర్లూ ప్రొఫెసర్లూ తాము బోధించే పరిశోధించే విషయాలపై పుస్తకాలు రాసే కాలం వస్తుంది. విదేశీ మారక ద్రవ్యం ఆదా ఔతుంది.

8. కార్పొరేట్, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మాతృభాషా మాధ్యమ బోధన కావటంతో సమాజంలో వర్గ విభేదాలకు తావులేకుండా విద్యను అందించవచ్చు.

ఇంగ్లీషు మాధ్యమం అమలుచేయడానికి ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయంతో వచ్చే నష్టాలలో ప్రధానమైనవి కొన్ని:

1. నిన్నటివరకూ తెలుగు పాఠాలు చెప్పిన టీచర్లు నేటినుంచి ఇంగ్లీషు పాఠాలు చెప్పటంతో పాఠశాల విద్య సంక్షోభంలో కూరుకుపోతుంది.

2. ఇంగ్లీషు మాధ్యమం అమలుతో ప్రజలలో ఇంగ్లీషు వచ్చినవారూ రానివారూ అంటూ రెండు వర్గాలుగా చీలిపోయి తెలుగు రాష్ట్రాలలోసామాజిక సంక్షోభం తలెత్తనుంది.

3. ప్రపంచ ప్రసిద్ధి పొంది, వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న తెలుగు సినిమా పరిశ్రమ ఇంగ్లీషు మాధ్యమం అమలుతో రెండు దశాబ్దాలలో మూతబడక తప్పదు.

4. లక్షలాది చందాదారులతో వందలాది టీవీ చానెళ్లతో వేలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న దృశ్యప్రసార మాధ్యమాలు మూలబడతాయి.

5. లక్షలాదిమందికి ఆధారమైన తెలుగు ముద్రణా పరిశ్రమ మెల్లగా అంతరించిపోతుంది.

మాతృభాషను మంటగలిపి మార్కెట్ భాషకు పట్టంకట్టే ప్రయత్నం ప్రజాస్వామ్యంలో జరగగూడదు. మాతృభాషా మాధ్యమంతో మనకు ప్రశ్నించే తత్వం అలవడుతుంది. మనం నేర్చేదీ చేసేదీ వినేదీ పారదర్శకంగా ఉంటుంది. దీనికోసం మనం మాతృభాషా మాధ్యమ ఉద్యమం నడపాలి.

కవిత

కొడిగడుతున్న తల్లినుడి

చేతబడులకు కాలం చెల్లలేదు
సుదూర తీరాల నుంచి చేస్తూనే ఉన్నారు
ఆంగ్ల మాధ్యమాలు- ఉన్మాద ఉద్యమాలు అంటూ
వీళ్ళంతా ఆధునిక మంత్రగాళ్ళే
వీరి మాయలో పడ్డారా
మాతృభాషను మరిపిస్తారు మృతభాషగా మిగుల్చుతారు
తెల్లోడు – ఆనాడు సంపదనే కొల్లగొట్టాడు
మరి నేడు-భాష అణుబాంబుతో సంస్కృతిని ఛిద్రం చేస్తున్నాడు
తెలుగు లోగిళ్లలో దూరిన; పామువంటి
పరాయి భాషలు తేట తెలుగును కాటు వేస్తున్నాయి
తెలుగుతల్లిని మింగేస్తున్నాయి
ప్రపంచ చరిత్రలో ప్రసిద్ధికెక్కిన ఏ రాజ్యమూ
తన తల్లి భాషను ఎడబాసి
ఏ ఎంగిలి భాషనూ ఆశ్రయించలేదు
మరి తెలుగునుడికే ఎందుకీ దుస్థితి
మారాలి ఈ పరిస్థితి!
ఒక జాతిని నాశనం చేయాలంటే
ముందుగా దాని తల్లిభాషను చంపితే చాలునట
అదే జరుగుతోంది
తెలుగు భాష తల్లడిల్లుతోంది
పర భాషపై వ్యామోహంతో
తల్లిభాషను ఇంటినుండి తరిమేస్తున్న ఓ తెలుగోడా...
ఇకనైనా నీ భాష గొప్పతనాన్ని తెలుసుకోరా!
అ ఆ ఇ ఈ లను సంక్షోభ శిధిలాల్లో సేకరించాల్సిన
సమయం రాకముందే మేలుకుందాం
తరతరాల తీయని తెలుగును కాపాడుకుందాం!
అమ్మనుడి నా అస్తిత్వానికి మారుపేరు!!

(ఆచార్య జి.ఉమామహేశ్వరరావు గారు రాసిన 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం' పుస్తకం చదివాక బాధాతప్త హృదయంతో, ప్రేరణతో రాసిన చిన్న కవిత ఇది. ఈ చిరు కవితను ఆయనకే అంకితమిస్తున్నాను...నమస్కారం)

– కె.సూర్యనారాయణ
పరిశోధక విద్యార్థి, భాషాశాస్త్ర శాఖ – ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

డా॥పి. శివరామకృష్ణ (శక్తి)
9441427977

భాషలు అంతరించి పోవటానికి కారణం చదువుకున్న వారి మనస్తత్వాలే

భూమి అడవి నీరు జ్ఞానం ఉత్పత్తి సాధనాలు. ఈ జ్ఞానాన్ని తరతరాలకు అందించడంలో వాంగ్మయం అంటే భాషది ప్రధాన పాత్ర. జ్ఞానం దేశ కాలాల పేర్లమీద అల్లుకున్న సంజ్ఞానం (సంజ్ఞ వజ్ఞానం) చుట్టూ పలుకుబడి నుడికారం సామెత పాట కథ ఇలా సాహిత్య రూపంలోతరతరాలకు సాగిపోతుంది. మానవుడు జ్ఞానం ద్వారా ప్రకృతిలోకి ప్రవేశిస్తాడు-ప్రకృతి కళ ద్వారా మానవుని లోకి ప్రవేశిస్తుంది. జాతి వ్యక్తిత్వంలో పరిసరం విడదీయరాని అంశం.

భాష అంతరిస్తుంది అంటే వారి జీవనాధారమైన సహజ వనరులు క్రమంగా క్షీణించి/పరాయి పాలై సమష్టిసృజనాత్మకత రూపంలో గల సాహిత్యం అంతరించి చివరకు భాష అంటే ఊపిరి వంతు వచ్చిందన్న మాట.

2. ఈ నేపథ్యంలో ఆదివాసుల భాషల స్థితిగతులను మన దృష్టికి తేవటానికి ఐ.రా.స.సంకల్పించింది. ఈ సందర్భంలో మన తెలుగురాష్ట్రాలలో గల గిరిజన భాషాసాహిత్యాల సంగతి పరి శీలిద్దాం.

గిడుగువారు సవర భాష బోధనకు మాత్రమేపరిమితం కాలేదు, వారి సృజనాత్మకత, జంతు విజ్ఞానం తెలిపే కథలు సేకరించారు. గుణుపూరులో సవరల పితూరీ, వారు చెప్పినట్లే సేకరించారు. జిల్లా జడ్జిగా పనిచేసిన జయంతి రామయ్య పంతులు గారి ద్వారా కొన్ని తీర్పులు సేకరించి సవరలు న్యాయస్థానాలలో పడుతున్న తొట్రు పాటు, తబ్బిబ్బులను వర్ణించారు. అంతేకాదు వారి ఆగ్రహానికి గురై మోడుగా మారిన ఇప్ప చెట్టు మధుకేశ్వరుడుగా పూజలందుకొంటున్న ముఖలింగ క్షేత్ర శాసనాన్ని పరిష్కరించారు. స్తలపురాణాన్ని వెలికి తెచ్చారు. ఈ విధంగా 1912లోనే ఆయన సవరల సంప్రదాయం ఎదుర్కొంటున్న సంఘర్షణను పసిగట్టారు.

నిజాం పిలుపు మేరకు చెంచు, కొండరెడ్డి గోండ్ తెగలను మానవ శాస్త్ర వేత్త హైమెండార్ఫ్ అధ్యయనం చేసి ప్రభుత్వ సలహాదారుగా వనరులరక్షణకు, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికారు(1942-52).. అంతేకాదు మలివిడతలో తన శిష్యుడు మైకేల్ చేత ఫిలిం తీయించాడు(1982). పోయినసెల మైకేల్ మళ్ళీ వచ్చి ఆ ప్రాంతాలు పర్యటించాడు.

ఆంధ్రుల సాంఘిక చరిత్రలో(1948) సురవరం ప్రతాపరెడ్డి హైమెండార్ఫ్ రచనలు ప్రస్తావిస్తూ, తెలుగు యువకులు గిరిజనుల ప్రతిభలు సాహిత్యం అధ్యయనం చేయాలని వారి అభివృద్ధికోసం పనిచేయాలని ఉద్బోధించారు.

తెలంగాణా సాయుధపోరాటం నాటినుండి గిరిజన ప్రాంతాలు కమ్యూనిస్టులకు ఆశ్రయమిస్తున్నాయి. వారు హైమెండర్ఫ్ రచనలను సంక్షిప్తంగా అనువదించుకొని మార్క్సిస్ట్ సిద్ధాంతానికి అన్వయించు కున్నారు. కొన్ని గిరిజన పాటల బాణీలో ఉద్యమ సాహిత్యం సృష్టిం చారు. హేతువాదం శాస్త్రీయ దృక్పథం దృష్టితో వారు సంప్రదాయ సాహిత్యం తిరోగమన ధోరణి గలదిగా భావిస్తారు. వారు రష్యన్ జానపద సాహిత్యం అనువదించుకున్నారు, పునర్ముద్రించుకుంటు న్నారు కానీ మన జానపద గిరిజన సాహిత్యం పట్టించుకోరు.

"Folk lore is material about the hopes and yearnings of the people…so necessary and important for the study of their psychology" అన్న లెనిన్ మాటలు వారు విస్మరించారు.

3.'దుర్గమాలైన మహానదులు పర్వతపంక్తులు, అరణ్యాలు రెండు భాషాప్రాంతాలను వేరుచేస్తూ ఆయా వ్యవహర్తల రాకపోకలకు ఆటంకాలుగా ఉన్నంతవరకు అవికూడా భాషామండలాలకు సరి హద్దులవుతాయి.ఇటీవల రాకపోక సౌకర్యాలవల్ల పరిస్థితి కొంత మారినా పూర్వచరిత్రలో ఏర్పడ్డ మాండలిక భేదాలు అంత తొందరగా మాసిపోవు'(1960)అని మాండలిక వ్యవసాయ వృత్తి పదకోశం పీఠికలో నిర్వచించిన భాషా శాస్త్రజ్ఞులు తెలుగు గిరిజన మాండలికాన్ని పట్టించుకోలేదు.అటు పోలేదు.

అరకులోయలో కోదుతెగ వారి భాషను అధ్యయనం చేస్తూ దానికి 'సాహిత్య పుష్టి' లేదని పేర్కొన్నారు. కానీ వారి గురువు తోడా తెగవారి పాటలు ప్రచురించారు.

4.ప్రపంచమంతా గిరిజన సాహిత్యం కళల మీద అధ్యయ నాలు, ఆధునిక సాహిత్య సిద్ధాంతాలకు ఒరవడి దిద్దాయి. పికాసో వంటి కళాకారులకు స్ఫూర్తినిచ్చాయి.

విలక్షణమైన శీతోష్ణ పరిస్థితులు భౌగోళిక స్వరూపం జీవ వైవిధ్యం గల చిన్న చిన్న ప్రాంతాలలో వర్ధిల్లే ప్రతి తెగల సంస్కృతి వారి తాత్విక చింతనను తగినంత పరిచయంతో ప్రచురించటం అవసరం. నేషనల్ బుక్ ట్రస్ట్ అన్ని రాష్ట్రాల జానపద సంస్కృతి మీద ప్రచురణలు తెచ్చింది.అదేవిధంగా సాహిత్య అకాదమి గిరిజన తెగలసాహిత్యం ప్రచురిస్తున్నది. కానీ ఈ కృషి మరింత సమగ్రత సంతరించుకోవాలి.

తెలుగు గిరిజనసాహిత్యం సేకరణ విశ్లేషణ (1982)పూర్తై, 1990లో అచ్చైన 'తెలుగు గిరిజన గీతాలు'ను రచయితలు పేర్కొ న్నారు కాని పట్టించుకోలేదు. మాతృ భాషలో విద్యాబోధనకోసం వచ్చిన నిధులతో ఇతర భాషలకు మొక్కుబడి వాచకాలు తయారు చేయించారు.

5. ఈ అశ్రద్ధ ఫలితంగా ఈ నాటి గిరిజనభాష సాహిత్యాల

పరిస్థితి ఎలాదిగజారి పోయిందో వర్ధమాన గిరిజన రచయిత, ఉపాధ్యాయుడు మల్లిపురం జగదీశ్ ఇలా వివరిస్తాడు.

'ఆదివాసీ కథ సాహిత్యం అనగానే ఉద్యమకథ అనే అభిప్రాయం స్థిర పడిపోయింది'.

గిరిగింజ గిరిమల్లెలు' అనేపుస్తకాన్ని నల్లమల ఫౌండేషన్ ప్రచురించింది.' (బహుళ 2018 పెర్స్పెక్టివ్స్ ప్రచురణ)

ఇవితప్ప అమ్మనుడి, నడుస్తున్న చరిత్రలలో ధారా వాహికంగా నల్లమలలో చెంచు ప్రపంచం గా వచ్చిన చెంచుల కొండరెడ్ల సంప్రదాయ సాహిత్యం, ఇటీవల ప్రభుత్వాలను గడగడ లాడించిన గిరిజన పోరాటాలవార్తలు రచయితల దృష్టికి రాలేదంటే లిఖిత సాహిత్యం, విమర్శలు ఎలా బావిలో కప్పలవలె ఉన్నాయో, గుంపులచుట్టూ తిరుగుతున్నాయో అర్థమవుతుంది.

6.ఇటీవల ప్రశంసలు పొందిన యాత్రాసాహిత్య రచయితలు ప్రసిద్ధమైన స.వెం.రమేశ్ 'ప్రళయకావేరి' నవల చదివి వుంటే ఇంకా ఎంతో బాగా ఆ ప్రాంతం యాత్రలో ఆనందించి, మరింత బాగా రాసి ఉండే వారు. కుందూరి ఈశ్వరదత్ 'ప్రాచీనాంధ్ర భూగోళం' లో నల్లమల వర్ణనను, వేటూరి ప్రభాకర శాస్త్రి గారు గుండ్లకమ్మనది మీద సేకరించిన చాటువులను ముఖపుస్తకంలో ఇస్తుంటే, ఇవెక్కడివి ? యాత్రసాహిత్యం మాకు ప్రమాణం అని ఒకరు. ఇటు వంటి రచనలలో జపాన్ హైకులు కనిపిస్తాయి తప్ప గిరిజనుల పాట ఒక చరణమైన కనిపించదు.

7.భాషకు ప్రాచీన హోదా చర్చలలో అంతా రాజకీయం అంటూ వాదించారు తెచ్చుకున్నారు. మన భాష ప్రాచీనత తెలుసుకోటానికి సమకాలికులైన మనపూర్వులు తెలుగు గిరిజనుల మాండలికం అధ్యయనం చేయాలి అని ఒక్క పండితుడు అనటం లేదు.

8.పరాయి వాళ్ళు మన భాష నేర్చుకోవాలంటే మన సంస్కృతిలో శాస్త్రజ్ఞానం వెలికి తీయాలి అని జ్ఞానోదయమైన అమెరికా తెలుగు పండితుడు పేర్కొంటే, శాస్త్రమా ! ఎవడు పాలిస్తుంటే వాడి శాస్త్రం రుద్దుతాడు. మనం చేయగలిగింది ఏముంది అంటూ ఒక భాషావేత్త పెదవి విరిచాడు. శాస్త్రం లేని జాతి తెలుగు అయి తేనేం తెంగ్లిష్ అయితేనేం! మానవజాతి ఉన్నంతకాలం భాష ఉంటుంది. ఉద్యోగాలుంటాయి. ఎవడి భాష అయితేనేం! ఎవడు పెత్తనం చేస్తేనేం!

9. సంజ్ఞాన విధానం మాతృ భాషలో బోధన మీద సిద్ధాంత చర్చ జరిగింది..గిరిజనుల మత్స్యకారుల సంజ్ఞానం వివరించే పటాలు గీసి అవాసాల సరిహద్దులను, వాటి మధ్య ఉమ్మడి వనరులు గుర్తించి శాశ్వత హక్కు ఇవ్వమని ప్రభుత్వాలు చట్టాలు చేసి ఆదేశిస్తున్నాయి. గుర్తింపు పొందని వాళ్ళను తొలగించండి అని న్యాయస్థానం ఇచ్చిన దుందుడుకు ఉత్తర్వులు సవరించుకోమని రాజకీయ పార్టీలు పోటిపడుతున్నాయి. ఈ ప్రయత్నాలలో పాలుపంచుకోవడం ద్వారా భాషోద్యమాన్ని బలపరచవచ్చు అని భాషాభిమానులకు, పీఠాధిపతులకు తోచటం లేదు.

10.శాస్త్రవేత్తలు తమకు కావలసిన మేరకు వనరుల సంప్రదాయంగా వస్తున్న పేర్ల జాబితాలు తయారు చేసుకుంటున్నారు. భాష ఆ మేరకు కుంచించుకు పోతుంది. ఇంకా నయం ఆ మాత్రమన్నా మిగిలింది.

11. చేనేత మొదలైన రంగాలలో నిపుణులు పనిచేస్తున్నారు. చిరు ధాన్యాల వంటి సంప్రదాయపంటలకు, రుచులకు వంటలకు ఆదరణ పెరుగుతోంది. కానీ వాటికీ సంబంధించిన భాషాపరమైన సంప్రదాయవాదుకలు పాటలు సామెతలు నుడికారాలు ప్రచారం కావటం లేదు.

చాలామంది తామే తెలుసుకున్నట్టుగా కనిపెట్టినట్లుగా పత్రికల భాషలో రాస్తున్నారు. ఉక్తి వైచిత్రి చమత్కారాలతో మురిపిస్తున్నారు. ఇలా మొత్తానికి చదువుకున్నవాళ్ళు, చదువుకున్న వాళ్ళకోసం రాసే సాహిత్యం పెరిగిపోతుంది.

'లిపి మాత్రమే తెలిసి తేలికైన పుస్తకాలు చదువుకునేందుకుతప్ప భాష లోతుల్లో దాగిన సాంస్కృతిక సంపద కు ఈ తరం దూరమైంది. దీనివల్ల సామాజిక జీవనంలో అంతులేని సామరస్యానికి దోహదం చేసిన సమష్టి సంస్కృతి నశించి పోతున్నది' (నాయని కృష్ణకుమారి. వేముల పెరుమాళ్ళు తెలంగాణ జాతీయాలు ఆశీస్సులో).

ఒక పండితుడు పడవవాడితో 'నీకు వాతావరణ శాస్త్రం తెలుసా !' అంటూ బడాయి పోయినాడు. వాడు నీకు ఈత వచ్చునా!! అని వెక్కిరించడం గుర్తుంచుకోవాలి. భాషతో సహా జాతిలో నైపుణ్యాలు నశిస్తే ప్రమాదం తప్పదు. అపుడు గుడ్డిగా శ్రమించే వర్గం ఆ శ్రమను నిర్దేశించే వర్గంగా సమాజం తయారౌతుంది.

'సమాజంనుండి సాహిత్యం వస్తుంది. సాహిత్యం నుండి సమాజం రాదు. చెట్టుకు పూవు పూస్తుంది.పూవుకు పూవు పూయదు' అంటారు మార్క్సిస్ట్ విమర్శకుడు త్రిపురనేని మధుసూదనరావు.ఇలా నానాటికి తీసి కట్టుగా సంస్కృతి సాహిత్యం శాస్త్రం భాష ఒకటొకటి అంతరిస్తున్నాయి. సంకర విత్తనాలతో అధిక దిగుబడి అని చంకలు గుద్దుకుంటున్నారు కొందరు. కానీ జన్యు సంపద/ జీవధాతువు చంక నాకి పోతుందని తెలుసు. కానీ బతక నేర్చిన తరం కదా! ఎవరి సోకుకు వారు మురిసిపోతున్నారు.

'ఎయ్యెడ మేలుచూతురు గ్రహింపరు జాణలు జారుపాటులన్' ఈ హ్రస్వ దృష్టి వదిలి ముందు చూపుతో భాషను సంస్కృతిని భావితరాలకు అందించాలి.

పాతూరి మాణిక్యమ్మ సాహిత్య పురస్కారం

పాతూరి మాణిక్యమ్మ సాహిత్య పురస్కారం కొరకు 2017, 2018 సం॥లో ప్రచురింపబడిన తెలుగు వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. అనివార్య కారణాల వలన పోయిన సంవత్సరం పోటీ నిర్వహించనందున 2017కు విడిగాను, 2018 కు విడిగాను రెండు పురస్కారాలు ఇవ్వబడతాయి. ఈ పోటీకి ఏ రాష్ట్రంలోని వారైనా పాల్గొన వచ్చును. విజేతలకు రూ. 5,000/- నగదు బహుమతితో పుర స్కారం జరుపబడును. రెండు కవితా సంపుటాలను తేది 30-04-2019 లోగా డా॥పాతూరి అన్నపూర్ణ, 1156/28 -1, ప్రశాంతి నగర్, నవలాకులతోట, నెల్లూరు-2, కు పంపా సెల్:9490230939, లో సంప్రదించవచ్చు.

వెన్నెలకంటి రామారావు
9550367536

భౌతికవాద భాషోద్యమమే కావాలి!

అంతర్జాతీయ సమాజం ప్రతి ఏడాది ఫిబ్రవరి 21 తేదీన జరుపుకునే మాతృభాషా దినోత్సవం సందర్భంలో ప్రతిసారి స రికొత్తగా సంకల్పాన్ని ప్రకటిస్తుండడం ఒక ఆనవాయితీగా మారింది. అదే కోవలో అభివృద్ధి, శాంతి స్థాపన, సయోధ్యల స్థాపనకు దేశీయ భాషలే ముఖ్యమని ఈ ఏడాది ఇతివృత్తంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అయితే గత సంకల్పా ల అమలుకు భిన్నంగా ఈసారి కూడా మాతృభాషల పరిరక్షణ విషయంలో అంతర్జాతీయ సమాజం పెద్దగా సాధించేదేవీ ఉండదని కొందరు భాషావేత్తలు పెదవి విరుస్తున్నారు. మాతృభాషల పరిరక్షణ అంటే దేశీయ భాషల పరిరక్షణ అనే అవగాహన ప్రజలకు ఏదో ఒక మేరకు కలిగించేందుకు ఈ సందర్భంగా ఆ సంకల్పం ఉపకరిస్తుందనడంలో తెలుగు భాషోద్యమకారులకు ఎలాంటి సందేహం ఉండనక్కరలేదు.

పర్యావరణం, సామాజిక శ్రమల పునాదిగా ఆవిర్భవించిన సామాజిక చైతన్యం భాషల ద్వారానే నిక్షిప్తమై తర్వాత తరాలకు అందించడం జరుగుతుందని, అయితే ప్రపంచంలోని సుమారు 7వేల భాషల్లో 1970ల మధ్య కాలం నుం చి ఇప్పటి దాకా 60 శాతం భాషలు అంతరించిపోగా, 2030 నాటికి 90 శాతం అంతిరంచిపోగలవనీ, అలాంటి వాటి జాబితాలో తెలుగు భాష కూడా ఒకటని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అయితే ఇలా అంతరించిపోతున్న భాషలు దక్షిణార్ధభూగోళ జీవ వైవిధ్య ప్రాంతాల్లోనివి. ఉత్తరార్ధ భూగోళంలోని అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలకు ముడి సరుకుల, చౌక శ్రమ శక్తి, అదనపు మార్కెట్లుగా మారిన ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండ దేశాలకు చెందిన ఒనరులను కొల్లగొట్టడమే కాక, స్థానిక జీవవైవిధ్య జ్ఞానాన్ని, పరిసరాల విజ్ఞానాన్ని నిక్షిప్తం చేసుకున్న స్థానిక భాషలు (దేశీయ భాషలు) అంతరిస్తున్నాయి. దాంతో ఆభాషా జాతీయుల అస్తిత్వం సంక్షోభంలో పడింది. ఆయా భాషల్లో నిక్షిప్తమైన వైవి ధ్యభరితమైన మానవ జ్ఞానం విశ్వజనీన జ్ఞానం మారకుండానే అంతరించి పోతుంది. స్థానిక పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ మనుగడ సాగించవలసిన అవసరం /పట్టింపులేని ఉత్తరార్ధ గోళ పారిశ్రామిక దేశాల కార్పొరేట్ దిగ్గజాల అత్యాశకు, దోపిడికి అక్కడి ప్రకృతి వనరుల విధ్వంసం జరుగుతోంది. పర్యవసానంగా సమాజానికి-ప్రకృతికి మధ్య ఆదాన ప్రదాన క్రమానికి గండి పడి, పర్యావరణ సంక్షోభం అవతరించింది. అభివృద్ధి పేరుతో సాగే కార్పొరేట్ విధ్వంసంవల్ల ప్రపంచ మూలవాసులు నిర్వాసితులుగా మారి తమ జీవనాన్ని, భాష, స్థానిక విజ్ఞానం సహా మొత్తం సంస్కృతిని కోల్పోతున్నారు. సారూప్య (ఐడెంటిటీ రిలేషన్) లో కొనసాగుతున్న ప్రకృతి-సమాజంల మధ్య సమతుల్యతకు గండిపడడం, స్థానిక సాంస్కృతిక విధ్వంసం వల్ల స్థానిక పర్యావరణ విధ్వంసం జరుతుంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ శక్తుల వలసల, సంపద దాహంతో యావత్ భూగోళం సామాజికార్థిక-పర్యావరణ సంక్షోభంలో (యుగ సంక్షోభం - ఎపోకల్ క్రైసిస్) కూరుకుపోయి కొట్టుమిట్టాడుతోంది. 2008 నుంచి అది పతాకస్థాయికి చేరుకుంది. ఒకవైపు వాతావరణ మార్పు క్రమానుగత స్థితి నుంచి ఆకస్మిక భీకర మార్పులు చోటు చేసుకునే స్థితికి చేరుకుంటోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

సామాజిక ఆర్థిక సంక్షోభం కారణంగా యుద్ధాలు, ప్రపంచ యుద్ధాలు జరగొచ్చని భౌగోళిక రాజకీయ విశ్లేషకులు మరో వైపు హెచ్చరిస్తున్న నేపథ్యంలో జాతీయ భాషల పరిరక్షణ ద్వారానే అభివృద్ధి, శాంతి స్థాపన, ప్రజల మధ్య సయోధ్య సా ధించగలమని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. భాషల పరిరక్షణ ద్వారా భాషా జాతీయుల అస్తిత్వ పరిరక్షణ సాధ్యమ వుతుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక సంక్షోభాన్ని నివారించవచ్చని ఆ సంస్థ ప్రచారం చేస్తోంది. అందుకు అనుగుణమైన కార్యాచరణనను చేపట్టింది. అయితే అందుకు ఎలా చేయాలో, ఏం చేయాలో చెప్పడం ఆ సంస్థకు కష్టసాధ్యం. ఇంతటి విషాదకరమైన యుగ సంక్షోభానికి అసలు కారణం ఉత్తరార్ధ భూగోళ అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన కార్పొరేట్ శక్తులు, వాటి దక్షిణార్ధ గోళ దళారి కార్పొరేట్ సంస్థల దోపిడి, అత్యాశకు ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీ య ప్రభుత్వాలే అసలు కారణం. ఆ కారణం తొలగకుండా దేశీయ భాషల పరిరక్షణ కానీ, యుగ సంక్షోభ పరిష్కారం కానీ అసాధ్యం. ఆ కారణాన్ని విస్మరించి దేశీయ భాషలు సహా సంస్కృతి పరిరక్షణ, వాతావరణ మార్పు అంతర్జాతీయ ఒప్పందాలు ఎన్ని జరిగినా అవి నిరర్థకమే.

పెట్టుబడిదారీ విధానం ప్రారంభ కాలం నుంచి ఆధునిక ప్రపంచీకరణ ప్రారంభమై, వరుసగా లోకోవేటివ్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ల రూపంలో సాగిన పారిశ్రామిక పరిణామం క్రమంగా వేగం పుంజుకొని పరాకాష్ఠకు చేరింది. ప్రపంచ మార్కెట్ సుస్థిరమయ్యే క్రమంలోనే ప్రపంచ సాంస్కృతిక ప్రపంచీకరణ క్రమం కూడా అందుకు సమాంతరంగా సాగింది. మార్కెట్ ప్రపంచీకరణ స్థానిక ఉత్పత్తిని మాత్రమే కాదు, స్థానిక ఉత్పత్తి పద్ధ తులను, విధానాన్ని, విజ్ఞానాన్ని కాలరాచింది. అదే సమయంలో దానికి సమాంతరంగా స్థానికంగా చారిత్రక క్రమంలో సాగిన ఉత్పత్తి విధానంతో ముడిపడిన సాంస్కృతిక వికాసం కూడా నిర్దాక్షిణ్యంగా అంతర్థానమయింది. అభివృద్ధి చెంది న దేశాల పారిశ్రామిక విధానం దక్షిణార్ధ గోళ వ్యవసాయక దేశాల స్థానిక ఉత్పత్తి పద్ధతిని, సంస్కృతిలోని అనేక అంశాలను తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసేందుకు ఉపకరించినంత మేరకు విశ్వజనీనం చేసి మిగిలిన

విజ్ఞానాన్ని, భాషా సంస్కృతులను నిర్లక్ష్యం చేసింది. దాంతో దేశీయ భాషలు క్రమంగా అంతరించిపోయాయి. విడివిడిగా, ముకుళిత ఆర్థిక వ్యవస్థలు, సమాజాలుగా కొనసాగుతూ, ఎదుగుబొదుగూ లేని ఫ్యూడల్ సమాజాల స్థానంలో...విచక్షణారహితంగా తన పూర్వ సమాజాలన్నిటి విలువైన మానవ విజ్ఞానాన్ని, దాన్ని నిక్షిప్తం చేసుకున్న భాషలను ధ్వంసం చేస్తూ పెట్టుబడిదారీ సమాజం భూగోళమంతా ఆవరించింది. ఈ నేపథ్యంలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రపంచీకరణలు ఎవరి ఇష్టాయిష్టాలు సంబంధం లేకుండా సాగే అనివార్యమైన వస్తుగత చారిత్రక పరిణామం. జ్ఞానం ఎప్పుడూ స్థానికంగానే ప్రారంభమై క్రమంగా విశ్వజనీనమవుతుంది. అయితే ఆ ప్రపంచీకరణ క్రమం దేశీయ భాషల్లో నిక్షిప్తమై ఉన్న స్థానిక విజ్ఞానాన్నంతటి నీ పొదివి పట్టుకుంటూ, సంశ్లేషిస్తూ సాగితే మానవజాతి సవ్యమైన రూపంలో పురోగమించి ఉండేది.

అలా కాక మితిమీరిన పారిశ్రామికీకరణ, మితిమీరిన జనాభా కేంద్రీకరణ, మితిమీరిన సంపద కేంద్రీ కరణల క్రమం అనివార్యంగా విచక్షణారహిత పర్యావరణ విధ్వంసానికి దారితీస్తున్నాయి. పర్యవసానంగా స్థాని క జీవ వైవిధ్యపు జ్ఞానాన్ని తవ్వితీస్తున్న, నిక్షిప్తం చేస్తున్న స్థానిక / జాతీయ భాషలు అంతరించిపోతున్నాయి. అయితే కార్పొరేట్ శక్తుల ప్రపంచ మార్కెట్ ఆధిపత్యం, దోపిడీ కారణంగా స్థానిక ప్రజల అనుభవంలో సాధించిన సామాజిక, పర్యావరణ విజ్ఞానమంత – విశ్వ మానవ విజ్ఞానంలో అంతర్భాగం కాకుండా పోతోంది. దక్షిణార్ధ గోళ వ్యవసాయక సమాజాల భాష, వి జ్ఞానం, సంస్కృతులను ధ్వంసం చేస్తూ, ఉత్తరార్ధ భూగోళ పారిశ్రామిక అభివృద్ధి చెందిన సమాజాల భాష సంస్కృతులు భూగోళమంతా వేగంగా విస్తరిస్తున్నాయి.

ఇంగ్లీషు తదితర అభివృద్ధి చెందిన దేశాల భాషలు ఉపాధి భాషలుగా ప్రచారం పొంది మిగిలిన భాషా జాతీయుల అస్తిత్వాన్ని ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు రోజువారీ వ్య వహారాల్లో మాట్లాడుకునే సహజ భాష, స్థానిక విజ్ఞాన శాస్త్రాభిక్రమంలో వివిధ వైజ్ఞానిక శాఖలు (గణితం, భౌతికశాస్త్రం, సామాజిక శాస్త్రాలు) పరిభాషలుగా అవతరించే కృత్రిమ భాష అనే రెండు అంశీభూతాలతో (కాంపొనెంట్స్) భాషలు అభివృద్ధి చెందుతాయి. అవి రెండూ పరస్పర పూరకాలుగా అభివృద్ధి చెందడమే భాషాభివృద్ధి. కమంగా గుర్తించాలి. అభివృద్ధి చెందిన ఉత్తరార్ధ భూగోళ పారిశ్రామిక దేశాలు స్థానిక ఉత్పత్తి పద్ధతులను, సంబంధాలను, విజ్ఞానాన్ని ధ్వంసం చేయడంతో దక్షిణార్ధ గోళ జీవ వైవిధ్యంతో కూడిన వ్యవసాయక దేశాల ప్రజ ల చారిత్రక కృషితో వృద్ధి చెందిన భాషల్లోని కృత్రిమ భాష పెద్ద ఎత్తున ధ్వంసమవుతుంది. పర్యవసానంగా కృత్రిమ భాషతో పరస్పర ఆధారితంగా ఉన్న రోజువారి భాషా వ్యవహారాలుగా ఉన్న సహజ భాషలు కూడా క్రమంగా అంతరించిపోతాయి / పోతున్నాయి. ఈ నేపథ్యంలో తమ భాషలు అంతరించిపోతున్న క్రమాన్ని ప్రతిఘ టిస్తూ స్థానిక / దేశీయ భాషా ప్రియులు మాతృభాష పరిరక్షణ పేరుతో సంబంధిత భాషలకు చెందిన పాత నుడికారాలనే వాడుకలోకి తీసుకురావాలని ఉద్యమిస్తున్నారు. ఒక సమాజంలోని ఉత్పత్తి విధానం స్వీయాభివృద్ధి క్ర మంలో భాగంగా అభివృద్ధి చెందే విశిష్ట సామాజిక సంబంధాలకు అనుగుణంగా వ్యవహర్తలు దైనందిన జీవితాల్లో వినియోగించే సహజ భాషా సంపదను విజ్ఞాన శాస్త్రాల అవసరానికి తగిన విధంగా ఏర్పడే కృత్రిమ భాష – సంపదలను అంశీభూతాలుగా కలిగి ఉంటుంది. ఈ రెండింటి పునాదిగానే ఆ భాషాజాతీయ సమూహం, భాషా సంపద అభివృద్ధి చెందుతుంది. ప్రపంచీకరణ క్రమంలో ప్రపంచ మార్కెట్ మరింతగా విశ్వజనీనమవడాని కి సమాంతరంగా స్థానిక విజ్ఞానం, సంస్కృతిని విశ్వజనీనమయ్యే ప్రక్రియ పరాకాష్టకు చేరుకుంటుంది. మానవ జాతి వైవిధ్య భరిత జ్ఞానాన్ని సంశ్లేషించడంలో సమకాలీన కార్పొరేట్ శక్తుల ఆధిపత్య ప్రపంచ మార్కెట్ విధానం పూర్తిగా విఫలమైంది. అది యుగ సంక్షోభానికి దారి తీసింది. అందుకు భిన్నంగా సమాజం – ప్రకృతిల మధ్య ఆదాన ప్రదాన క్రమాన్ని పునరుద్ధరించి, సజీవంగా నిలిపే సామాజికార్థిక విధానం ద్వారా విశ్వ మానవ సమసమాజం ఏర్పరచే లక్ష్యంతో సాగే రాజకీయాల సారథ్యంలోనే యుగ సంక్షోభానికి ఒక పరిష్కారం దొరుకుతుంది. ఈ నేపథ్యంలో దేశీయ భాషల పాత నుడికారాలను పునరుద్ధరించే పేరుతో సాగే భావ వాద, స్వీయాత్మక భాషోద్యమాలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తాయి. పాత నుడికారాలను పునరుద్ధరించే అహేతుక భాషో ద్యమం సదరు భాషాజాతీయుల్లో తమ మాతృభాషలు ఉపాధి కల్పించలేవనే అపోహలను మరింత పెంచుతారు

విశ్వమానవ సమ సమాజం వైపు ప్రయాణం చేసే క్రమంలో స్థానిక భాషల పరిరక్షణ ఉద్యమం ఏ రూపంలో స్థానిక ప్రజల అమూల్యమైన జ్ఞాన సంపదను సంరక్షించుకోవలసి ఉంటుంది. అందుకు ప్రపంచ భాషల నుంచి పరస్పర ఆదాన ప్రదానాల క్రమం సజావుగా సాగే రూపంలో భాషా పరిరక్షణ ఉద్యమం సాగితేనే మానవాళి సాధించిన జ్ఞాన వైవిధ్యాన్ని విశ్వజనీనంగా సంఘటితం చేయగలం. కుల, మత, ప్రాంత, జాతి, జెండర్ తదితర అస్తిత్వాల అంతరాలు, అసమానతలు, అణచివేతలు అంతరించి విశ్వ మానవ సమ సమాజం ఏర్పడే సమయానికి... ప్రపంచ భాషలు మధ్య జరిగే ఆదాన ప్రదానాలు, వాటి పరస్పర అంతర్భాగీకరణ (ఇన్ కార్పొరేషన్) జరిగి విశ్వ భాష అవతరిస్తుంది. విశ్వవ్యాప్త పరస్పర అంతర్భాగీకరణ క్రమాన్ని, స్థానిక భాషలు (కమంగా అంతర్ధానమై విశ్వభాషగా అవతరించాల్సిన గమ్యాన్ని అర్థం చేసుకోవాలి. ప్రపంచం గ్లోబల్ విలేజ్గా మారుతుండడం ఒక అనివార్యమైన పరిణామమైనప్పుడు భాషలు అంతర్ధానం కూడా ఒక అనివార్యమైన చారిత్రక పరిణామంగా సాగుతుంది. ఈ క్రమాన్ని గుడ్డిగా వ్యతిరేకిస్తే సామాజిక వైపరీత్యాలు జరుగుతాయి. ప్రతి భాష తనను తాను అభావం చేసు కుంటూ విశ్వభాషలో అంతర్భాగమయ్యేందుకు సంసిద్ధమవ్వాలి. అలాగాక ఇంగ్లీష్ ద్వారా ఉపాధి లభిస్తుందని గుడ్డిగా నమ్మి, తెలుగు

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

భాషను దూరం చేసుకుంటే రెండింటికీ చెడ్డ రేవడిగా మిగులుతాం. అదే విధంగా శాతవాహనుల కాలం లేదా అంతకు మునుపటి ద్రవిడ తెలుగు పదాలను నుడికారాన్ని గుడ్డిగా ప్రస్తుత సమాజంపై రుద్దేందుకు ప్రయత్నిస్తే, అంతరిస్తున్న జీవజాతుల జాబితాలో తెలుగు జాతిని చేర్చినవారవుతాము. ఆయా దేశీయ భాషల రూపంలో నిక్షిప్తమై ఉన్న స్థానిక విజ్ఞానమంతటినీ, యావత్ సంస్క తినీ మొత్తానికి మొత్తంగా విశ్వజనీనం చేసే క్రమం సజావుగా సాగితేనే మానవ జాతీ వికాసం సవ్యంగా సాగు తుంది. విశ్వజనీన మానవ అనుభవ–హేతబద్ధ జ్ఞానం ప్రత్యక్ష – పరోక్ష జ్ఞానాభివృద్ధి క్రమంలో భాష–సంస్కృతు ల ఆదాన ప్రదానాలు, అంతర్భాగీకరణ ప్రక్రియల పట్ల సహేతుక అవగాహనతో నడిచే భౌతికవాద భాష – పర్యావరణ ఉద్యమాలు రావాలి. సమస్త మానవ జ్ఞానాన్ని నిక్షిప్తం చేసుకుంటూ సాగే విశ్వజనీన భాషా సంశ్లేషణ క్రమంలో దేశీయ భాషలు అంతర్థానమవుతాయనే స్పహతో భాషోద్యమాలు సాగాలి. దేశీయ భాషలోని స్థానిక విజ్ఞానం, భాషా సంపద, సంస్కృతులు మొత్తానికి మొత్తంగా వ్విజనీన భాషలో సంశ్లేషణ (అంతర్భాగం) కావడమే, అందుకోసం ప్రయత్నించడమే / ఉద్యమించడమే నిజమైన భాషా పరిరక్షణ ఉద్యమంగా గుర్తించాలి.

భాషా పరి రక్షణ అంటే ఒకానొక భాషలో నిక్షిప్తమైన స్థానిక విజ్ఞానమంతా విశ్వజనీన భాషలో అంతర్భాగమయ్యేట్లు చేస్తూ సదరు భాషా నుడికారాలు, నిర్దిష్టతలు అందులో అంశీభూతాలుగా మారి, ముకుళిత నిర్దిష్టతల అంతర్ధానం కి వడంగా అర్థం చేసుకోవాలి. అలాకాక ఆ భాషలోని స్థానిక విజ్ఞానాన్ని విశ్వజనీనం చేయడంతో సంబంధం లేకుండా పాత నుడికారాలను అలాగే గుడ్డిగా కొనసాగింప చేసేందుకు ప్రయత్నించ డమంటే దేశీయ భాషలకు, భాషా జాతీయు లకు తీవ్ర నష్టం కలిగించడమే అవుతుంది. అంటే ప్రాథమిక విద్య దాకా మాతృభాషాలోనే విద్యా బోధన, తల్లిభాషలోనే పాలన, క్రియాశీల భాషా ప్రాధికార సంస్థ ఏర్పాటు వగైరా భాషోద్యమ డిమాండ్లు తప్ప ని అర్థం కాదు. ప్రతి ఉద్యమానికి ఎత్తుగడల నినాదాలు, లక్ష్యాలు, వ్యూహాత్మక దృక్పథం, లక్ష్యాలు రెండూ ఉం టాయి. అలాగే ప్రస్తుత భాషోద్యమ నినాదాలు, సాధించవలసిన లక్ష్యాలు, నెరవేర్చవలసిన కర్తవ్యాలన్నీ ఎత్తుగడల పర్వానికి సంబంధించినవి.

అదే సమయంలో విశ్వజనీన భాషావిర్భావంలో స్థానిక / దేశీయ / మాతృభాషలు అంతర్భాగీకరణ క్రమంలో వాటికి దక్కవలసిన సముచితం, స్థానిక విజ్ఞానం, సారస్వతం, సంస్కృతులను పరిరక్షించుకోవలసిన అవసరం, కర్తవ్యం అనేవి వ్యూహాత్మక కర్తవ్యాలుగా ఉంటాయి. భౌతికవాద భాషోద్యమం సారం అది.

(ఈ వ్యాసంలో కొంతభాగం 'సాక్షి' దినపత్రికలో వచ్చింది)

కవిత

నా భాష

ఇది నా భూమి మాత్రమే కాదు
ఆకాశం కూడా.
ఊపిరి మాత్రమే కాదు
నా ఆవేశం కూడా.

నా వరకు సూర్యుడు
తెలుగులోనే ఉదయిస్తాడు.
కిరణాలు
తెలుగక్షరాల్లాగే
వొంపులు తిరుగుతాయి

ఈ అక్షర విన్యాసంలోనే
నేను చిత్రకారుణ్నయ్యాను.
దృశ్యానికీ శబ్దానికీ
అనుబంధాన్ని తెలుసుకొని
కవిత్వం రచించాను.

నా ధ్వనులు
ఇతర భాషల్లో ఇనిపిస్తే
ఆశ్చర్య పడతాను
వాటిని నా అక్షరాల్లోకి
కుదించుకొని చదువుతాను.

కనుల వెలుగు మాత్రమే కాదు
కన్నీళ్లు కూడా తెలుగే.
అంతెందుకు
రస మహా సముద్రాలన్నీ
ఈ చిన్ని అక్షరాలలోకే ఒదిగి పోతాయి

ఓసారి
నా రక్తం గ్రూపును పరీక్షించండి
'టీ' పాజిటివ్‌గా తేలుతుంది.

–డా॥ ఎన్.గోపి

భాష లేకపోతే భావం లేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

డా॥ సామల రమేష్‌బాబు
98480 16136

ఉద్యమాలతోనే మాతృభాష పరిరక్షణ

ప్రపంచంలోని ప్రజలంతా తమ తమ మాతృభాషల గురించి ఆలోచించుకోవాల్సిన రోజు ఇది, 18 ఏళ్లుగా ప్రతియేటా 'యునెస్కో' పిలుపును అనుసరించి ఫిబ్రవరి 21న 'మాతృభాషా దినోత్సవాన్ని' జరుపుకుంటున్నారు. కేవలం యునెస్కో ఆధ్వర్యంలో ఒకటో రెండో సభలతో మొదలైన ఈ ఉత్సవ కార్యక్రమం ఇప్పుడు ఎన్నో దేశాల్లో వేలకొలది కార్యక్రమాలతో జరుగుతూ అంతర్జాతీయంగా గుర్తింపు కొచ్చింది, క్రమక్రమంగా వివిధ దేశాలలోని మేధావులు, ఉద్యమ శీలుర ఆలోచనలను పోగు చేసుకొని అనేక అంశాల విస్తృతితో వికసిస్తోంది.

'ఎల్.పి.జి' ముద్దు పేరుతో ప్రపంచమంతటా విస్తరిస్తున్న ప్రపంచీకరణ ప్రభావంలో మాతృభాషల వినియోగం దిగజారి పోతోంది. విభిన్న మానవ సంస్కృతులు కూడా అడుగంటి పోతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చిన ఈ పరిణామానికి చాలా కథే వుంది. 1952 ఫిబ్రవరి 21న నాటి తూర్పు పాకిస్తాన్ రాజధాని ఢాకాలో మాతృభాష 'బెంగాలీ'ను రక్షించుకోవటం కోసం జరిగిన ప్రజా ప్రదర్శనపై ప్రభుత్వం జరిపిన దాడుల్లో కొందరు విద్యార్థులు చనిపోయారు. దాంతో అప్పటిదాకా పాలకుల పట్ల పెరుగుతున్న నిరసన మరింతగా విస్తరించింది, 'మీదీ మాదీ ఒకటే దేశం కావచ్చు, మనదీ ఒకే ప్రభుత్వం కావచ్చు. కానీ మీ భాషా మా భాషా వేర్వేరు, మాది బెంగాలీ భాష, మా భాషలోనే మాకు చదువులందాలి. మా భాషలోనే మా బతుకులూ పరిపాలనా సాగాలి. ఇందుకు మీరు వ్యతిరేకం. మా ఈ కోరికల్ని పూర్తిగా ఆమోదిస్తేనే మనది ఒక దేశం. మీరెందుకు ఒప్పుకోకపోతే మా దేశానికి స్వతంత్రం కావాలి. మీ నుండి మేము విడిపోయి మా బతుకులనూ మా భాషనూ మా భవిష్యత్తునూ మా భాషాసంస్కృతుల ప్రాతిపదికగా రూపొందించు కుంటాం' అనే స్పష్టమైన సందేశాన్ని నియంతృత్వ పశ్చిమ పాకిస్తాన్ పాలకులకు అందించింది. తరువాత అనేక పరిణామాలకూ విభజ నకూ దారితీసి బంగ్లాదేశ్ ఏర్పడింది. 1952 ఫిబ్రవరి 21 న జరిగిన పాశవిక హత్యాకాండకు సంకేతంగా ఢాకాలో పెద్ద స్మృతి చిహ్నాన్ని నిర్మించారు, తూర్పు బెంగాల్ ప్రజల ఆత్మగౌరవ సంకేతంగా వారి మాతృభాష రక్షణ పోరాటానికి గుర్తుగా అది నిలిచింది. నేటి బంగ్లాదేశ్‌ను దర్శించటానికి ఎవరు వెళ్ళినా ఈ స్మృతి చిహ్నాన్ని దర్శించటంతోనే వారి యాత్ర మొదలవుతుంది.

ఇంచుమించుగా రెండున్నర దశాబ్దాల తర్వాత ప్రపంచంలోనే సుమారు 6000కు పైగా వున్న ప్రజా భాషలు సగానికి పైగా నశించిపోతున్నాయి. అనేక కారణాల వల్ల ఇలా జరుగుతోందని, ప్రపంచీకరణ విస్తృతమయ్యేకొద్దీ స్థానిక భాషలు, సంస్కృతులూ అణగారిపోతున్నాయని ఐక్యరాజ్యసమితి భాషా సాంస్కృతిక విభాగం యునెస్కో పరిశీలనలోకి వచ్చింది, సర్వేలు, చర్చోపచర్చల ఫలితంగా ప్రపంచంలోని వైవిధ్యాన్ని కాపాడుకోవాలని, అందులోనూ భాషా వైవిధ్యాన్ని కాపాడుకోవటం ప్రధానమనీ అప్పుడే సాంస్కృతిక వైవిధ్యాన్నీ సమిష్టి జ్ఞాన సంపదనూ మానవాళి దక్కించుకోగలదని అభిప్రాయపడింది. 1999 నాటికి ఈ విషయంలో యునెస్కో ఏకగ్రీవంగా నిర్ణయానికి రాగలిగింది. దీనికోసం చేపట్టే కార్యక్రమాలకు తొలిమెట్టుగా ప్రతియేటా ప్రపంచ మాతృభాషల దినోత్సవం జరుపుకోవటానికి ఒక తేదీని నిర్ణయించేందుకు జరిగిన అన్వేషణలో వారికి 'మాతృభాషా రక్షణ కోసం తూర్పు బెంగాల్ వాసులు జరిపిన పోరాటం' పరిశీలనకు వచ్చింది, 'ఫిబ్రవరి 21' 'ప్రపంచ మాతృభాషల దినోత్సవం' గా నిర్ణయించి, ప్రకటించి, పలు కార్య క్రమాలను చేపట్టింది. 2000 సంవత్సరం నుండి ఈ కార్యక్రమాల అమలు మొదలయ్యింది. భారతదేశంలో మనకు తెలిసినంత వరకు 2000 సంవత్సరంలోనే ఆంధ్రప్రదేశ్‌లో జనసాహితి సంస్థ, పలువురు మేధావులూ ఈ అంశంపై స్పందించారు. 'మాతృభాష' అనే పేరుతో చిరస్థాయిగా నిలిచిపోయే కవితను ప్రముఖ కవి ఛాయారాజ్ రచించారు. 2009 ఫిబ్రవరి 21న హైదరాబాద్ కేంద్రంగా 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' పెద్దయెత్తున మొదలైంది. నాటి సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ నేటి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు భాషోద్యమానికి గట్టి పునాదులను వేయటంతోపాటు పొరుగు రాష్ట్రాల్లో కూడా తెలుగు భాష రక్షణ కోసం ఉద్యమాలు చేసింది, నేడు దేశమంతటా తెలుగు వారిలో మొదలైన కదలిక అన్ని రంగాల్లో తెలుగును కాపాడుకోవటానికి ఒక ప్రాచీన భాషగా తెలుగుకు గుర్తింపు తెచ్చుకోవటానికీ – ఇప్పుడు ఆధునిక భాషగా తెలుగును రూపొం దించుకోవటానికి వివిధ రంగాల్లో కృషి జరుగుతోంది, అణచివేతకూ సామాజిక కుట్రలకూ సొంత ప్రభుత్వాల పట్టని తనానికీ బలి అవుతున్న తెలుగు ప్రజలు తమ భాష కోసం తల్లడిల్లుతున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుభాషపట్ల ప్రభుత్వాలు వ్యవ హరిస్తున్న తీరు ఎంతో అభ్యంతరకరంగా ఉంది. భారతదేశంలోనే మాతృభాష పరిరక్షణలో ఉన్నతంగా నిలిచి, మాతృభాష ప్రాతిపది కపైన భాషా రాష్ట్రాలు కావాలని తెలుగువారు స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే డిమాండ్ చేశారు. ఉద్యమ స్ఫూర్తితో జాతీయ స్థాయిలో ముందడుగు వేసిన తెలుగు నేతలు, స్వాతంత్ర్యం తర్వాత తమ పోరాట స్ఫూర్తిని కొనసాగించి కేంద్ర ప్రభుత్వ ఆమోదాన్ని సాధించారు. భాషారాష్ట్రాల ఏర్పాటుకు భారత ప్రభుత్వం ఆమోదించిన తర్వాత అధికార కాంక్షతో పరస్పరం పెనుగులాడుకొంటూ, ఐకమత్యం కోల్పోయి, సమయానికి తగ్గ విధంగా బతికి నాయకత్వాన్ని అందించలేకపోయారు. అందువల్ల అనేక తెలుగు ప్రాంతాలను ఏర్పడబోయే రాష్ట్రాలకు వదిలివేశారు, పొట్టి శ్రీరాములు వంటి త్యాగధనుడి ప్రాణాలను బలి ఇచ్చారు.

ఇదంతా ఒక దుర్భర చారిత్రక వేదనగా మిగిలిపోయింది. తెలంగాణ ప్రాంత నేతలు తమ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంతో కలిపి

విశాలాంధ్ర నిర్మాణానికి తోడ్పడినా, తర్వాత - అర్ధ శతాబ్దానికి పైగా నడచిన చరిత్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలకులు - రాష్ట్రం ఏర్పడిన మౌలిక అంశాన్ని పూర్తిగా మరచిపోయారు. ప్రజల భాషైన తెలుగులో పరిపాలించాలనే ప్రాథమిక అంశాన్నే విడిచిపెట్టారు. విద్యారంగంలో మాతృభాషా మాధ్యమాన్ని దేశంలోనే ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిన చరిత్రను తామే నిలువునా అణగదొక్కారు. తెలుగు గురించి ప్రపంచ స్థాయి సభలంటూ అనేకసార్లు దేశంలోనూ బయటా కోట్ల రూపాయల ధనాన్ని వెచ్చించిన మన పాలకులు, మళ్లీ రెండు రాష్ట్రాలుగా చీలిపోయారు. రెండు తెలుగు రాష్ట్రాలుగా చీలిపోయిన తర్వాత కూడా రెండు రాష్ట్రాల్లోనూ తెలుగు పట్ల పాలకులు శ్రద్ధ వహించడం లేదనో-అసలు పట్టించుకోవడం లేదనో అంటే అది పరిస్థితిని ఎంతో తక్కువ చేసి చూపడమే అవుతుంది.

మొత్తం 9 కోట్లకు పైగా తెలుగు ప్రజలు (రెండు రాష్ట్రాల్లో ఉన్నారని ప్రభుత్వ అధికార గణాంకాలు సూచిస్తున్నాయి. వాస్తవానికి వారి సంఖ్య దేశమంతా కలిపి తీసుకొంటే దాదాపు 18 కోట్ల మంది, ఇది అతిశయోక్తిగానో, అబద్ధంగానో కొందరికి అనిపించినా, తెలుగువారిగా లెక్కల్లో రాని జనం మాతృభాష ఆధారంగా కులాల ఆధారంగా ఉన్న వాస్తవం ఇది. పొరుగు రాష్ట్రాల్లోనే ఆరేడు కోట్ల మంది అక్కడే పుట్టి తరాలుగా బతుకుతున్నారంటే కొందరు నమ్మకపోవచ్చు. కాని ఇది చారిత్రక వాస్తవం.

ఐక్యరాజ్యసమితి 2000 సంవత్సరం నుండీ పదే పదే ప్రస్తావిస్తున్న అంశాన్ని మనం ఇక్కడ చెప్పుకోవాలి. ఏ భాషా జాతి అయినా, పాఠశాల వయస్సు విద్యార్థులు 30 శాతం మంది కంటే తక్కువ వారు, తమ మాతృభాష గాక ఇతర భాషలో చదువుకొంటూ ఉంటే, ఆ భాష త్వరత్వరగా పతన దిశగా పయనిస్తున్నట్లు భావించాలి. బయటి రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారికి ఎన్నో ఏళ్లుగా తెలుగును నేర్చుకొనే అవకాశం లేని పరిస్థితి. వారిలో అత్యధిక శాతం తమ రాష్ట్ర అధికార భాషల్లోనే చదువుకొంటున్నారు. అక్కడ బతకాలంటే ఆ రాష్ట్ర భాష పాలనలోనే మునిగి తేలక తప్పదన్నది తెలిసిందే.

ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో గత మూడేళ్లుగా తెలుగు మాధ్యమంలో 1వ తరగతి ప్రవేశాలు లేవు. అంతా ఇంగ్లీష్ మీడియంలోనే. ఇంకా రెండు మూడేళ్లలో ఏ తరగతికీ తెలుగు మాధ్యమం ఉండదు.

తెలుగును ఒక సబ్జెక్టుగా మాత్రమే బోధిస్తామని రెండు ప్రభుత్వాలూ ఉత్తర్వులు ఇచ్చాయి. బోధనా మాధ్యమంగా తెలుగును లేకుండా చేసిన తర్వాత అది ఒక అప్రయోజక విద్యగా ఎన్నాళ్లు బతుకుతుంది? ఏ స్థాయిలో బతుకుతుంది?

రెండు వేల ఏళ్ల చరిత్ర, సాహితీ సంపద కలిగి, ప్రాచీన భాషగా గుర్తింపు తెచ్చుకొని, ఆధునిక భాషా సాంకేతికతలో కూడా అత్యున్నత సామర్థ్యం కలిగిన భాషగానేగాక, ఒక లిపిగా కూడా ప్రపంచంలోనే రెండవ ఉత్తమ లిపి (మొదటి స్థానం 'కొరియన్' లిపిది) స్థానాన్ని పొందిన తెలుగు, ఆధునిక భాషగా అన్ని అవసరాలకూ ఎలా ఎదగ గలుగుతుంది? ఆధునిక భాషగా ఎదగకుండా, ఎన్నాళ్లు మనగల్గుతుంది?

'ప్రపంచమంతటా అన్ని మాతృ భాషలను కాపాడుకోవాల్సిందే' అని ఒక పక్క యునెస్కో ప్రతి యేటా పిలుపునిస్తున్నది. ఇటు మనం సంఖ్యాపరంగా ప్రపంచంలోనే మొదటి 10 స్థానాల్లో వున్నాం, అయిన ప్పటికీ మనల్ని మనమే భాషాపరంగా ఆత్మహత్య చేసుకొంటున్నాం' అని మన ప్రభుత్వాలకూ, మేధావులకూ ఎలా చెప్పాలి?! 19వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ప్రజలంతా ఆలోచించుకోవాలి, ఇంకా చైతన్యంతో ముందుకు సాగాలి,

('ప్రజాశక్తి' సౌజన్యంతో)

కవిత

ఎదురుచూస్తున్న

ఓనాడు గబ్బిలంలా గర్భంలో వేలాడాను
విసుగుచెంది

నందనమైదానంలో దూకి స్వేచ్ఛ రంగుల
సీతకోకచిలుకై చిందులేసాను

అక్కడా విసుగుచెంది

కోరికల గుర్రాన్ని ఎక్కాను

అందని ద్రాక్షలు ఊహలు కావడంతో

సంసారంలోకి దూకి

శృంగారకోటకు దిష్టిబొమ్మెయ్యాను

అందులోను సంతోషం చిక్కక జరలోకి
జారుకున్నాను

మూల్గుతున్న మడతలపై తాటిపండులా
పడుతున్న వయసును మోయలేక

ఆశగా ఎదురుచూస్తున్నాను నేడు

నేనను పద్మావ్యూహం బ్రద్దలుకొట్టుకుని

ఆనందంతో నిండిన అనంతలోకాలకు

ఏడుకట్లమెట్లపై నడిచి

ఏడుతీర్ల చదికట్టుకుని వెళ్ళాలని

ఇంకెప్పుడు నిరవేరుతుందో ఏమో నా ఆశ

అభిరామ్.
9704153642

వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది. వాడని భాష వాడిపోతుంది

ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు
9866128846

మూలభాషలూ సమాజాలూ సంస్కృతుల అంతర్జాతీయ సదస్సు

యునెస్కో దేశీయ భాషల అంతర్జాతీయ సంవత్సరం





ఐక్యరాజ్య సమితి – విద్యా వైజ్ఞానిక సంఘం ఈ ఏడాదిని దేశీయ భాషల అంతర్జాతీయ సంవత్సరంగా గుర్తించిన సందర్భంలో హైదరాబాదు విశ్వవిద్యాలయంలోని విదేశీ భాషల విభాగం, బహు భాషికత కోసం భాషాప్రణాళిక – యునేస్కో పీఠం, భారతీయ భాషా కేంద్రం– మైసూరు, భారతీయ సామాజిక వైజ్ఞానిక సంఘం– ఢిల్లీ వారు కలిసి 'మూల భాషలూ సమాజాలూ సంస్కృతుల అంతర్జాతీయ సదస్సు' (ఐసిల్సిసి) ను ఫిబ్రవరి 21–22, 2019 లో నిర్వహించారు.

ప్రపంచవ్యాప్తంగా మూలవాసుల అంతర్జాతీయ సంవత్సరోత్సవాన్ని జరుపుకొంటున్న సందర్భంలో దేశీయభాషల అంతర్జాతీయ సంవత్సరపు (అంసం2019) పొడవునా జరిగే వేడుకలలో భాగమే ఈ అంతర్జాతీయ సదస్సు.

ప్రపంచవ్యాప్తంగా స్థానిక భాషలను కాపాడటం, పరిరక్షించటం, పునరుజ్జీవింపచేయడం ఇంకా ప్రోత్సహించడం వంటి తక్షణ అవసరాల గురించి పనిచేసేందుకు వీలుగా శిక్షణ ఇవ్వడం దీని ప్రధాన ఉద్దేశం. నేడు ప్రపంచంలో 7,000 భాషలు దాకా ఉన్నాయి. అయితే ప్రపంచ జనాభాలో సుమారు 97% మంది మాట్లాడుతున్న భాషలు వీటిలో 4% అంటే 250 మాత్రమే. అంటే, ప్రపంచంలోని 3% మంది మాత్రమే మిగిలిన 96% భాషలలో మాట్లాడుతున్నారన్నమాట. ఆ 96% భాషల్లో మాట్లాడేవారు చాలావరకు ఆయా దేశాల మూలవాసులే. ప్రతి దశాబ్దంలోనూ, ఈ భాషలను మాట్లాడేవారి జనాభాలో ఆందోళనకరమైన స్థాయిలో తరుగుదల కనిపిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి సరైన పద్ధతులు అనుసరించకపోతే, దీనివలన ప్రపంచవ్యాప్తంగా భాషా వైవిధ్యం తగ్గుతుంది. భాషల నష్టంతోపాటు వారి చరిత్ర, సంప్రదాయాలూ వివిధ రకాల జ్ఞానసంపదలూ తదితర జ్ఞాపకాలు మొదలైనవి తుడిచి పెట్టుకుపోతాయి. ఫిబ్రవరి 21–22 తేదీలలో జరిగిన సదస్సు సమావేశాలలో వివిధ దేశాల యునేస్కో బహుభాషికతా భాషావిధాన పీఠాల ప్రతినిధులూ వివిధ విశ్వ విద్యాలయాల ఆచార్యులూ విద్యా ర్థులూ పాల్గొని పత్రసమర్పణలూ చర్చాగోష్టులూ నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో, ఆచార్య శ్రీమతి శరజ్యోత్స్నారాణీ, డీన్, మానవీయ శాస్త్రాలవిభాగం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, ఆచార్య ప్రభాకర రావు, విదేశీ భాషాకేంద్రం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, యునేస్కో మూల వాసుల భాషావిధాన పీఠాధ్యక్షులు గిల్వన్ మ్యూలర్ ది ఒలివేర, ఢిల్లీలోని యునేస్కో ప్రతినిధి అనిర్బాన శర్మ, ఆచార్య శ్రీ డి.జి.రావు, డైరెక్టర్, భారతీయభాషల కేంద్రీయ సంస్థాన్, మైసూరు, డా. ఉమా పప్పుస్వామి, డిప్యూటీ డైరెక్టర్, భారతీయభాషల కేంద్రీయ సంస్థాన్, మైసూరు, సదస్సు సమన్వయకర్త డా. అరుల్ మొదలైనవారు పాల్గొన్నారు. ఈ సదస్సులో శ్రీలంక, ఫ్రాన్సు, వియత్నాం, మకావూ, బ్రజిల్, ఇండోనేశియా, మేక్సికో, స్వీడన్, కెనడా, రష్యా, హాంకాంగ్, ఆస్ట్రేలియా, ఇంకా చైనా మొదలైన విదేశాలనుంచి భారత దేశంలోని వివిధ రాష్ట్రాలనుండి వచ్చిన భాషాశాస్త్రవేత్తలూ, మానవవిజ్ఞాన వేత్తలూ, మనోవిజ్ఞానవేత్తలూ సామాజిక శాస్త్రవేత్తలూ ఎందరో పాల్గొన్నారు. వారు తమ తమ దేశాలూ ప్రాంతాలలోని మూల భాషలకు సంబంధించిన స్థితిగతులపైనా ఆపన్న భాషలను పరిరక్షించుకోవలసిన అవసరాలూ పద్ధతులపైనా నలభైకి పైగా పత్రాలను ప్రకటించారు. ఈ సదస్సులో చైనా, ఆస్ట్రేలియా దేశాల మూల భాషలపై పరిశోధన సాగిస్తున్న బ్రెండన్ వీక్స్ వివిధ లిపులు గలిగిన బహుభాషిక అక్షరాస్యతా సమాజాలలో చదవడం రాయడంలో ఇబ్బందులపై కీలకోపన్యాసం చేశారు. యునేస్కో బహుభాషిక ప్రణాళికా పీఠం అధ్యక్షుడూ బ్రజిల్ దేశంలోని ఫెడరల్ విశ్వవిద్యాలయ ఆచార్యుడూ గిల్వన్ మ్యూలర్ ది ఒలివేర ప్రసంగిస్తూ 2019ని మూలభాషల అంతర్జాతీయ సంవత్సరంగా జరుపుకొంటున్న సందర్భంలో ప్రపంచ మూలవాసుల ఆకాంక్షలు: అంతర్జాతీయ భాషా విధాన ప్రచారంలో మౌలిక ఆలోచనలూ, వ్యూహాలూ పద్ధతులూ అనే పత్రాన్ని సమర్పిసూ యునేస్కో భాషావిధానాన్ని

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

సమగ్రంగా చర్చించారు.

యునెస్కో అంతర్జాతీయ సమాచార ప్రసార కార్యక్రమాల ఉపాధ్యక్షుడు ఇగ్గినీ కుజ్మిన్ మూలభాషల పరిరక్షణకు కావలసిన భాషా ప్రణాళికలపై రష్యాలోని అల్పసంఖ్యాకవర్గ భాషల పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలపై వివరణాత్మక పత్రాన్ని ప్రకటించారు. సైమన్ ఫ్రేజర్ విశ్వవిద్యాలంలో ఆచార్యులుగా ఉన్న అన్విితా అబ్బీ భాషా వివక్షతపై పోరాటం అనే పేరున చేసిన ఉపన్యాసంలో ప్రపంచంలో జరుగుతున్న భాషా వివక్షత వర్ణ వివక్షతకూ, జాతి వివక్షతకూ తేడాలేదంటూ అనేక ఉపాఖ్యానాలను జోడిస్తూ సుదీర్ఘ ప్రసంగం చేశారు. బ్రజిల్ నుంచి వచ్చిన ఆనంద మచాదో బ్రజిల్ దేశంలోని మాసుహీ, వపిచాన మొదలైన అల్పసంఖ్యాకవర్గ భాషలకు మ్యునిసిపల్ స్థాయిలోనైనా సహ – అధికారహోదా ఉండాలంటూ సోదాహరణంగా నిరూపిస్తూ ప్రసంగించారు. బ్రసిలియా విశ్వ విద్యాలయం నుండి వచ్చిన క్లాడియో మేనేజీస్ బహుభాషిక విద్యా విషయక రంగంలో అనుభవాలద్వారా భాషల సామర్థ్యాల మూల్యాం కన పద్ధతులను చర్చించారు. మకావూ నించి వచ్చిన జులియో జతోబా పోర్చుగీసు భాషాసందర్భంలో చైనా భాషా విధానమూ ప్రణాళికల గురించి సమగ్ర చర్చ జరిపారు. బ్రజిల్లోని మూలవాసుల పాఠశాల విద్యావిధానంలో బహుభాషికత సహ–సాంస్కృతికత దృష్టితో చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకొంది. ఇంకా మెక్సికో జాతీయ బోధన విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు మెక్సికోలో అల్ప సంఖ్యాక భాషలైన మూలవాసుల భాషల వాడుక:

పునరుజ్జీవనం– సాధికారతలపై ప్రసంగించారు. మీ భాష సురక్షితమా? అంటూ డా. కె. రాజ్యరమ, అనువర్తిత భాషాశాస్త్ర అనువాద అధ్యయనాల విభాగం అధ్యక్షురాలు, హై.వి., సహ రచయితలైన డా. అనురాధ కన్నెగంటి, పారిస్, భార్గవి, సి. హై.వి. ప్రత్యేకంగా తెలుగు ఆపన్నతపై ప్రజలనుంచి సేకరించిన సమాచార విశ్లేషణతో చేసిన పరిశోధనా చర్చ సమావేశంలోని పలువురి మన్న లను పొందింది. వీరేగాక ఇంకా అనేకమంది, ప్రత్యేకంగా పరమేశ్వరీ కృష్ణమూర్తి మూలవాసుల భాషల పరిరక్షణలో భాషాసాంకేతికతా సౌలభ్యం గురించి చర్చించారు. గతుత్ సుశాన్తో అనే ఇండోనేశీయ భాషావేత్త, ఇండోనేషియా బహుళజాతీయతను కొనసాగించేందుకు మూలవాసుల భాషల పరిరక్షణపై మాట్లాడారు.

భారత స్థూలజాతీయోత్పత్తిలో మూలవాసులభాషల భాగ స్వామ్యం: మాతృభాషా మాధ్యమ బోధనకు సంబంధంపై గారపాటి ఉమామహేశ్వరరావు భారతదేశం మొత్తంగానూ కొన్ని రాష్ట్రాల లోనూ జాతీయోత్పత్తికి వివిధ ఆర్థిక రంగాలలో పనిచేస్తూ సంపదను సృష్టించినవారి విద్యాస్థాయి వివరాలను బట్టి భారత జాతీయోత్పత్తిలో ఏ భాష భాగస్వామ్యం ఎంత అనేదాన్ని జనాభా లెక్కల ప్రకారం లెక్కగట్టిచూపటం ప్రపంచంలోనే మొట్టమొదటిసారి కావటం యునెస్కో ప్రతినిధులను అందరినీ ఆకట్టుకొంది.

వివిధ భారతీయ రాష్ట్రాలనుండి ఇంకా అనేక విశ్వవిద్యాల యాలనుండి వచ్చిన ఆచార్యులూ పరిశోధక విద్యార్థులూ ఎంతో మంది పత్రసమర్పణలోనూ చర్చలలోనూ పాల్గొన్నారు. శ్రీలంకలోని వెడ్డా భాషపై సబతినీ రమేశ్, ఒడిస్సాలోని కోరాపుట్ జిల్లాలోని ఒల్లారీగదబలో కాలప్రత్యయ నిర్ణయంపై మెండెం బాపూజీ, అలాగే, రాధనోళ్ల వేణు, ఫణికృష్ణ, అరుల్ మొ ప్రకటించిన తెలుగు రాష్ట్రా లలో జంగముల భాషపైన చేసిన పరిశోధన యానాదులూ, చెంచుల ప్రాచీన భాషలకు సంబంధం ఉందన్న విషయం ఆలోచింపచేసేదిగా ఉంది. తూర్పురాష్ట్రాలలో భాషా ఆపన్నత–గుర్తింపు సమస్యపై చర్చించిన ఉమారాణీ పప్పుస్వామి రచన మానవహక్కులకు సమాన స్థాయిలో భాషాహక్కులు కొనసాగాలని పేర్కొంది. ఈ భాషాహక్కుల సాధనకు సరైన భాషావిధానం అవసరమని చెబుతోంది. భారతీయ భాషల కేంద్రీయ సంస్థాన్, మైసూరునుంచి వచ్చిన డా. ఎల్. రామ మూర్తి (పూర్వ డి.డైరెక్టర్) ఇరులల భాష– మాండలికాలపై కాల–స్థానాదుల పరిమాణాల గురించిన వ్యాసాన్ని చర్చించారు.

ద్రావిడ భాషీయులలో అత్యంత ప్రాచీనతను నిలుపుకొని నీల గిరుల మూలవాసులుగా ప్రత్యేకతను సంతరించుకున్న పెండ్లి తంతుపై దృశ్య శ్రవణ విధానంలో చేసిన చర్చ ఎందరినో ఆకట్టు కొంది. ఇంకా ప్రవీణ్, జి. అనుపమా మిశ్రా అవధీ, హిందీ, తెలుగు బహుభాషా నిఘంటువుపైనా, ఆచార్య నాగరాజ, కె.ఎస్. గారు ఆస్ట్రో–ఆసియాయీ భాషల ఆపన్నతపైనా, నీలాద్రి శేఖర్ దాష్ మూలభాషల సాంఖ్యీకరణ పద్ధతులపైనా, అసుర అనే మూలవాసుల పెండ్లి తంతుపైనా రౌనక్ రాయ్ సమర్పించిన వ్యాసం వివరణా త్మకంగా ఉంది. అలాగే భారతీయ సందర్భంలో భాషా వర్ణనాత్మక వ్యాసంగం నమోదు చేయడంలో నియమ నిబంధనలపై రిషీ కశ్యప్ ఇంకా తులసీ దాస్ మాంఝీ, (కేంద్రీయ విశ్వవిద్యాలయం ఝార్ఖండ్) వారి వ్యాసం, ఖాసీ సామాజిక వ్యవస్థలో వ్యాకరణ లిమూ దాని పాత్రతపై గ్రేసియస్ టేమ్సేన్ పత్ర సమర్పణ చేశారు. ఆచార్య శ్యాం మోహన్ లాల్ ఉరాలి భాషా స్థితిగతులపై సామాజిక సాంస్కృతిక ఇంకా రాజకీయ రంగాల దమనంతో మారుతున్న సాంస్కృతిక రూపురేఖల గురించిన విపుల చర్చ చేశారు. ఇలా అనేక పత్రాల సమర్పణ, చర్చాగోష్ఠులతో మూలవాసుల భాషలూ ఆపన్న భాషల పరిరక్షణా, విద్యావిధానంలో వాటికి ఉచిత స్థానాన్ని కల్పించడమూ, ఈ భాషలపై పరిశోధనలలో సేకరించిన భాషా వనరులను ముందు తరాలకు అందించేందుకు వీలుగా ఒక మూలభాషా వనరుల సంస్థను ఒకదానిని నెలకొల్పేందుకు నిర్ణయం తీసుకోవటం ప్రత్యేకం.

తెలుగు వెలుగుకు సాటిరాదు

"అమ్మ పాల స్వస్థ్య గుణము
చెంచాల పాల పీకల్లో లేదు లేదు
అమ్మ భాష కమ్మదనం పరభాషలో
పొందు ప్రయత్నం నేట విడిచిన సాము"

రామిశెట్టి రోశయ్య
మధిర

చలసాని నరేంద్ర
9849569050

ఆదివాసీయులు ఈదేశ పౌరులేనా...తేల్చుకోవాల్సిన సమయం

స్వతంత్రం వచ్చిన 70 ఏళ్ళల్లో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని మనం సంబరపడుతున్నా ఈ అభివృద్ధికి చాల దూరంగా ఇప్పటికి దేశ జనాభాలో గణనీయ సంఖ్యలో ఆదివాసీయులు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసితులు ఉండటం దారుణమైన విషయం. అభివృద్ధి ఫలాలు వారికి ఏ విధంగా చేరాలో అనే విషయమే దేశంలో రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు స్పష్టమైన కల్పన లేనే లేదని చెప్పాలి.


ఆక్రమిత అటవీ భూముల నుంచి ఆదివాసీలను, ఇతర సంప్రదాయ అటవీ నివాసితులను(ఓటీఎఫ్‌డీ) తొలిగించే విషయంపై ఆయా రాష్ట్రాలకు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీచేయడంతో మరోసారి వారెటువంటి అస్తిత్వ సమస్యను ఎదుర్కొంటున్నారో వెల్లడి అవుతుంది. భారత రాజ్యాంగంలో పౌరులకు హక్కులు కల్పించే ఉద్దేశ్యంతో సమకూర్చిన అంశాలను అన్నింటిలో కెల్లా 2006లో తీసుకొచ్చిన అటవీ చట్టం అత్యంత విప్లవాత్మకమైనది. అయితే దాని అమలులో మాత్రం మొత్తం దేశం ఆదివాసీయుల పట్ల వివక్షతను, నేరమయ నిర్లక్ష్యాన్ని చూపుతున్నది.

ఈ చట్టాన్ని అమలు పరచే ప్రయత్నం చేయకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న ప్రభుత్వాలను చివాట్లు పెట్టవలసిన సుప్రీం కోర్ట్ ఈ చట్టం క్రింద భూ యాజమాన్య హక్కు దరఖాస్తులు తిరస్కరణకు గురైన ఆదివాసీలను, ఓటీఎఫ్‌డీలను అటవీ ప్రాంతం నుంచి తొలిగించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 21 రాష్ట్రాలను ఆదేశించడం గమనిస్తే మనం ఏ యుగాలలో ఉన్నామో అనే అనుమానం కలుగుతుంది. ఆ చట్టం అమలు ద్వారా వారి సామాజిక, ఆర్థిక ఉన్నతికి దోహద పడటం కోసం ఈ చట్టాన్ని తయారు చేశారు. కానీ దాని పేరుతో వారిని అడవుల నుండే గెంటి వేయడం ఆ చట్టం ఉద్దేశం కాదని గమనించాలి.

అటవీ ఆక్రమణల పేరుతో, పులుల సంరక్షణ పేరుతో అటవీ పుత్రులను అడవులకు దూరం చేసే ప్రయత్నం చేయడం అమానుషం కాగలదు. సుప్రీం కోర్ట్ ఆదేశం కారణంగా సుమారు 12 లక్షల మంది ఆదివాసీ కుటుంబాల భవిష్యత్ అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఏర్పడింది. అయితే ఈ ఆదేశాన్ని అమలు పరచగల సాహసం సహితం ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయక పోవచ్చు.

అటవీ హక్కు చట్టం రాకుండా చేయడంకోసం అటవీ అధికారులే పలువురు విఫల ప్రయత్నం చేశారు. ఈ చట్టం అమలులోకి వచ్చి, గిరి పుత్రుల సాధికారికత జరిగితే తమ దారుణమైన దోపిడీకి మంగళం పాడవలసి వస్తుందని భయపడటమే కారణం. ఆర్థిక సంస్కరణల పేరుతో అటవీ భూములను గనుల త్రవ్వకం అంటూ కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పడానికి అధికారమలో ఉన్న సమయంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. అయితే ఆ విధంగా జరపడం తమ అస్తిత్వ సమస్య అంటూ గిరిజనులు పలుచోట్ల తిరగబడుతూ ఉంటె ప్రభుత్వాలు నిస్సహాయంగా

(తరువాయి భాగం 23వ పుటలో...)



డా॥ పి. శివరామకృష్ణ (శక్తి)
9441427977

దొంగలందరి మధ్య అటవీ హక్కుల గుర్తింపు చట్టం

వంద ఏండ్లుగా బస్తర్ ఆదివాసీ ఉద్యమ చరిత్రను గ్రంధస్తం చేసిన నందిని సుందర్ ఢిల్లీవిశ్వవిద్యాలయంలో ఆచార్య. ఆమె వేసిన కేసులో సల్వాజుడుం ఏర్పాటు తప్పు అని సుప్రీమ్ కోర్టు తీర్పు ఇచ్చింది. దొడ్డిదారిన మళ్ళీ ఏర్పాటు చేస్తే ఆమె కోర్టు ధిక్కారం కేసు వేసింది. ఈలోగా ఆమె మీద ఒక హత్యకేసు బనాయించారు. శ్రీ శంకరన్ అధ్యక్ష్యతన ఏర్పాటైన అటవీ హక్కుల చట్టానికి నిబంధనలు రూపొందించిన కమిటీలో ఆమె సభ్యురాలు.

ఆమె తన బస్తర్ చరిత్ర 'సావరిన్ – సబాల్ టరన్' లో ఒక ముఖ్యసంఘటన పేర్కొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం అడవి ఉన్న భూభాగాన్ని రిజర్వ్ చేసినపుడు దేశమంతా ముఖ్యంగా బస్తర్‌లో ఆదివాసులు ఆందోళన చేసారు. ఈ ఆందోళనకు కారణాలు తెలుసుకోవలసిందిగా ఒక అధికారిని పంపారు. తమను అడవిలోకి రానివ్వట్లేదని అటవీ ఫలసాయం తెచ్చుకోనివ్వట్లేదని లంచం అడుగుతున్నారని గిరిజనులు ఫిర్యాదు చేసారు.

దారులు, ఫలసాయం సేకరణకు చట్టంలోనే అనుమతించినట్లు తెలియ చేస్తూ వేదిస్తున్న సిబ్బందిని శిక్షిస్తామని అయన స్పష్టం చేసారు. అయితే ప్రతి ఊర్లో ఒక బడి పెట్టమని, ఇంటి కొకరన్నా చదువుకుంటే అతడు రూల్స్ అందరికి చెపుతాడని, వేధిస్తున్న అధికారుల మీద ఫిర్యాదు చేస్తాడని ఆయన్ను కోరారు. బడులు పెట్టారు. కానీ అప్పుడు, ఇప్పుడు రూల్స్ మాత్రం చెప్పటం లేదు.

'దున్నేవాడిదే భూమి, కాడెద్దులు ఎకరం నేల, ఎవరిదీ అడవి, పోడు మాజన్మహక్కు' ఇలా నినాదాలిచ్చి ఊరిస్తున్నారుకాని భూముల మ్యాప్‌లు, వాటిలో గుర్తులు అందులో కొలతలు వాటిలో యజమానులను నమోదు చేసే విధానం తమవిద్యార్ధి సంఘాల ద్వారా ఏ పార్టీ చెప్పటం లేదు. ప్రముఖ విద్యావేత్త వామపక్ష అభిమాని చుక్కారామయ్య గారు, తను స్కూల్ చదువు అయ్యాక ఖాళీగా ఉండడమెందుకని, కరణం గారిదగ్గర చేరానని, అక్కడ చూసిన రికార్డులలో లెక్కలలో తేడాలు రైతులకు చెపితే, వారు తగు విధంగా సరి చేయించుకునే వారని ఒక ఆదివారం ఆంధ్రప్రభలో రాసారు. అంత ముఖ్యమైన చదువు అయన కోచింగ్ సెంటర్ లో పోటీ పరీక్షలకు తయారయ్యే విద్యార్ధులకు అక్కరలేదు.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం సంప్రదాయ సరిహద్దులతో గ్రామపటం గీసి మధ్యలో ఉమ్మడి వాడుకలు గుర్తించి పోడు భూమి చేస్తున్నట్లుగా నేల మీద రుజువులు ఇరుగు పొరుగు రైతుల పేర్లు రాసి దరఖాస్తు చేయాలి.

ఇటువంటి మ్యాప్ లు గీయటం మనకు బడిలో నేర్పరు. విశ్వవిద్యాలయంలో ఆంత్రపాలజి పి.జి.విద్యార్ధులు, ప్రతి సంవత్సరం నెలరోజులు ఒక గిరిజన గ్రామం అధ్యయనంచేస్తారు. ఈ మ్యాప్‌లు గీయటం వారికీ అలవాటు చేస్తే ఈ పాటికి దేశంలో ఎంతో చైతన్యం వచ్చి ఉండేది. ప్రభుత్వం ఎవరో అధికారికి పురమాయిస్తుంది. ఎవరో ఒకరి చేత శిక్షణ ఇప్పిస్తారు. ఆ అధికారి ఏదో ఒకటి రాస్తాడు. వచ్చినవాడికి వస్తుంది. భూమిపట్టాలనుండి వోటర్ల జాబితా దాకా ఇదేవరస.

ఇటువంటి తప్పుడు తడకలతో నిండినవే మన రికార్డులు, వాటి మీద ఆధారపడ్డ కోర్టు తీర్పులు.

ఈ చట్టం ప్రకారం హక్కులు దక్కని వారిని తొలగించ వలసిందిగా సుప్రీమ్ కోర్టు ఉత్తర్వు లిచ్చింది.

ప్రభుత్వం తరపున న్యాయవాదులెవరు హాజరు కాలేదు. నిజమే ఇటువంటి తీర్పులు, నాటకాలు, వాటి మీద తాటాకుమంటలాగా మేధావుల స్పందనలు కొత్తేమి కాదు.

తెలంగాణాలో వరంగల్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంనుండి మంగంపేట మొదలైన 23 గ్రామాలను గిరిజన సంక్షేమ శాఖ సమా ధానం లేకుండానే 1977లా కోర్టు తొలగించిన విషయం బయట పెట్టింది, కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు స్వర్గీయ బియ్యాల జనార్ధన రావు. అయన వక్త రచయిత. నందిని సుందర్ లాగే వామపక్ష మేధావి. కానీ ఈ మధ్యనే కొందరు గిరినులు కోర్టు కెక్కి 1977 తీర్పు మీద విఫల పోరాటం చేస్తున్నారు.

1988లో 1/70 చెల్లుతుందని తీర్పు ఇచ్చింది. వెంటనే గిరిజనేతరులకిచ్చిన మైనింగ్ లీజులు రద్దు చేయ వలసిందిగా ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు. మూడేళ్ళు చూసి హైకోర్టు కెళితే, రద్దు చేసారు. ఈ తీర్పును సవరించమని పరిశ్రమల శాఖ ప్రతి పాదనను గిరిజన సలహా మండలి తిరస్కరించింది. ఈ తీర్పు ప్రకారం గిరిజనులకు, గిరిజన సహకారసంఘాలకు తప్ప ప్రభుత్వరంగ సంస్థలకు గిరిజన ప్రాంతంలో భూమి కేటాయించరాదని తెలియ చేస్తూ, ఖమ్మం జిల్లాలో అటవీ అభివృద్ధి సంస్థకు ఇచ్చిన 1600 ఎకరాల భూమి స్వాధీనం చేసుకొని గిరిజనులకు పంచి పెట్టవలసిందిగా గిరిజన కమీషనర్ ఆదేశించారు.

ఇంతలో కథ మరో మలుపు తిరిగింది. విశాఖ మన్యంలో మైనింగ్ లీజు అలాగే ఉన్నాయని ఒక కేసు కోర్టు కెక్కింది.

పరిశ్రమల శాఖ ఒక జి వో చూపించి గిరిజనేతరులందరూ తమకు తమ లీజులు బదిలీ చేసారని నమ్మబలికింది.

గిరిజన సంక్షేమ శాఖ మౌనం వహించింది. వారి సమాధానం కోరకుండా ఆ జి వొ చెల్లుతుందని ఇచ్చిన హై కోర్టు తీర్పును సుప్రీమ్ కోర్టు ఖాయం చేసింది. ఈ తీర్పును బాలగోపాల్ బీ.డి. శర్మలు ప్రశంసించారు. అరసం శ్రీకాకుళం పోరాటం ఫలితంగా వచ్చిన 1 / 70 కి గండిపడి గిరిజనప్రాంతంలో మైనింగ్ గిరిజనులతో

సంబధంలేని ఖనిజాభివృద్ధి సంస్థ చేతిలో కొచ్చింది.

ఈ తీర్పు చూపించి ఈ సంస్థ బాక్సైట్ తవ్వకాలకు లీజు కోసం దరఖాస్తు చేసింది. వెంటనే ఈ సంస్థకు అధికారమిచ్చిన జివో సరియైన పద్ధతిలో జారి చెయ్యలేదు అని కోర్టు కెల్లారు గిరిజన సంక్షేమశాఖ పాతకతే. సమాధానం దాఖలు చేయలేదు. దరఖాస్తు దశలోనే ఉందిగదా లైసెన్స్ వస్తే అప్పుడు చూసుకుందాం అంటూ కోర్టు కేసు ముగిసింది.

బేతాళుడి ప్రశ్న లాగా ఈ కథల్లో బాధ్యులెవరో ఎవరిని తప్పు పట్టాలో చెప్పటం ఏ విక్రమార్కుడి వల్లకాదు.

ఇహ అటవిహక్కు కేసు విషయానికొస్తే గిరిజనుల హక్కులు ఇంత వరకు గుర్తించకపోవడం చారిత్రక తప్పిదం అని చట్టంలో ఒప్పుకొన్నారు కాబట్టి ఆ తప్పు దిద్దుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. వోటరు జాబితా తయారు చేసినట్టు జనాభా లెక్కలు సేకరిచినట్టు ఇంటింటికి వెళ్లి సేకరించండి దరఖాస్తు చేయలేదని తొలగించరాదు అంటూ హైకోర్టు కెళ్ళాం. ఎవరిని తొలగించట్లేదని చెపితే కేసును ప్రభుత్వం వాయిదా వేయించింది. ఇది 2010 నాటి మాట.

ఇప్పుడే అందిన వార్త. కేంద్రం ఈ విషయమై దాఖలు చేసిన పిటిషన్ కోర్టు విచారించిన తన ఉత్తర్వుల అమలు ప్రస్తుతానికి నిలిపి వేసింది.

(21వ పుట తరువాయి...)

ఉండిపోవలసి వస్తున్నది.

ఇప్పుడు కూడా అటవీ హక్కు చెల్లుబాటును ప్రశ్నిస్తూ కొందరు మాజీ అటవీ అధికారుల ప్రోద్బలంతోనే సుప్రీం కోర్ట్ లో వాయిజ్యాలు పడుతున్నాయి. ఇటువంటి కీలకమైన కేసులో ప్రభుత్వ న్యాయవాదులు కనిపించక పోవడంతో సుప్రీం కోర్ట్ ఏకపక్షంగా తీర్పు ఇచ్చిన్నట్లు కనబడుతున్నది. కేసు విచారణకు ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టుకు హాజరు కాలేదని పలు ఆదివాసీ సంఘాలతో కూడిన కన్సార్టియం ఆరోపించింది. ముందుగా కేంద్ర ప్రభుత్వం అందుకు బాధ్యులైన న్యాయవాదులను గుర్తించి, వారిపై క్రమశిక్షణ చర్య తీసుకోవాలి.

ఇప్పుడు అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పును సవాల్ చేయమని రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నది. మరోవంక కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా సహితం తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆ మేరకు లేఖలు వ్రాసారు. ఈ చట్టం ప్రకారం భూ యాజమాన్యం హక్కు కోరుతూ దాఖలైన దరఖాస్తులను సానుభూతితో, పారదర్శకంగా చాలా రాష్ట్రాలలో పరిశీలన జరగనే లేదు. ఈ పేరుతో పలు చోట్ల గిరిజనేతరులకు భూములు అప్పచెప్పే ప్రయత్నం కూడా జరిగింది.

ఆయా రాష్ట్రాలు సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం ఇప్పటివరకు వివిధ కారణాలతో సుమారు 11,72,931 మంది ఆదివాసీలు, ఓటీఎఫ్‌డీల భూ యాజమాన్య హక్కుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. వీటిల్లో మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశాల్లోనే దాదాపు 20% ఉన్నాయి. తెలంగాణలో 1,83,252 మంది ఎస్టీలు దరఖాస్తు చేయగా, 82,075 తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ఆయా ప్రాంతా ల్లో తొలిగింపు ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 1,14,400 ఎకరాల అటవీ విస్తీర్ణం మేర భూ యాజమాన్య హక్కుల దరఖాస్తులు తిరస్కరణకు గురైనా ఇప్పటికీ తొలిగింపు ఉత్తర్వులు జారీ చేయలేదు.

అటవీ హక్కు చట్టం -2006ను నాటి యూపీఏ ప్రభుత్వం తెచ్చింది. అటవీ ప్రాంత వాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే ఉద్దేశంతో ఈ చట్టం తెచ్చినట్లు నాటి ప్రభుత్వం పేర్కొన్నది. 2005 డిసెంబర్ 31కి ముందు మూడు తరాలుగా అటవీ భూమిలో నివసిస్తున్న వారికి భూయాజమాన్య హక్కులు కల్పిస్తారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ దరఖాస్తులను పరిశీలించి ఈ హక్కులు కల్పిస్తుంది.

ప్రజలకు హక్కుల కల్పనతో అడవులతోపాటు వన్యప్రాణులకు నష్టం కలుగుతుందని వన్యప్రాణ సంరక్షణ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఈ చట్టాన్ని సరిగా అమలు చేయక ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చాలామంది అర్హులను తొలిగిస్తున్నాయని ఆదివాసీలంటున్నారు. 2011 గణాంకాల ప్రకారం దేశంలో సుమారు 10.4 కోట్ల మంది ఆదివాసీలు, గిరిజనులు ఉన్నారు. అటవీ ప్రాంతంలోని 1.70లక్షల గ్రామాల్లో సుమారు 20 కోట్ల మంది ఎస్టీలు, ఇతర అటవీ నివాసితులు నివసిస్తున్నారని ప్రజా సంఘాలు అంచనా వేస్తున్నాయి.

ఈ చట్టం అమలు పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న నేరమయ నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. ముందుగా కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు తీసుకు వచ్చి సుప్రీం కోర్ట్ తీర్పు అమలు కాకుండా చూడాలి. తర్వాత చట్టబద్ధంగా తీసుకోవలసిన చర్యలు తీసుకోవాలి. షెడ్యూల్డ్ తెగలు అంటూ రాజ్యాంగంలో కల్పించిన ప్రత్యేక సదుపాయాలు, హక్కులు అన్ని ప్రాధమికంగా తరతరాలుగా ఈ ప్రాంతాలలో నివసిస్తున్న వారి కోసమే. అయితే వారి పేరుతో మైదాన ప్రాంతాలలో ఉన్న పలువురు సహితం ఈ తెగల క్రిందకు రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని రావడం ద్వారా సింహభాగం ప్రయోజనాలు పొందుతున్నారు.

ఆదివాసీయుల అభివృద్ధి అంటే ఆదివాసీయులకు గల మహోన్నత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడి, ప్రోత్సహించడం. వారికి విద్య, వైద్య, రవాణా వంటి కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం. వారికి గల భిన్నమైన నైపుణ్యాలను, వృత్తులను, సాంస్కృతిక సుసంపదను అభివృద్ధి చేయాలి. కానీ, వారందరిని మైదాన ప్రాంతాలకు తీసుకు వచ్చి, వారికి బిచ్చగాళ్లుగా చేయడం అభివృద్ధిగా పలువురు భావిచడం దురదృష్టకరం.

ఇప్పటికి అనేక ఆదివాసీ గ్రామాలలో ఒక్కరు కూడా రిజర్వేషన్ సదుపాయాలు పొందని పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కరు కూడా చట్టసభలలో ప్రాతినిధ్యం పొందలేని అనేక కులాలు ఉన్నాయి. జ్వరం, జలుబు వచ్చినా మందుల కోసం, వైద్యం కోసం 10 నుండి 20 కి మీ దూరం నడకతో వెళ్ళవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. వారి జీవితాలలో వెలుగులు నింపడం కోసం నిర్దిష్టమైన విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలి.

మధురాంతకం నరేంద్ర
9866243659

అచ్చమైన తెలుగు రచయిత-కొలకలూరి ఇనాక్



విదేశీయమైన 'కథానిక' అనే సాహిత్య ప్రక్రియను అచ్చమైన తెలుగు ప్రక్రియగా మార్చిన గొప్ప కథకులలో గురజాడ అప్పారావుగారు తొలివాడైతే, ఆ దారిని మరింత సుగమం గావించిన తరువాతి కథానికా స్రష్టలలో మరో ముఖ్యమైన కథకుడు కొలకలూరి ఇనాక్‌గారు. ఆయన చదువుకున్నది తెలుగు భాషా సాహిత్యాల్లో యెమ్మే. పరిశోధన చేసింది తెలుగు వ్యాసం పైన. వుద్యోగం చేసింది ఆంధ్రోపన్యాసకుడిగా. సాహిత్య సాధనే ప్రవృత్తిగా జీవితాన్ని గడుపుతున్న అతి కొద్దిమంది రచయితలలో ఆయనొకడు.

కథా రచనలో ఓనమాలు దిద్దుకుంటున్న రోజుల్లో ఇనాక్‌గారి కథల సంపుటం 'భవాని' చదవడమె గొప్ప అనుభవం. ఆ సంపుటంలోని కథలలో ఇనాక్‌గారు కథావస్తువుతోనూ, శిల్పంతోనూ చేసిన ప్రయోగాలు స్పష్టంగా కనబడతాయి. ఆయన తనదైన గొంతును సమకూర్చు కోవడం, తనవైన వస్తువుల్ని, తనదైన విశిష్ట మైన రీతిలో కథల్ని నడపడం 'ఊరబావి' కథల నుంచీ ప్రారంభమైంది. అసలు సిసలైన తెలుగువారి జీవితాలకు సరిగ్గా సరిపోయే శిల్పాన్ని తయారు చేసుకో గలిగిన సృజనాత్మకత ఆ కథల్లో విప్పా రింది. ఆ కథల శిల్పాన్ని గమనించినప్పుడు ఆ కథల్లోని తెలుగుదనం తేట తెల్లమవుతుంది.

చనిపోయిన గొడ్డు చర్మాన్ని కోసి, దాన్ని రకరకాలుగా యెండబెట్టి, ఆ చర్మంతో చెప్పులు కుట్టే రాముడి కథ 'ఊరబావి' తిండిలేక పస్తులుండి, తిండికోసం ప్రమాదాన్ని కొని తెచ్చుకునే బిచ్చగత్తె చిన్నకథ 'ఆకలి' వూరివాళ్ల యిండ్ల నించీ మురికి బట్టల్ని తీసుకొచ్చి, చాకిరేవులో వుతికి ఆరబెట్టి, సాయంకాలానికంతా వాళ్ల యిండ్లకు చేరవేసే ముసలి గంగడి కథ పిండీకృత శాటి. ప్రతి యింటిలోని మరుగుదొడ్డినీ వూడ్చి శుభ్రం చేసి, ఆ కల్మశాన్నంతా తీసి వూరి బయటకు చేర్చే పాకీవాడు రాంకోటి కథ పశ్చాద్భూమి. వూరివాళ్ల మాసిన గడ్డాల్ని క్షవరం చేసి, వాళ్ళిచ్చే కాసిన్ని డబ్బులతో జీవితాన్ని లాగే నాగలింగం కథ తల లేనోడు. వూరినేలిన దొరగారి దౌర్జన్యాన్ని తెలివిగా యెదుర్కొని పగ తీర్చుకున్న మాదిగ నాగన్న కథ 'గొడ్ల దొంగ'. కొత్త చెప్పులు, రమణా కూతురు, పొట్ట పేగులోతు, ఆకాశగంగ, సూర్యుడు తలెత్తాడు...యిలా చెప్పుకుంటూ పోతే అనేక కథలు ఇనాక్‌గారి కథల యితివృత్తాలెలా వుంటాయో గుర్తు చేస్తాయి. అయితే ఆ కథల్లోని తెలుగుదనం పాలలో కలిసే తేనెలా విడదీయరానంతగా కలిసిపోయి వుంటుంది.

'ఊరబావి చుట్టూ జనం మూగారు' అని ప్రారంభమయ్యే ఊరబావి కథ తెలుగు ప్రపంచంలోని మాదిగ వాళ్ళ జీవితాన్నంతా వొక డైరీలా పరిచయం చేస్తుంది. ఎద్దుదడ్డెం, కండకరొడ్డు, గిలకబావి, కుదుళ్ళు, కోవులు, కావిడిబద్ద, పట్టెడనారు, చిటికేసర చెట్టు, గెలగాబు, శాంబరం, గూటం, ఆరె, పనికత్తి, ఉంగటం, కుట్టువారు, తాబేటి కాయ, గిలకపట్టీ, ఏనుగుముళ్ళు, దూముది - యిలా కథంతా అసలు సిసలు తెలుగు జాతీయాలూ, పదులూ, నుడికారాలతో నిండిపోయింది.

వో బీదపిల్ల ఆకలి బాధను చిత్రించే ఆకలి కథలో రచయిత అనేక రకాల ఆహార పదార్థాలను పరిచయం చేస్తాడు. అరటిపండ్లు, పప్పుచారు, బ్రెడ్డూ బటరూ, ద్రాక్ష పళ్ళు, బత్తాయి, కమలావాడు, నారింజ, పచ్చరటి, చక్కరకేళీ, జిలేబీ, పరమాన్నం, బూంది, బిస్కట్లు, గొడ్డుకారం, పచ్చి పులుసు, పుల్ల నీళ్లు యిలా ఆ పిల్ల తనకు పరిచయమున్న ప్రతి ఆహారాన్నీ కలవరిస్తుంది.

'తల లేనోడు' కథలో మంగలివాళ్ళ జీవితంలోని అన్ని పార్శ్వాలనూ పరిచయం చేస్తాడు కథకుడు. పొది, తలగంటు, క్షౌరీ రాయి, ముచ్చికల గుంట, జుత్తు కొడవలి, దొమ్మ పొగరు, గొంతు కోలు, మెడతోలు మడత - యిలా మంగలి వృత్తికి సంబంధించిన అనేకానేకమైన పదాలంటే వాడాలంటే ఆ రచయితకు ఆ పని చేస్తున్న వ్యక్తి జీవితాన్ని గురించి సాధికారికమై పరిచయంతో బాటూ, ఆ వ్యక్తిపైన కొండంత సానుభూతీ వుండి తీరాలి.

ఇనాక్‌గారి తెలుగుదనం గొప్ప ప్రమాణాలకు చేరుకున్న కథ, తెలుగువాడు మాత్రమే రాయగలిగిన కథ. "పిండీకృత శాటి", చాకలివాడి కథకు 'వుతికి, పిండి, ఆరేసిన బట్టకి పిండీకృత సాటి అని పేరు పెట్టడం అది శ్రీ కృష్ణదేవరాయలు.'ఆముక్త మాల్యద' లోని ప్రయోగం గావడం అరుదైన సంఘటన. పేరు దగ్గరి నుంచీ, వర్ణనలూ, కథనం వరకూ తెలుగు పండితుడి మాట కారిత్వం సమకూర్చుకున్న కథ. ఊరి చెరువు గట్టుపైన నడుస్తున్న గూగడు "అవసరమైంది స్వీకరించి, అనవసర మైంది నెమ్మదిగా అవతలికి నెట్టే రచయిత కలం లాగా నడుస్తున్నాడు'' అంటారు రచయిత. మోటబావిలోని నీళ్ళు "యెంత పైకి లాగితే అంత అధికంగా పెరిగే విద్య' లా వుందంటాడు. రత్తయ్య అనే

మోతుబరి పట్ల వూళ్లో వాళ్ళకున్న గౌరవానికి రచయిత 'భయజం' అని పేరు పెడతాడు. అతి చిన్న వాక్యాలనూ, అతి పెద్ద వాక్యాలనూ రాయడం ఇనాక్‌గారి వచనంలోని విశిష్టత.

'వీపు మీద బరువు వుంటే తాబేటి నడక. చాలా నెమ్మది'. అని రాసే రచయితే 'గిలక మీద బొక్కెన కట్టి వున్న తాడు తీసి, చప్టాకు అవతలపెట్టి, తాడి చెట్టు దగ్గర అంతకు ముందు రోజు పెట్టుకుపోయిన చేంతాడూ కడవలూ వెలుపలికి తెచ్చి, తాడు గిలకమీద వేసి, బావిలోకి పోనిచ్చి, ఉచ్చుముడి తడిపి, పైకిలాగి, కడవకు ఉచ్చువేసి, బావిలోకి వదిలాడు గూగడు' అని గూడా రాస్తాడు. "అవి బట్టలు. ఊరి బట్టలు. మాసిన బట్టలు. మాసిన ఊరి బట్టలు. నీళ్ళలో నానుతున్నాయి." అని రాశాక "అవి రకరకాలనీ, రంగు రంగులవీ, పిన్నలవీ, పెద్దలవీ; స్త్రీలవీ, పురుషులీ; కొత్తవీ, పాతవీ; అన్ని దశలలో మురికి అయినవీ, అన్ని రకాల మనుష్యులవీ; మంచివారివీ, చెడ్డవారివీ; సుఖం కలిగించిన వారివీ, దుఃఖం పంచి పెట్టిన వారివీ; అన్నం పెట్టిన వాళ్ళవీ, అవస్థలు పెట్టిన వాళ్ళవీ; ఆరోగ్యవంతులవీ, రోగిష్టి వారివీ; అందానికి కట్టుకునేవీ, అవసరానికి కట్టుకునేవీ; అన్నీ అన్ని విధాలయిన బట్టలూ నానుతున్నాయి" అని ముక్తాయిస్తాడు.

ఇనాక్‌గారు వాడే ఉపమానాలు గూడా తెలుగువారి జీవితంలోంచీ తీసుకున్నవే! "పోరంబోకులో వేప చెట్టు కింద ఎద్దు దట్టెం మీదా, ఆకాశం నిండా, తిరునాళ్ళలో జనంలాగా కాకులూ, గద్దలూ, రాబందులూ (ఊరబావి). రాత్రి, ఆకలితో మునగదీసుకుని పడుకుంటే వర్షం – పేదవాడి శాపంలాగా ఇల్లంతా కురిసింది. (ఆకలి). నిన్న మొన్నటి దాకా, ఏ చెట్టునో పచ్చగా, పచ్చి బాలెంత రాళ్ళు మాదిరిగా కలకలలాడిన కొమ్మలు, అంతకు ముందే సూర్యుడి సంతానంతో స్నేహం చేసి, అనుకోకుండా మండిపోతున్నాయి (పిండీకృతశాటి) తడి తడిగా చెమ్మ చెమ్మగా ఉన్న లోకం యాదికి వచ్చిన సూర్యుడు, నేల వెన్ను రసిగారుతున్న పుండులాగున్నాడు (పశ్చాద్భూమి). తల పెరిగిపోయి కీకారణ్యంలా వుంది. గడ్డం సింహం జూలులా వేలాడబడి వుంది (తల లేనోడు).

దళితవాద వుద్యమంలోనూ, స్త్రీవాద వుద్యమంలోనూ, మైనారిటీవాద వుద్యమంలోనూ తొలి దశలో ఆత్మ కథాత్మకమైన రచనలే వెలువడతాయి. ఇతరుల జీవితాలతో మమేకమై తనదిగాని జీవితాల్ని ఆవిష్కరించేటప్పుడు ఆ రచయిత చాలా పరిశోధన చేయ వలసి వుంటుంది. అయితే పరిశోధనలో దొరికిన విశేషాల నంతా కథలో జొప్పిస్తే ఆ కథ వ్యాసంలా తయారవుతుంది. ఇనాక్‌గారి గొప్ప కథల్లో ఆయా జీవితాలు సాధికారంగా చిత్రించడంతో బాటూ, ఆయా జీవిత పార్శ్వాలనంతా కళాత్మకంగా ఆవిష్కరించే సృజనాత్మక నైపుణ్యం విశిష్టంగా రూపొందుతుంది. అప్పుడే 'కట్టడి' వంటి అరుదైన జీవితాలకు సాహిత్య గౌరవం చేకూరుతుంది.

"మునివాహనుడు"గా ప్రసిద్ధి పొందిన తిరుప్పాణ్ కథను ఇనాక్‌గారు "మునివాహనుడు" అనే పేరుతో గేయనాటకంగా రాశారు. అస్పృశ్యత, భక్తి, మానవత్వం మొదలైన అనేక అంశాల చర్చగా సాగే తిరుప్పాణ్ జీవితాన్ని ఇనాక్‌గారు ప్రతిపాదింపదలచుకున్న మానవత్వానికి ఆలంబనగా, దళిత వుద్యమానికొక గొప్ప భూమికగా రూపొందిస్తారు. అలతి అలతి పదాలతో సరళంగా, సాగే యీ నాటికలో రచయిత సంక్షిప్తమైనవీ, వివాదాస్పదమైనవీ అయిన అంశాలని చర్చను పాఠకుల (ప్రేక్షకుల) మనసుల్లో చెలరేగేలా చూస్తాడు.

'సరేలేరా రంగనా సత్యవాక్యము తెలుపుమా
ముఖమ్మున్నది అద్దమున్నది ముక్తి నీవై కావుమా
వార్ధిపోలిన నల్లనయ్యా ఉలుకు పలుకులు లేవురా
సిరుల చిమ్మెది రంగనాథా నిన్ను కన్నుల చూడరా" అని

గేయం రాసినా...

మనుజుడైన వాడె నేడు మహితశకితయైన మాట
అంటరాని వాడె చూడు ముని వాహనుడైన బాట
మానవత్వ మిలను నేడు మాధవత్వ మందగనుట

తత్త్వమేమి? నిత్యమేమి? సర్వజగత్ సత్యమేమి?" అని ఛందస్సులో రాసినా, ఇనాక్ గారి తెలుగు సలలితంగా, రాగభరితంగానే వుంటుంది. పాశ్చాత్య విమర్శకులు చెప్పే "ఎపిఫొనీ" భారతీయ లాక్షణికులు చెప్పే 'రసన' – రెండూ ఇనాక్‌గారి అన్ని రచనల్లోనూ వుంటాయి.

ఇనాక్‌గారు యితర ఆధునిక ప్రక్రియలైన వచన కవిత, విమర్శ, నవలలో గూడా తనదైన విశిష్టమైన పద్ధతిలో విరివిగా రచనలు చేశారు. ఆయనకు కనీసం రెండు దశాబ్దాలకు మునుపే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చి వుండాలి. యింత ఆలస్యంగానైనా ఆ పురస్కారం ఆయనకు రావడం వల్ల ఆ పురస్కారానికి గౌరవం దక్కింది. చాలా రోజుల తర్వాత యేర్పడిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి ఆయనను అధ్యక్షుడిగా యెన్నుకోవడం చాలా సముచితంగా వుంది. యిలాంటి మంచి పనులు జరిగినప్పుడల్లా మనం మంచి దారిలోనే నడుస్తున్నామన్న నమ్మకం కలుగుతుంది.

డా॥ గుమ్మా సాంబశివరావు
98492 65025

నిత్య సాహితీవ్రతుడు ద్వా.నా.శాస్త్రి



"నానా పుస్తకముల్ పఠించి బహుళ జ్ఞానమ్ము సాధించి, వి / జ్ఞాన గ్రంథములన్ లిఖించియు సివిల్ సర్వీసుల్ ఆంధ్రులన్ / జ్ఞానాగారములన్ బొనర్చిన మహా సాహిత్య దాహోపగన్ / ద్వానాశాస్త్రిని మెచ్చెదన్ తెలుగు పుంతన్ నారికేళ ప్రభన్" – అని ద్వానా శాస్త్రిగారి షష్టి పూర్తి సంచికలో సహ స్రావధాని డా॥ గరికపాటి నరసింహారావు గారు పలికిన పలుకులు అక్షర సత్యాలు. ద్వా.నా. శాస్త్రిగా ప్రసిద్ధి పొందిన ద్వాదశి నాగేశ్వర శాస్త్రిగారు కృష్ణాజిల్లా లింగాల గ్రామంలో 15-6-1948 న జన్మించారు. లక్ష్మీ ప్రసన్న, కృష్ణమూర్తిగార్లు వీరి తల్లిదం డ్రులు. వీరి శ్రీమతి దుర్గ ద్వానాగారి సాహితీ యాత్ర నిరంతరం సాగటానికి దోహదపడిన సాధ్వి. వీరి కుమారుడు శశికాంత్, కుమార్తె సునీత విద్యావంతులు. ఏలూరు సి.ఆర్.రెడ్డి కళాశాలలో బి.యస్.సి.చదివిన ద్వానా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు చద వటం విశేషం. ఎం.ఫిల్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం రాజ మండ్రి ప్రాంగణం నుంచి తెలుగు సాహితీ సంస్థల సేవను గూర్చి మొట్టమొద టగా పిహెచ్.డి. పొందిన వ్యక్తి ద్వానా శాస్త్రి.

ద్వానా శాస్త్రిగారు నిరంతర సాహితీ యాత్రికుడనటానికి ఏడు పదుల జీవితంలో డెబ్బైకి పైగా గ్రంథాలు రచించటమే సాక్ష్యం. వీరి చివరిగ్రంథం కవిగారు శ్రీ మారేపి రామచంద్రశాస్త్రిగారిని గూర్చి రచించారు. అది ఆవిష్కృతం కాకుండానే 26.2.19 అర్ధరాత్రి ద్వానా అసువులుబాయటం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు. ద్వానాశాస్త్రి గారికి రచయితగా మంచి పేరు తెచ్చిన గ్రంథం 'తెలుగు సాహిత్య చరిత్ర' ఈ గ్రంథం వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కర దీపికగా ఉండి ఇప్పటికి పది ముద్రణలు పొందటం విశేషం. కుసుమ ధర్మన్నను గూ ర్చి తొలిసారి 'తొలి దళిత కవి కుసుమ ధర్మన్న' అనే పుస్తకాన్ని రచిం చారు. సి.నా.రె. అంటే ద్వానాగారికి ఎంతో అభిమానం. అం దుకే 'నానీలలో సినారె' గ్రంథాన్ని రాశారు. ఆచార్య తూమాటి దొణప్పగారి మీద తన కున్న గౌరవాన్ని 'గురు శిరోమణి తూమాటి దొణప్ప' అనే గ్రంథంలో ప్రదర్శించారు.

ద్వానాశాస్త్రిగారు ఒక విలక్షణ స్వభావం కలవారు. సైన్సు నుంచి తెలుగు లోనికి వచ్చిన శాస్త్రిగారు తనదైన ముద్రను ప్రకటించాలనే తపన కలిగినవారు. అధ్యాప కునిగా అమలాపురంలో తన వృత్తిని సాగిస్తూ రచయితగా తనకు గుర్తింపు తెచ్చుకోవటానికి నిరంతరం శ్రమించేవారు. పాతికేళ్ల అధ్యా పక వృత్తి పూర్తి చేసుకొని, నెలకు లక్ష రూపా యలు జీతాన్ని వదులుకొని సివిల్ సర్వీసు పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి శిక్షణ ఇవ్వటానికి అమలాపురం నుంచి హైదరా బాదుకు మకాం మార్చిన ధైర్యశాలి డాక్టర్ ద్వా.నా.శాస్త్రి. తన శిక్షణ ద్వారా వందల మంది విద్యార్థులు ఐ.ఏ.యస్, ఐ.పి.ఎస్, గ్రూప్1, గ్రూప్ 2, లెక్చరర్, అధ్యాపక పద వుల్ని పొందటం తనకెంతో ఆనందాన్ని కలి గించిందని, తాను ఉద్యోగాన్ని ఇచ్ఛికంగా వదులుకోవటం తప్పు కాదనిపించిందని వారు నాతో చెప్పి ఎంతో సంతోషించారు.

ద్వానాశాస్త్రిగారి దినచర్య ఎంతో క్రమబద్ధంగా ఉండేది. ఉదయం 4 గంటలకే నిద్రలేచి ఆ రోజు చెప్పవలసిన పాఠాలకు సంబంధించిన విషయాల్ని నోట్ చేసుకొని ఆ పైన ఉదయం నడక, ఆ తర్వాత శిక్షణా తరగతులకు హాజరు కావటం, సాయంత్రం సాహిత్య సభలకు వెళ్ళటం – ఇలా క్షణం తీరిక లేకుండా నిత్యం సాహిత్య యాత్ర చేస్తూ ఉండేవారు. ఆదివారాలలో ఇతర ఊళ్ళలోని సాహిత్య కార్యక్రమాలకు వెళ్ళేవారు. పోటీ పరీక్షకుల శిక్షకునిగా తెలుగు సాహిత్యానికి 'గ్లామర్' కల్పించిన విశిష్ట అధ్యాపకుడు.


పుస్తక సమీక్షలో ద్వానా అగ్రస్థానంలో ఉంటారు. దాదాపు వెయ్యి గ్రంథాలు సమీ క్షించి ఉంటారు. 'సమీక్షా చక్షువు' అనే గ్రంథ సమీక్షల పుస్తకాన్ని కూడా వెలువరించారు. వేగవంతంగా వ్యాసాలు, సమీక్షలు పత్రికలకు రచించటంలో ద్వానా ముందు వరుసలో ఉండేవారు. తెలుగు రాష్ట్రాలలోని పలు సాహితీ సంస్థలు ద్వానా శాస్త్రిగారిని సత్కరిం చాయి. మారిషస్, సింగపూర్‌లలో పర్యటిం చారు. మారిషస్‌లో ఆరు రోజులు అనే గ్రంథాన్ని కూడా రచించారు. సింగపూర్‌లో వారితో పర్యటించే అదృష్టం ఈ వ్యాసకర్తకు కలిగింది.

శాస్త్రిగారు తాము అనుకొన్న విష యాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్ప టానికి ఏ మాత్రం వెనుకాడరు. ''అవధానాలు మ్యాచ్ ఫిక్సింగులు' అనే వ్యాసాన్ని రచించి వివాదానికి తెరతీశారు. ద్వానా హాస్యం అంటే ఇష్ట పడతారు. ఇతరుల మీద జోక్స్ వేసిన పుడు ఎంత ఆనందపడతారో, తనమీద ఎవ రైనా హాస్య రసం చిలికినా అంతే ఆనం దాన్ని పొందుతారు. కడుపులో ఏమీ దాచు కోని తత్త్వం, స్నేహానికి విలువనిచ్చే నైజం, మిత్రు ల్ని ప్రోత్సహించే సుగుణం ద్వానాలో త్రివేణీ సంగమంగా భాసిస్తాయి. అవార్డులు స్వీకరిం చాలనే తపన తనకు ఉన్నా, ఇతరుల్ని సత్క రించాలనే సహృదయం కూడా ద్వానాలో ఉండటం విశేషం. నేను రచించిన 'తెలుగు సాహిత్య చరిత్రకారులు' గ్రంథాన్ని ద్వానా శాస్త్రిగారికి అంకితం చేశాను. వారు రచించిన శ్రీశ్రీ మహాప్రస్థానం ధగధగలు' గ్రంథాన్ని నాకు అంకితం చేశారు. సాహిత్య సముద్రంలాంటి ద్వానా శాస్త్రి వ్యక్తిత్వాన్ని ఈ చిరు వ్యాసమనే బిందువులో చూపించే ప్రయత్నం చేసిన నేను ద్వానాశాస్త్రి పై రచించిన పద్యంతో ఈ వ్యాసాన్ని ముగి స్తాను. "పోటీ పరీక్షల' ఘనా / పాటి'కి పుస్తక సమీక్ష భాసుర మతికిన్ / మేటికి, ద్వానా శాస్త్రికి / గాటపు స్నేహమున నిత్తు కవితా సుమమున్".

వీవెన్
9963029061

తెలుగు భాషకు ఆధునిక హోదా-14

జాలంలో శ్రమదానం



రానున్న ఐదేళ్ళలో అంతర్జాలం వాడుకునే తెలుగువారి సంఖ్య 5 కోట్లకు పెరుగుతుంది, అందులో మూడు కోట్ల మంది ఎక్కువగా వాడేవారుంటారు. వీరందరి వినోద, విజ్ఞాన, వికాస అవసరాలను తీర్చే తెలుగు సమాచారం అంతర్జాలంలో అందుబాటులో లేదు. అంతర్జాలంలో తెలుగు సమాచార పెంపుకి మనందరికీ ఉన్న అవకాశాల గురించి చెప్పుకుంటూ ఎవరికి వారు స్వంతంగా ఏర్పరచుకోగలిగే మాధ్యమ వేదికలు అంటే బ్లాగులు, యూట్యూబు ఛానెళ్ళు, మొదలైనవాటి గురించి పోయిన నెల వ్యాసంలో తెలుసుకున్నాం. ఈ నెల వ్యాసంలో సమష్టిగా మనందరం కలిసి కూర్చుకోగలిగిన సమాచార వనరుల గురించి తెలుసుకుందాం.

స్వేచ్ఛా సమాచార వనరులు

సమాచార సృష్టికర్తలు లేదా కాపీహక్కుదార్లు వారి హక్కులను సడలించుకొని (పూర్తిగా వదులుకోకుండానే) వారి సమాచారాన్ని ఎవరైనా స్వేచ్ఛగా వాడుకునేలా విడుదల చేస్తే అవి స్వేచ్ఛా సమాచార వనరులు. ఉదాహరణకు, అమ్మనుడి పత్రికను క్రియేటివ్ కామన్స్ అనే స్వేచ్ఛా లైసెన్సు ద్వారా అందిస్తున్నారు. అంతర్జాలంలో లభించే దంతా స్వేచ్ఛగా అందుబాటులో ఉన్న సమాచారం కాదు. దాన్ని మనం న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా వాడుకోలేము. కాపీహక్కులు లాంటి విషయాలు పట్టించుకోకుండా వాడుకుంటున్నామంటే అది న్యాయపరమైన లేదా ఇతరత్రా చిక్కులకు దారితీయవచ్చు. అందుకు విరుద్ధంగా సమాచారాన్ని స్వేచ్ఛగా అందరూ వాడుకునేలా కాపీహక్కుల సడలింపుతో కూడా అందించే స్వేచ్ఛా సమాచార వనరులు చాలా ఉన్నాయి. కేవలం వాడుకునే వనరుగానే కాక, అందరూ కలిసి సమష్టిగా అభివృద్ధి చేసే వనరులు కూడా ఉన్నాయి.

తెలుగువారికి కావలసిన తెలుగు సమాచారాన్ని స్వేచ్ఛగా, సమర్థవంతంగా, చౌకగా అందించడానికి ఈ స్వేచ్ఛా సమాచార వనరులు ఒక అద్భుతమైన మార్గం.

వికీపీడియా (te.wikipedia.org): లోకంలోని జ్ఞానాన్ని అంతా ఒక్కచోట చేర్చి అందరికీ స్వేచ్ఛగా, ఉచితంగా అందించే మహా ప్రయత్నమిది. నిర్ధారించుకోగలిగిన విషయాలను తటస్థ దృక్కోణంలో దీనిలో వ్రాయవచ్చు. అన్ని రంగాలల్లోని విషయాల గురించి మనం దీనిలో సమష్టిగా వ్యాసాలను వ్రాయచ్చు. నిరంతరం సమాచారం చేరుతూండే తాజా సమాచార నిధి ఇది. తెలుగులో విజ్ఞాన సర్వస్వాన్ని కూర్చడానికి ఇంతకంటే మహత్తరమైన అవకాశం లేదు.

వికీసోర్స్ (te.wikisource.org): కాపీహక్కులు ఉడిగిపోయిన లేదా వదిలేసుకున్న లేదా కాపీహక్కుల సడలింపుతో ఉన్న మూలగ్రంథాలను సేకరించి, డిజిటలీకరించి, అందుబాటులోనికి తెచ్చే ప్రయత్నమిది. మనందరి చొరవతో, తోడ్పాటుతో ఇది బృహత్‌గ్రంథాలయం కాగలదు. మీ రచనలను వికీసోర్స్‌కు దానమియ్యవచ్చు. ఇక్కడున్న కావ్యాలను, గ్రంథాలను డిజిటైజ్ చెయ్యవచ్చు, అచ్చుతప్పులు దిద్దవచ్చు.

వికీమీడియా కామన్స్ (commons.wikimedia.org): మీరు తీసే అరుదైన ఫొటోలను, వీడియోలను అందరూ కాపీహక్కుల బెడద లేకుండా వాడుకోగలిగేలా ఇక్కడ అందుబాటులో ఉంచవచ్చు. ఇక్కడ ఉన్న ఫొటోలను వీడియోలను కూడా మనం వాడుకోవచ్చు. తెలుగు సంస్కృతిని, మన పరిసరాలను ప్రతిబింబించే చిత్రాలను గట్రా పదిలపరచడానికి ఇది ఒక మంచి మార్గం.

వికీబుక్స్ (te.wikibooks.org): అందరూ కలిసి వికీ పద్ధతిలో పాఠ్య పుస్తకాలను, మాన్యువళ్ళను వ్రాసే ప్రయత్నం.

విక్షనరీ (te.wiktionary.org): సమష్టిగా నిఘంటువును తయారుచేసే ప్రయత్నం ఇది.

ఓపెన్‌స్ట్రీట్‌మ్యాప్ (openstreetmap.org): కేవలం ప్రపంచ వ్యాప్త పటం మాత్రమే కాక సకల భౌగోళిక సమాచారం (దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామాలు, ప్రాంతాలతో బాటు వాటిని కలిపే రహదార్లు, రైల్వే లైన్లు, నగరాలు, పట్టణాలలోని దారులు, వీధులు, ట్రాఫిక్ సూచనలు, భవనాలు, వాటి పేర్లు, వాటిలో నడుస్తున్న సంస్థల పేర్లు, నీటి వనరులు, ఉద్యానవనాలు, వంతెనలు, పైదార్లు, కిందార్లు, కాల్దార్లు) ఒక చోట కూర్చే మహాప్రయత్నం ఇది. మన తెలుగు రాష్ట్రాలలోని భౌగోళిక సమాచారాన్ని మనం దీనిలో, తెలుగు పేర్లతో సహా, చేర్చవచ్చు.

కామన్ వాయిస్ (voice.mozilla.org): యంత్రాలు కూడా మనుషుల్లా మాట్లాడేలా, అవి మన మాటలను అర్థంచేసుకునేలా వాటికి శిక్షణ ఇచ్చే ప్రయత్నం ఇది. కొన్ని వాక్యాలను మనం ఎలా పలుకుతామో/మాట్లాడతామో ఆడియో రూపంలో సేకరిస్తే వాటిని విని మన మాటలను యంత్రాలు గుర్తుపట్టగలవు. తెలుగువారు

మాట్లాడే ఇంగ్లీషు వాక్యాలను, తెలుగు వాక్యాలను వీలైనన్ని వైవిధ్యమైన గొంతులలో సేకరిస్తే యంత్రాల అందరినీ అర్థం చేసుకోగలుగుతాయి. ఈ సైటులో ఉన్న వాక్యాలను చదివి అక్కడే రికార్డు చేయవచ్చు. తద్వారా, భవిష్యత్తులో మన తెలుగు మాటలకు స్పందించే ఉపకరణాల తయారీలో తోడ్పడవచ్చు.

స్టోరీవీవర్ (story weaver.org.in) : చిన్న పిల్లల కోసం కథలు అల్లడానికి, కథలను అనువదించడానికి ఉద్దేశించిన వేదిక ఇది. బొమ్మలకు తగ్గ కథలు వ్రాయడంతో పాటు, మనకు తెలుగులో అందుబాటులో లేని కథలను ఇతర భాషల నుండి అనువదించుకోడానికి ఇది మంచి మార్గం.

అంతర్జాలం అవకాశాల పుట్ట. పైన పేర్కొన్నవి కొన్ని మాత్రమే. వివిధ రంగాల్లోని నిపుణులు, ఏదైనా అంశంపై ఆసక్తి ఉన్నవారు ఆయా రంగాల్లో జరుగుతున్న పురోగతిని తెలుసుకోవడం మాత్రమే కాదు, దానిలో భాగమయ్యే అవకాశం ఇప్పుడు అంతర్జాలం ద్వారా అందరికీ అందుబాటులో ఉంది. తెలుగువారందరూ ఈ నవ మాధ్యమాన్ని కేవలం వినోద మాధ్యమానంగానే కాక విజ్ఞానదాయకంగా కూడా వాడుకుంటారని, దీనిలో తెలుగు సమాచార పెంపుతో తెలుగును వెలిగిస్తారని ఆశిద్దాం.

నెల్లూరులో అంతర్జాతీయ మాతృభాషోత్సవం



నెల్లూరు మూలాపేటలోని శ్రీ అన్నదేవులగోవిందురెడ్డి సరస్వతీ సమాజంలో 19వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, 37 సంఘాల, సంస్థల ఆధ్వర్యంలో మూలభాషల సంబరంగా జరిగింది. నెల్లూరు కళాశాల ఆంధ్రశాఖ విశ్రాంతాధ్యక్షులు శ్రీ మోపూరు వేణుగోపాలయ్య అధ్యక్షత వహించారు. తెలుగు భాష విశిష్టతను వివరించి, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. నగరంలోని భాషాభిమానులు కవులు కళాకారులు రచయితలు అధ్యాపకులు విద్యార్థులు, 25 కళాసంఘాల అధ్యక్షులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని ప్రముఖ మనసు వైద్యులు డా॥శ్రీనివాసతేజ మాట్లాడుతూ అమ్మ భాషలో చదువు కోవడం, విద్యాబోధన ఆవశ్యకతను సౌలభ్యాన్ని సోదాహరణంగా వివరించారు. భాషోద్యమ సమితి నాయకులు గత కృషిని వివరించి భవిష్యత్ కర్తవ్యాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా పరిసర పాఠశాలల్లో జరిగిన పద్యపోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అత్యంత పేదరికంలో ఉన్న మూలభాషా విద్యార్థిని చెంచులక్ష్మి శ్లోకాల ప్రతిభకు ప్రత్యేక బహుమతిని అందజేశారు.

'మాతృభాషలో మాట్లాడటానికి సిగ్గు పడవద్దు'

మైదుకూరులో భాషోద్యమకారుడు తవ్వా ఓబుల్ రెడ్డి





ఎవరి మాతృభాషలో వారు మాట్లాడటానికి సిగ్గుపడే రోజులు పోయినప్పుడే ఆ భాష అంతరించకుండా మనుగడ సాగిస్తుందని తెలుగు భాషోద్యమ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు, 'తెలుగు సమాజం అధ్యక్షుడు తవ్వా ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. మైదుకూరులోని భారతీ బాలికల జూనియర్ కళాశాలలో ఫిబ్రవరి 21న జరిగిన మాతృభాషా దినోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహిస్తూ ప్రపంచంలోని ఆరువేల భాషల్లో రెండువేల భాషలు అంతరించి పోయాయనడానికి మిగిలిన భాషలకు కూడా ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.


భాషోద్యమ కారులూ, సాహితీవేత్తలూ, పత్రికా సంస్థలు తెలుగు భాష పరిరక్షణకు చేస్తున్న ప్రయత్నాలకు విద్యార్థులు, ప్రజలు అండగా నిలవాలని ఆయన పిలుపిచ్చారు. ఇంటర్మీడియట్ స్థాయి వరకు ఒక అంశంగా తెలుగు బోధనను తప్పని సరి చేయాలని, తెలుగు ప్రాధికార సంస్థను పరిపుష్టం చేసి రాష్ట్రంలో భాషా, సాహిత్య వికాసానికి ప్రభుత్వం తక్షణమే తగు చర్యలను చేపట్టాలని ఆయన కోరారు. తెలుగు భాషాభివృద్ధికి రాజకీయ పార్టీలు చేపట్టబోయే చర్యలను తమ ఎన్నికల ప్రణాళికల్లో పొందు పరచాలని తవ్వా ఓబుల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి ప్రార్థనా గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా 'తెలుగు – గొప్పదనం' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ఇచ్చారు.

సంతోకం

సమ్మెట ఉమాదేవి

9849406722



...అసలు ఎలుతురు జూసి ఎన్ని దినాలాయె అన్నట్టున్నది బద్రమ్మా...గిట్ల ఇప్పుడన్నా మాట్లాడకుండా ఉంటె ఆయింత ఉన్న మాట కూడా పోతదో ఏందో అనిపిస్తాంది? ఎవ్వాళ్ళనేమంటం. నీ కొలువుమాని సదువులుమాని నాకాడా గూసోని ముచ్చట్లు జెప్పమనలేను గదా...

"ఎంది బద్రమ్మా మంచిగున్నవా అని అడుగుతున్నవా? అయ్యో దేవుడా.. ఇసొంటప్పుడు మనం మంచిగుండే అవుసరమే లేదు. పాణంతోటి ఉంటె సాలు కొడుకులు బిడ్డలు ఎత్తుకొని ఈడకు దీసుకొస్తరు. అస్సల్కి ఏమి జెప్పేతట్టున్నది నా సంగతి. మీ బావ సచ్చిపోక ముందు ఎములాడ రాజన్నకాడికి పోయే మొక్కున్నది కొడుకా.. పోయినోడు ఆయన పోనే పోయిండు నేనన్న పోయొస్త బిడ్డా..! దేవుని గుడికి తీస్కపోమ్మని పెద్దోడ్ని

ఎన్నిసార్లు అడిగిన్నో. నీకు సక్కంగా నడకనే వస్తలేదు ఏడికి బోతవ్ ఊకే కిర్ కిర్ బెట్టకుమన్నడు...

"అయ్యా రమేశా...! మా యారాలు నేను కాస అక్క చెల్లెళ్ళ తీరుండేటోళ్ళం. ఆళ్లు ఇప్పుడు బోనగిరిల ఉంటుండ్రు... ఒకసారి తీస్కపోరా రెండు దినాలుండొస్తా అని నేను జరంత మంచిగున్నప్పుడే నడిపోన్ని ఏమి బతిమలాడినా బతిమిలాడిన.. యాడ ఇన్నడు. అరె నులక మంచం మీద పండి పండి యాష్టకొస్తాన్దిరా మీరు బొయ్యే బండిలోనే నన్నుసుత సమ్మక్క జాతరకు కొంచబోండిరా అని చిన్నోన్ని పెద్దోన్ని ఎన్ని సార్లడిగిన్నో....అసలు పట్టించుకున్నోల్లె లేరు...

"చిన్నమరిది కూతురు బొమ్మ లెక్కనే ఉంటది. పెద్దమ్మా నువ్వు రాకుంటే లగ్గమే జేసుకోను అన్నది బిడ్డ.. నన్ను ఇంటికి కావలి బెట్టి ఆళ్ళందరు దాని లగ్గంకు ఎగేసుకుంట బోయిండ్రు. అయ్యో అమ్మా..! నీకేడ చేతన యితది. వచ్చుడు పోవుడు మాటపక్కన బెడితే బాత్రూంకి వస్తే మస్తు తక్లీబ్ అయి తదమ్మా.. అనిచెప్పి వాళ్ళే బోయిండ్రు బద్రమ్మా...

"పోనీ ఊర్లకు ఊర్లు దిప్పకున్నా ఉప్పలమ్మకు బెట్టుకున్నప్పుడన్నా ఊర్లేనే ఉన్న పెద్ద ఆడిబిడ్డ ఇంటికి దీస్కపోయిండ్రనుకున్నవా..? అమ్మకు పండ్లు మంచిగా లేవు ఆడ ఏమి దింటదనుకుంటారు గని, తుర్తి దీరే తట్లు జర మాట ముచ్చట జెప్పుకుంట దని అనుకోరు. ఈ ముసల్దానికి ఈ తిరుగుడు ఇవ్వన్నీ అవుసరమా అనుకుంటరు దప్పితే అయ్యో ఈ ముసలవ్వ గూడ ఒక మనిషే.. ఇంకా దానికింక పానంబోలె బతికే ఉన్నది, ఆమెకిష్టమయినట్లు జేద్దాం అనుకుంటరా? పెయ్యి బాగొకుంటె మందు గోలీలు దెచ్చి ఏస్తారేమొ గాని పక్కన గూసోని చెయ్యి బట్టుకుని మంచి చెడు మాట్లాడేటోల్లుండరు..!

"అయ్యో జర బాతలేస్తనికన్నా మనుషులు గావలె గదా అంటే...కోడళ్ళ మీద ఏమి జెప్పుకోను మనుషులు గావలెనీకు అంటది నా చిన్న కోడలు. అయ్యో నీ తాన అంత మంచి ముచ్చటే ఉంటె ఒగల్లకు ఏమన్న జెప్పుకుంటనని భయ్యం దేనికి అంట నేను...సప్పుడు జెయ్యదు. అయ్యో మాట ముచ్చట అంటే ఒగల్ల మీద ఒగల్లు జెప్పుకు నేదే గాదు మంచీ చెడు ఎన్ని ఉంటయి. ఈ పిల్లంటే బయిటి సంబందం...కోరి కోరి తమ్ముని బిడ్డను కోడలిగ దెచ్చుకుంటే అత్తమ్మా అని పక్కన గూసోని ఎట్లున్నవని ఏనాడు అడగదు. ఇట్లున్నది అట్లున్నదని తన ముచ్చట గూడా చెప్పదు.

"...అసలు గింతమంది మనుసుల జూసి ఎన్ని దినాలయ్యిందో...? పొద్దుపొడిసింది గదా అని లేసి చేసేదేంలేదు. పొద్దు గుంకింది గదా అని జేసేదేంలేదు ? నులక మంచంల పన్న దాన్ని పన్నట్టే అనుకో. తిన్నా మా పన్నామా అన్నట్టే అయ్యింది బతుకు. అసుమంటిది వారం దినలనాడు ఇట్లా ఓట్ల ఎలచ్చన్లోచ్చినయి అని ఇంటి కాడికి పెద్ద నాయకులొచ్చిండ్రు. ఇగ జూడమ్మో మొత్తలో మంచం మీన పన్న నా కాడికొచ్చి నా గవదలు బట్టుకుని మంచిగున్నవామ్మా...అని అడుగు కుంట బుజాల సుట్టు చేతులేసి పొట్టువలు దిగిండ్రు...మాకే ఒటేయ్యవ్వా అని బతిలాడి సెప్పి పోయిండ్రు. మీకోసరం అది జేస్తున్నం ఇది జేస్తున్నం అని ఏమి జెప్పినా జెప్పిండ్రు పో.

"ఈ ఓట్ల ఎలచ్చన్లేమో గనీ ఎటు జూసినా మనుషులే గానొచ్చిండ్రు. కొలువుల కోసమో, సదువులకోసమో యాపారాలకో సమో యాడాడ ఉన్న కొడుకులు, బిడ్డలు అందరూ ఊర్లె బొడ్రాయి ఏసినప్పుడు వచ్చినట్లు వచ్చిండ్రు. ఊరంతా ఇయ్యర బయ్యర తిరుగుతున్నరు..

"ఇగ జూడు బద్రమ్మో...ఇవ్వాల్టి దినం ఈ జనానికి మూలనున్న ముసలోళ్ళంత ముద్దొస్తున్నరు. అమ్మా లేసినవా అని కొడుక దగవట్టే. అత్తమ్మా తానం జేస్తవా అని కోడలన వట్టే ఇగ సూడు బిడ్డో...అబ్బో సందూకూలున్న చీరే దీసే కట్టిండ్రా...సీసాలున్న కొబ్బరి నూనె వెట్టి నెత్తే దువ్విండ్రా...పాణం బాగోలే కొడకా జర డబల్ రొట్టె దేండ్రి అంటే తెచ్చేటోళ్ళు గాదుగానీ ఈడికొచ్చి యాడ బెజారాయి పడి పోతానో అని ఇడ్లీలు గూడ తెచ్చి తిను తిను మన్నరు బద్రమ్మా...ఎన్నడన్నా నీ కాడికన్నా దీస్కపోయిండ్రా...ఎవ్వలతోనన్నా ఒక మాట ముచ్చట బెట్టనిచ్చిండ్రా....

"ఇగో ఇప్పుడు మాత్రం నా ఓటు ఎవ్వల్లకు ఏపిస్తమని జెప్పిండ్రోగనీ.. ఆటోల ఈడి దాకా తీసుకచ్చి చక్రలాకుర్సీల కూసో బెట్టి ఆడ ఆపీసర్లకు.. ఇగ్గో ఈమె మా నాయి నమ్మ, మా నాయినమ్మా అని జెప్తాండు బిడ్డో...ఒటెయ్యంగనే ఏమ్మట్నే ఇంటికి తీస్క పోయేటోడే. మన్నడికి ఎదో పోన్ రాబట్టి నన్ను ఈడ కుర్సీలనే ఆపిండు. కాబట్టికీ ఈ యింత ముచ్చటన్న నీకు జెప్పుకుంటున్న. అవ తల ఎవరో సిలక తీరు అవ్వారూ యూ డాలింగూ అంటే ఈడు అవ్వారు యూ డాలింగూ అంటున్నాడు...ఇంకా అద్దగంట దాకా ఆ ముచ్చట ఒడవది గూడ.

"పూసిన తంగేడుపూలసెట్టు తీరుండే దానివి బద్రమ్మా. ఎంత బక్కగయినవో... అందరం గూడి సంబురంగా బతుకమ్మ లాడే టోళ్ళం... నాట్లప్పుడు, కోతలప్పుడు ఎన్ని పాటలు పాడుకుననేటోల్లం, సకినాలు అరిసెలు కరప్పూస కలిసి జేసుకునేటోళ్ళం... ఇప్పుడు ఏమి చేసేతట్టున్నది ఏమి తినేత ట్టుంది...? మనం జేసే వంటలు మోటాయే, అసలు మనమే మోటాయే. ఇన్ని దినాలకు కలుసుకున్నాం బద్రమ్మా నాకయితే పండగోలె ఉన్నది.

"అదిసరేగానీ పెద్ద కొడుకుకు మల్ల ఆడిపిల్ల బుట్టిందని రంధి వద్దవంట...అదృష్ట ముంటేనే ఆడిపిల్లలు బుద్దరు అది తెలుసుకో. ఆడిపిల్లలే మంచిగా సదువుకుంటున్నారు. మంచి కొలువుల్ల జేరుతున్నారు...నువ్వేం పరేషాన్ గాకు బద్రమ్మో..

"ఓట్ల ఎలచ్చన్లేమోగానీ అయినో ల్లంత గలుస్తున్నారు. గా గొల్లగూడెం రాజక్క కలిసింది. చిన్న రాజన్న ఇంటోల్లంత కలి సిండ్రు. పాముల చిట్టెమ్మొదిన సచ్చిపోయి నట్లు తెలవనే తెలవదునాకు.. యెట్లదెలుస్తది నాలుగేండ్లనాడే హైదరబాదకు బోయిండ్రు. ఆడికి పోయిన రెండేళ్లకే ఆమె గుండె జబ్బుతో సచ్చిపోయిందట. మనందరిని ఎంత ప్రేమగా జూసుకునేదో తల్లి...లేరులేరు అనుకున్నం దుకు ఆమె సిన్న కొడుకుకు అమదాలోల్లు బుట్టిండ్రంట. వాళ్ళ ముద్దూ ముచ్చట సూడ కుంటనేపోయింది వదినే..

" నేను గిట్ట రాకున్నా నువ్వన్నా ఎన్న దన్నా వచ్చి జరా పలకరించి పో బద్రమ్మా.. బతికినన్నాళ్ళు బతుకుతమా...అసలు ఎలుతురు జూసి ఎన్ని దినాలయేనో అన్నట్టున్నది

బద్రమ్మా...గిట్ల ఇప్పుడన్నా మాట్లాడకుందా ఉంటె ఆయింత ఉన్న మాట కూడా పోతదో ఏందో అనిపిస్తాంది? ఎవ్వళ్ళనేమంటం. నీ కొలువుమాని సదువులుమాని నాకాడా గూసోని ముచ్చట్లు జెప్పుమనలేను గదా...

"ఇగో నా బాగ్యమిట్లున్నది. ఆల్లు బెట్టింది దినాలా. సప్పుడు జెయ్యక పందలా.. ఒగనాడు యమ చిటా చిటా బుద్తాంది నెత్తికి బోసుకుంటనవ్వా అంటే.. ఏమొద్దు బయట సల్లగున్నది. దగ్గు పడిసెం బట్టుకుంటే ఎట్లా? అని వారం పది దినాలు తానం గూడ జేయిపియ్యలె. ఆ సల్లబువ్వ, సప్పటిపప్పు తినితిని నోరు సప్పగయింది. జర నిమ్మకాయ తొక్కు బెట్టుమంటే బెట్టరు.. రేనవండ్ల కాలమొచ్చే రెండు పండ్లు నోట్లేసుకుందమంటే బుద్ద పోరదు కూడా మాట ఇనదు. ఈల్లకోసం నేను యడాడో తిరిగి సీతబల్క పండ్లే తెచ్చేదన్నా, రేగులు, గుబ్బకాయలు, తాటి ముంజలు, పరికి పండ్లు, సపోటా పండ్లు తెచ్చేదన్నా, కందికాయలు, పెసరకాయలు, పల్లీలు మక్కకంకులు ఏ కాలంల ఏవి దొరికితే అవి తెచ్చి తినుండ్రి బిడ్డా అని ఎనకబడి ఎనకబడి పెట్టేదాన్ని...అన్ని మర్చిపోయిండ్రు బద్రమ్మా. అమ్మా తిన్నావా అని మందలిస్తే సాలనుకుంటునవ్వా. ఆళ్ళు మందలియ్యరు. మనుమలు మనవరాళ్ళు ముసల్దానా అంటే కోడళ్ళు ఇక ఇక పల్లికిలిస్తరు...తప్పు బిడ్డా అని జెప్పరు. రేపటి దినం ఈళ్ళు ముసలోళ్ళుగారా ఎట్లా?

"అందరిని జూసి ఎన్ని దినాలాయె.. గా అద్దంకొల్ల కోడలు దగ్గరకొచ్చి పలకరించినా గుర్తువట్టలే నేను. బండ కాడి పోశయ్య కొడుకు గుర్రంలెక్క ఎదిగిండు. వాడ్ని జూసి ఏమి నవ్వుకున్నాలే. సిన్నప్పుడు పల్లికాయల కోసం నా సుట్టు తిరిగి లొల్లి లొల్లి జేసేటోడు. గా నస్రీన్ అంగన్‌వాడి ఉద్యోగం బట్టిండట. దగ్గరకచ్చి మందలించింది బిడ్డ. ఎన్ని సెరలు వద్దదో. పాపం గయ్యాళి అత్తాయే. ఆరళ్ల అడపడుసులాయే. మగడేమో నోట్ల నాల్క లేక పాయే. మా అన్న కోడళ్ళ లెక్క టీబీలు సూసుకుంట కూసోలె బిడ్డ. ఆయింత సిన్న దుకునం బెట్టి ఇంటిని నిలవెట్టింది. బిడ్డ ఇప్పటికన్నా సుఖపడితే గంతేసాలు. పెళ్ళయి కాపురాని కొచ్చినప్పుడు తమలపాకు తీరుండే. తిండి తిప్పలు సక్కంగా లేక ఎండు నరం లెక్కయింది. నాకోసం కీర్ దెచ్చేది బిడ్డ. ఆమెకు నేను సకినాలు. గ్యారెలు వండేదాన్ని. పిల్ల బంగారమనుకో...

"నాకంటే ముందే నర్సన్న నిలుసున్నాడు. అన్నను సూడంగానే మంగవ్వ గుర్తుకచ్చి పాణం కలాకలా మన్నది.. ఈ డాక్టర్లు పాడుగానో...ఆ పెద్ద రోగమొచ్చింది అని జెప్తున్నారు. అదోస్తే ఎంత కాలం బతుకుతరో ఎప్పటికి సచ్చిపోతారో చెప్తున్నారుగనీ దానికి మందు మాత్రం తెలుసుకుంట ల్లేరు. ఆ రోగం నోటితోనే అనకూడదట భద్రమ్మ. దాన్ని కాన్సర్ అనొద్దు...రాకాసి జబ్బు అనాల. ఆ జబ్బు పాడువడ మంగవ్వను ఆర్నెల్లల్ల గద్ద నెత్తుక పోయినట్లు ఎత్తుకపోయింది.

"ఒక ఇసిత్రం జెపుదునా బద్రమ్మ... ఆమె సచ్చిపోయి మూడేళ్ళయినా ఆమె ఓటున్నది. ఈ ఊర్లేనే పుట్టిన ఆమె కొడుకుకు పెండ్లి జేసుకొని వచ్చి పదేళ్ళసంది ఈడనే ఉంటున్న ఆమె కోడలుకు వోట్లు లేవంట. ఇట్లున్నది ఈ ఓట్ల కథ.

"గదేదో కాయితం దీస్కపొయి ఇవ్వంగానే. "భారతమ్మా...భారతమ్మా అని పిలుస్తాంటే అగ్గోనే నేను బతికే ఉన్న అనిపించింది బద్రమ్మా...రా ఈడ ఏలి ముద్రెయ్యి అన్నరు. ఏలి ముద్ర దేనికి... నేను బరాబర్ సంతకమే బెడ్తా అన్నా...

"ఏంది సంతకం బెడ్తవా పెద్దవ్వా..? అని నగుతాండ్రు. అవ్ మల్లా అని జెప్పి సంతకమే బెట్టిన..

"మా నాయినమ్మ పెద్ద మనిషి. ఆమెకేం తెల్వదు ఆమెతోని నేను ఎల్పుకు బోత. ఓటేపిస్తా.. అన్నాడు మన్మడు.

"ఆడాగు కొడుకా...నిన్నగాక మొన్న బుట్టినవ్ ఇప్పటిదాకా ఏ రెండు మూడు ఓట్ల ఎలచ్చన్లు జూసినవో నువ్వు. ఇన్నేళ్ళల్ల ఎన్ని ఓట్లేసిన అనుకున్నవ్...ఎందరిని గెలిపించిన అనుకున్నవ్ పక్కకు జరుగు అన్నా..

"అయ్యో.. ఏ గుర్తు మీద గుద్దుతవో నాయినమ్మా అన్నడు..

"బయిట గోడమీద అతుక బెట్టిన్రు గదా...ఏ గుర్తు ఎవ్వల్లదో చూసిన. నువ్వేం ఫికర్ జెయ్యకు. నేను ఓటేసొస్త అన్న. జబర్దస్తుగా ఓటేసి వచ్చిన భద్రమ్మా...

"ఈ ఐదేండ్లు ఒగ అంగడికి వోకున్నా, గుడికి వోకున్నా, పెళ్లిళ్లకు పేరంటాల్లకు వోకున్నా, సావులకు, సంబరాలకు వోకున్నా ఈడ కొస్తం. యాడికన్నా మనం బోకున్నా నడుస్తది గానీ, ఈడకు మనమే రావాలే. మనమే ఓటెయ్యాలే. అందుకే కొడుకో కోడలో చెప్పినకాడ ఓటు గుద్దకుండా.. ఎవ్వల్లకెయ్యాలో ఆళ్లకే ఓటేసిన భద్రమ్మా.. మరి ఎవరనుకున్నవ్ నేను భారతమ్మను గాదు?!"




మహబూబ్ నగర్ తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో 21-02-2019న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా మాతృభాష పై కవులు "కవితాగానం" చేశారు. అనంతరం అతిథులు వి.మనోహర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, సూర్యనారాయణ మరియు తెలంగాణ సాహితి సభ్యులు వల్లభాపురం జనార్దన, నందిగామ కిశోర్, ఎండి.ఖాజామైనుద్దీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను బహుమతులు అందజేశారు.

పొరుగు తెలుగు

కన్నడతోటలో విరిసిన తెలుగుపాట

బుర్రకథ ఈరమ్మ-సంచారి ఆత్మకథ



కన్నడ మూలం
డా. నింగప్ప ముదేనూరు

అనువాదం
రంగనాథ రామచంద్రరావు

(ఫిబ్రవరి సంచిక తరువాయి...)

పాటతో ప్రయాణం

ఈరమ్మ కుటుంబంలో మూడవ కూతురు. ఈమె కన్నా పెద్దది సుంకమ్మ. ఈమె వెనుక నాగభూషణ, నాగభూషణకు వెనుక ఈరమ్మ, ఈరమ్మ వెనుక మారెక్క, మారెక్క వెనుక శివమ్మ, శివమ్మ వెనుక ఈశ్వరమ్మ, ఈశ్వరమ్మ వెనుక తిప్పేస్వామి. తిప్పేస్వామి తరువాత బాలస్వామి- ఇలా ఎనిమిది మంది పిల్లలు. తల్లితండ్రులతో కలిపి మొత్తం పదిమంది ఉన్న కుటుంబాన్ని ఈరమ్మ సాకాల్సి వచ్చింది. దీంతోపాటు ఆమె జీవితమూ ఎగుళ్ళుదిగుళ్ళతో సాగింది. తన వెనుకటి జీవితాన్ని గుర్తుచేసుకుంటూ ఈ బుర్రకథలకు ఆమె మనస్సు స్పందించిన విధానం ఆశ్చర్యం కలిగిస్తుంది.

కావ్యానికి వయసు లేదు. మనం చదవటం ఎలా నేర్చుకుంటామో, అదే విధంగా కావ్యాలను గానం చేయటం నేర్చుకోవాలి. పెద్దలు పాడుతున్నప్పుడు వారితోపాటు గొంతు కలిపి పాడటం. నెమ్మదిగా ఆ పాటను తమ సొంతం చేసుకోవటం.

ఈరమ్మ పాడటం నేర్చుకున్నది ఇలాగే. తల్లితండ్రులే ఆమె మొదటి గురువులు.

ప్రజలు మెచ్చుకున్న కథల్నేఈరమ్మ పాడటానికి సిద్ధమయ్యేది. ఆమె ఆ కథల్లో లీనమయ్యే విధానం వివరించలేనిది. గానంలోని తాళధ్వనుల హెచ్చుతగ్గులకు ఆరోహణ, అవరోహణల సన్నివేశాలకు తగినట్టు ఆమె గానముండేది. ఈరమ్మ కథలు వింటున్నవారు కథలోని అంశాలతో ప్రతిస్పందించే తీరు ఆమెను మరింతగా ఉత్తేజపరిచేది. ఈ విధంగా ఈరమ్మ వాళ్ళ కష్టసుఖాలను గ్రహించిన విధానం, దానికి కథలద్వారా పరిష్కారాల సూచిస్తున్నట్టున్న మహాకావ్యాల గానంశ్రోతలను మైమరిపించేది.

తల్లితండ్రులు తెలుగులో చెబుతున్న బుర్రకథలను రాత్రంతా నిద్రపోకుండా శ్రద్ధగా విని నేర్చుకున్న ఈరమ్మ తానే ఆ కథలను కన్నడలోకి అనువదించుకుని, లయ చెడకుండా అదే చైతన్యంతో అద్భుతంగా పాడేది. ఆ విధంగా 8-10 కావ్యాలను రెండు భాషల్లోనూ గానం చేసే సామర్థ్యాన్ని పెంచుకుంది. దీంతో భాషను నేర్చుకోవడానికి 'ఏ శాస్త్రీయ పాండిత్యం అవసరం లేదు' అని ఈరమ్మ చెప్పినట్టయ్యింది.

సంచార జీవులకు ఒక చోటు అన్నది ఎక్కడుంది? ఈరమ్మ అన్ని ఊళ్ళ నీళ్ళు తాగి పెరిగింది. ఆమె వందలాది ఊళ్ళ కష్టసుఖాలను కొంతైనా తెలుసుకున్న మనిషి. ప్రజల కష్టాలకు ఈరమ్మ కథలే ఓదార్పు కలిగించేవి. పరిష్కారాలు చూపేవి. ఆ కారణంగా జనం, పరిసరాలు ఈరమ్మను నేటికీ కాపాడుకుంటూ వచ్చాయి. ఊళ్ళో స్థిర నివాసం ఏర్పరుచుకుని జీవించటానికి వీరికి వృత్తి అడ్డు అనిపించినట్టు ఊరిబయట ఏదో ఒక గుడిలోనో, మసీదులోనో, బయలుప్రదేశంలోనో లేదా పాఠశాల ఆవరణలోనో మకాం పెట్టి అక్కడే సాధన చేసుకుంది. సంచార జీవులు ఇప్పటికీ చాలా స్వచ్ఛమైన, స్వతంత్ర్యమైన, నిర్జన ప్రదేశంలో బతకటానికే ఇష్టపడుతారు.

ఈరమ్మ అనేక గొప్ప కథలను నెలల పొడుగునా ఊళ్ళల్లో గానం చేస్తుంది. పాటే ఆమె జీవితం అయిపోయింది. పాట ఆపితే జీవితం ముగిసిపోతుంది. ఆరంభంలో కావ్యంలోని ప్రతీ వాక్యాన్ని నేర్చుకునేటప్పుడు లేత నాలుక తడబడేది. అయినా ఆమె పట్టుదల కుండా తన బాల్యం, యవ్వనపు క్షణాలను, గంటలను, రోజులను నేర్చుకోవటానికే ధారపోసింది.

"నేను తాతను చూడలేదు. తాత భార్యనూ చూడలేదు. అయినా అతని పేరు రాగయ్య అని తెలుసు. అతని కొడుకే మా నాయన లాలప్ప. మొదట్లో ఇలా అనేక ఊళ్లల్లో నా తల్లితండ్రులతో తిరిగాను. అందువల్ల ఊరు, ఊరి ప్రజల పట్ల నాకు భయం అనిపించ లేదు. గౌరవం కలిగింది. నా తల్లితండ్రులను ముసలివాళ్లయ్యేవరకూ జనం ఎలా చూసుకున్నారో, ఇప్పటికీ మమ్మల్ని అదే గౌరవంతో చూసుకుంటున్నారు. ఈ ఊరి ప్రజల విశ్వాసం గొప్పది. నాతోపాటు ఇప్పుడు నా చెల్లెలు పార్వతమ్మ, వదిన శివమ్మ బుర్రకథలో పాల్గొంటారు" అని ఈరమ్మ చెబుతుంటుంది.



కన్నడ రచయిత
డా. నింగప్ప ముదేనూరు



అనువాదకుడు
రంగనాథ రామచంద్రరావు

"ఈ కావ్యాలను గానం చేసే అవసరం ఎందుకు వచ్చిందంటే పెద్దలు నేర్పినదాన్ని నేను ముందుకు తీసుకుని పోవాలి కదా? ఇంటి మగపిల్లలు ఎవ్వరూ నేర్చుకోలేదు. ఆ బాధ మా నాయనకు ఉండేది. ఈ సరస్వతి ఇలా ఊరకే మూలన పడివుండకూడదని నేనే శ్రద్ధగా నేర్చుకున్నాను. తల్లీ నువ్వే నన్ను కాపాడు అని ఆ తంబూర పట్టుకు న్నాను. దాన్ని పట్టుకుంటే నాకు చెప్పలేని సంతోషం కలుగుతుంది. నాకు తెయకుండానే ఆ తంబూర నాదంలో లీనమైపోతాను" అని ఈరమ్మ అంటుంది.

ఈ ప్రయాణంలో ఈరమ్మకు ఎలాంటి అడ్డూ ఆటంకాలు ఎదురుకాలేదు. ఇంటివాళ్ళ సహకారం ఉండేది.

ఈరమ్మ పగటిపూట 20-30 రూపాయలు వచ్చే కూలీ పనులు వెళ్లేది. రాత్రి కథ చెప్పి అలసిపోయినా, పగలు ఆమె ఊరకే కూర్చునే మనిషి కాదు. ఇతరుల పొలాలలో కలుపు తీయడం, పత్తి గింజలు విడిపించటం, కంకులు కోయటం, నాట్లు వేయడం, ఇలాంటి పనులు చేసేది. ఇక ఇంట్లో వంట, కసువు, ముసురు పనులు చేసేది. ఈ పనులన్నీ చేసుకుని, 'ఒప్పందం' చేసుకున్న ఊరికి కథ చెప్పటానికి వెళ్ళేది.

ఊర్లో పెద్దపెద్ద బుర్రకథలే కాకుండా వానరాయుడికి సంబంధించిన కథలనూ కూడా ఆమె చెప్పేది. పొలాలలోనూ ఈ కథలు చెప్పవచ్చు. ఈరమ్మ ప్రకారం ఇలాంటి కథలన్నీ వెనుకటి కాలంలో పుట్టినవే. రాత్రి ఎంతనిద్ర చెడినా, పాటకు ఎలాంటి ఇబ్బంది పడేది కాదు. ప్రజల ఉత్సాహం చూస్తూ రాత్రి ఎలాగో గడిపేసేది. ఒకటి రెండు 'సంధు'లు (కథల్లోని ముఖ్య ఘట్టం ముగుస్తున్నప్పుడు ఇచ్చే విరామం) ముగుస్తున్నప్పుడు తొలికోడి కూసేది.

అప్పుడు ఈరమ్మ తెల్లవారిందని గుర్తించి, తాను చెబుతున్న కథ ఈ 'సంధు'కు వచ్చిందని ప్రజలకు తెలియజేసి, పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి, కథను మరుసటి రోజు రాత్రికి వాయిదా వేసేది.

పగటిపూట గ్రామస్థులు తమ తమ ఇల్లు, పొలం పనులను చేసుకునేవారు. ఈరమ్మ తానూ గుడారంలో ఉండటమో లేదా పొలం పనులకు వెళ్ళటమో చేసేది.

ఈరమ్మ గుంపు వేరే ఊర్లకు పాడటానికి వెళ్ళినపుడు, ఓ మైదానాన్ని ఎన్నుకుని లేదా బయలు ప్రదేశం కనిపించగానే 'టెంట్' (బొంత గుడిసె, ఇప్పుడంతా ప్లాస్టిక్ గుడిసెలు) వేసుకునేవారు. ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు వుంటే ఒక టెంట్‌లో నివాసం ఉంటారు. పగలు ఈరమ్మ వైపు వాళ్ళు పగటివేషాలు వేస్తే, రాత్రి వీళ్ళు కథలు చెప్పేవాళ్లు. గుడారం చేరుకున్నాక, అందరూ కలసికట్టుగా కూర్చుని భోజనాలు చేసి, ముచ్చట్లు చెప్పుకుని, ప్రకృతి ఒడిలో భయం లేకుండా హాయిగా నిద్రపోయేవారు.

కొన్నిసార్లు ఒక ఊరిలోని ఒక వీధిలో ఈరమ్మ పాడటానికి ఒప్పుకుంటే అదే ఊరిలో మరో వీధివారు రేపు తమ వీధిలో కథ చెప్పాలని 'ఒప్పందం' చేసుకునేవాళ్ళు. ఈరమ్మ ఇక్కడి కథను ముగించుకుని, ఒప్పందం చేసుకున్న మరో వీధికి వెళ్ళాల్సి వచ్చేది. పోకపోతే తాను గ్రామస్థుల దగ్గర నమ్మకాన్ని ఎక్కడ పోగొట్టుకుంటుందోననే భయం ఈరమ్మకు ఉండేది.

సాధారణంగా వీళ్ళు గుడారం వేసుకున్నారని తెలుసుకున్న గ్రామస్థులు రాత్రి పూట లైటు బ్యాటరీలు, లేదా లాంతరులు పట్టుకుని వచ్చి వీళ్లను కథలు చెప్పించుకోవడానికి పిల్చుకునిపోయేవారు.

వీళ్ల కథలు చెప్పడానికి మునుపు తాత్కాలికంగా నివాసమున్న గుడారాల్లో ఎలాంటి పూజలు చేయరు. అయితే కథ చెప్పే ఊరిలోని వేదిక మీద లేదా స్థలం లోనే పూజ చేసి కథను ప్రారంభించేవారు. అది మంగళవారం, శుక్రవారమైతే ఇంటి దేవుడిని చేసేవారైతే స్నానం, పూజ ముగించుకుని కథ చెప్పాల్సి వచ్చేది.

ఊరి ప్రజలు ఈరమ్మ పాడటానికి వస్తే ఎంతో ప్రేమతో కాఫి, లేదా టీ చేసి ఇచ్చేవారు. . రొట్టెలు, గుగ్గిళ్లు, పాలపరమాన్నం, చేసి ఆమెను ఇంటికి ఆహ్వానించేవాళ్ళు.

ఈరమ్మ పగటిపూట కాస్త ఎక్కువగానే కడుపునిండా భోజనం చేస్తుంది. రాత్రిళ్ళు ఆమె భోజనం చేయడం తక్కువే. కడుపు నిండా తింటే ఎక్కడ నిద్ర ముంచుకొచ్చి, కథాగమనానికి ఇబ్బంది కలుగుతుందోనని ఆమెకు భయం. అందువల్ల తక్కువగా తిని, కథ చెప్పడానికి సిద్ధమయ్యేది. అర్ధరాత్రి పూట మెలుకువగా ఉండటానికి శ్రోతలు తెచ్చి ఇచ్చే కాఫి, టీ, పాలు -ఇలా ఏదో ఒకటి తాగి మళ్ళీ పాట అందుకునేది. ఈరమ్మకు ఆకువక్క వేసుకోవడం ఎంత ఇష్టమో,పొగాకు నమలడం కూడా అంతే ఇష్టం. అయితే ఆ విషయాన్ని ఆమె బయటికి తెలియనివ్వకుండా గుట్టుగా పెట్టేది.

రాత్రి ఆ ఊళ్లో 'బుర్రకథ' ఉంటే గ్రామస్థులకు తెలియజేయటానికి 'దబరి' కొట్టించి ఊళ్లో ఆ విషయాన్ని చాటింపు వేయడం జరిగేది. ఈరమ్మ పాడటానికి వచ్చిన వెంటనే జనం చాపలు, జంబుఖానాలు, బొంతలు తెచ్చుకోవటంతోపాటు, అగరొత్తులు, పూలుపళ్లు, కొబ్బరికాయలు -ఇలా ఎవరికి తోచింది

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

వాళ్లు తెచ్చేవాళ్లు. బియ్యం, బ్యాళ్లు, పెసలు, కొర్రలవంటి ధాన్యపు గింజలు కూడా తెచ్చేవాళ్లు.

ఇక కథ మొదలవుతుందన్నప్పుడు నిండు చేటమీద కొబ్బరికాయ పెట్టి, గింజలతో ఉన్న తట్ట మీద దాన్ని నిధిలా పెడతారు. కొబ్బరికాయకు పసుపు, కుంకుమ పూసి, దాన్ని పూలతో అలంకరిస్తారు. ఇది ఆ కథకు నేపథ్యంగా రూపుదిద్దుకున్న దేవుడు. అంటే ఆ రోజు ఈరమ్మ ఏ వీరుడి కథ చెప్తుందో ఇది ఆవ్యక్తికి సంబంధించిందో లేదా కథకు సంబంధించినదో అయివుంటుంది. నిజానికి చెబుతున్న కథకు ఎలాంటి ఆటంకం కలగకుండా జానపదులే కనుక్కున్న ఒక ఆచరణ అని అర్థమవుతుంది.

ఆ ఆచరణకు తగిన విధంగా ఈరమ్మ, ఆమె సహచర కళకారులు ఆ దేవుడి లేదా దేవత పేరు చెప్పిన తరువాతే కథ మొదలవుతుంది. కథ ప్రారంభంలో కులదైవాలను,చుట్టుపక్కల గ్రామాల దేవతలను, నేలతల్లిని, ప్రార్థనరూపంలో స్మరించిన తరువాత ఆనాటి కథ మొదలవుతుంది. ఇది మన జానపద మహాకావ్యాల మూల ఆశయం అనేది మరవకూడదు.

ఇలా కథ ప్రారంభించిన తరువాత ఆ కథలో ఒక 'సంధు' వచ్చినప్పుడల్లా ఒక కాయ పగులగొడుతుంటారు. దేవుడు మళ్ళీ ఇక్కడ జన్మదాల్చాడు, యుద్ధం జరిగి వీరుడు మరొక వీరుడిని లేదా రాక్షస రూపపు మనిషిని ఆ సమయంలో చంపుతాడు లేదా ఓడిస్తాడనగానే అప్పుడు మళ్ళీ కాయ కొడతారు. కాయ పగులగొట్టడం అంటే ఓడిపోయాడు, లేదా మరణించాడు లేదా ఆ కథ 'సంధు' లేదా ఒక ప్రకరణం ఇక్కడితో ముగిసిందనటానికి సూచన.

మరొక కొత్త కొబ్బరికాయను పెట్టి కథలోని మరొక భాగాన్ని మొదలుపెడతారు. అయితే ఇలాంటి సందర్భం వచ్చినపుడు కూడా మళ్ళీ కాయ కొట్టి, కొత్త కాయ తెచ్చి ప్రారంభిస్తారు. కొన్నిసార్లు కథలోని ఒక భాగం ముగియటానికే ఒక రోజు సమయం పడుతుంది. ఇలా ఒక కథ పూర్తిగా చెప్పటానికి నాలుగైదు 'సంధులు', అంటే మూడు నాలుగు రోజులు అవసరమవుతాయి. మరీ తక్కువ కాలం అనుకున్నా రెండు రోజులైనా అవసరమవుతాయి..

'నేను సుమారు 45 ఏళ్ళనుంచీ ఈ కథను చెబుతూ వస్తున్నాను కదా, ఎప్పుడూ ఎక్కడా విసుగు అన్నదే కలగలేదు. ప్రజలేమో మా రంగులు, వేషాలు చూసి వేషగాళ్లు, కథలు చెప్పేవాళ్లు అని పిలుస్తారు. కొందరు నవ్వేవాళ్లు నవ్వుతారు. గంతులేసేవాళ్లు గంతులు వేస్తారు. వాళ్ళకూ మా పరంపర అర్థమవుతుంది. ఈ జనసముదాయమే ఇలా ఉంటుందని మాట్లాడుకుంటారు. మాట్లాడుకోనీ, మా తాతలూ ఇలాగే ఉండేవారని అంటే ఊరకయ్యేవారు. అయితే ఒక్కొక్కసారి ఏదైనా కారణం వల్ల కథ చెప్పడానికి మాకు చేతకాదంటే,'వారికి చేతకాదంటప్పా, మనమేమో కాయ తెచ్చినాం, చక్కర తెచ్చినాం, పాలు తెచ్చినాం, ఆ తల్లి రాకపోతే ఎట్లా? పదండి పిలవడానికి పోదాం' అని ఇంటి దగ్గరికి వస్తారు. వచ్చి 'అమ్మా... నువ్వు లేదనవద్దు. నీకు చేతులెత్తి మొక్కుతాం. అందరూ వచ్చి కథ వినడానికి కూర్చుని వున్నారు. నువ్వు కథ చెప్పడం ఆపవద్దమ్మా" అని బతిమిలాడుతారు. అంతేకాదు. జనం అడవుల్లాంటి ఊళ్ల నుంచి అక్కడికి వచ్చివుంటారు. వీళ్లు నీ కథ విని మంచిగా బతకాలి' అని బతిమిలాడుతారు. నా కథ వాళ్ళకు జీవితాన్ని ఇస్తుందనీ, వాళ్ల జీవితాలు బాగుపడటానికి ఉపయోగపడుతుందని తెలిసి నేను కథలు చెప్పటం ఎలా మానివేయగలను?" అని ఈరమ్మ అడుగుతుంది.

కొన్నిసార్లు పాడి పాడి గొంతు నొప్పెట్టేది. వాయించి వాయించి వేళ్ళు నొప్పెడుతాయని చెప్పినా ఆ జనం 'అమ్మా,కథ గట్టిగా చెప్పవద్దమ్మా, మెల్లగానే చెప్పు. మేము నిశ్శబ్దంగా వింటాం' అంటారు. అయినా దూరంలో కూర్చుని వినే జనానికి వినిపించాలని, తను చెప్పే కథ అర్థమవ్వాలని, బిగ్గరగానే కథ చెప్పేది. బిగ్గరగానే పాటలూ పాడేది. పైగా ఆ కాలంలో ఇప్పుడున్నట్టు మైకులు లేవు. జనానికి నచ్చేలా, తెలిసేలా, అర్థం అయ్యేలా, వినిపించేలా కథ చెప్పటమే ఈరమ్మ నిత్య కాయకమైంది.

ఈ జనం ఈరమ్మ పాటను అత్యంత ఇష్టంతో వినటానికి ఒక కారణం ఉంది. జనం ఎక్కువగా దేవుళ్ల కథలే ఇష్టపడుతారు. కారణం దేశంలో గతంలో జరిగిన కథలనీ, అప్పట్లో పాలించి, జీవించి, దేవుళ్లుగా మారి మనకు ఈ సంపదను వదిలి వెళ్ళారని వీళ్లు నమ్ముతారు. వాళ్లు లోకాన్ని చూసినవారని, ఇక్కడ పాపం – పుణ్యం, మంచి – చెడులు, వాటన్నిటిని తూకం వేసి చూసినవారనీ, అప్పటికాలం వారంటే గొప్పజ్ఞానులని జనం భావిస్తారు. వాళ్ళను తాము కళ్లారా చూడకపోయినా ఇప్పుడు ఈరమ్మ ద్వారా వారి గురించి చెవులారా వినే పుణ్యం దక్కిందని భావిస్తారు.

ఈ ఆశయం కారణంగానే ఈరమ్మ చెప్పే కథలకు అంత విలువ. పైగా ఆమెకూ ఒక దైవశక్తి ఉందని జనం భావించేవారు. ఈరమ్మ తమ ఊళ్ళో కాలు పెడితే వర్షం, పంటలు, ఆరోగ్యం, పశువులు సౌకర్యంగా ఉంటాయని జనం నమ్ముతారు.

ఈరమ్మకు–ప్రజలకు మధ్య ఈ కథలు తప్ప ఇంకేమున్నాయి? ఆమె ఎన్నడూ 'ఇంత' డబ్బు ఇవ్వాలని కానీ, ఇన్ని పశువులు ఇవ్వాలని కానీ, ఇంత దక్షిణను ఇవ్వాలని కానీ అడిగిన మనిషి కాదు. జనం ఇచ్చేది తన సరస్వతికే తప్ప, తనకు కాదని గాఢంగా నమ్మిన వ్యక్తి. కాయకొట్టేటప్పుడు రెండణాలు, పావల, రూపాయి, రెండు రూపాయలు, మూడు రూపాయలు ఇలా హారతి పళ్లెంలో కొందరు వేసేవాళ్ళు. ఇంకా కథ ముగియలేదు. రేపు వేస్తామని అడగకపోయినా కొందరు అనేవారు.

ఈరమ్మ గానం చేసే పది కావ్యాలలో జనం ఎక్కువగా ఇష్టపడే కావ్యం 'బాలనాగమ్మ', 'స్యాసి చిన్నమ్మ', 'కష్ణగొల్ల–కావ్యాలు. ఇవి ఎక్కువగా ఆడవాళ్ళకు నచ్చేటటువంటివి. ఇక మగవాళ్ళకు కుమార రామ, బొబ్బిలి నాగిరెడ్డి, దేసింగురాజు, మారవాడి సేఠ్, బలిచక్రవర్తి కథలు ఇష్టమయ్యేవి. మరికొందరు ఎల్లమ్మ, ఆదోని లక్ష్మమ్మ కథలు ఇష్టపడేవారు. అయితే ఈరమ్మ దృష్టిలో బాలనాగమ్మ కథను ఇష్టపడేవాళ్ళే ఎక్కువ. ఆ కథ ఒక స్త్రీ కష్టసుఖాలను కళ్ళకు కట్టేలా చెప్పటమే కాకుండా మన స్త్రీల జీవిత చిత్రణ అక్కడ జరుగుతుందేమో అన్నట్టు జనం దుఃఖించేవారు. స్వయంగా ఈరమ్మ

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

ఈ దుఃఖపు సన్నివేశాలను భరించలేకపోయేది. ఆ కథను చెబుతున్నంత సేపు దుఃఖాన్ని దిగమింగుకుని అత్యంత భావుకతతో కథ చెప్పేది. తనకు కలుగుతున్న అనుభవాలను ఆమె చెబుతూ–

"ఇలాంటి కథలను చెబుతున్నప్పుడు కూర్చున్న జనం కూర్చున్నట్టే కంటతడి పెట్టేవారు. పాపం పిల్లల కళ్లల్లోనూ నీళ్ళు వస్తాయి. నాకూ ఇలాంటి కథలు చెప్పాలంటే, ఇలాంటి పాటలు పాడాలంటే చాలా బాధ కలుగుతుంది. దుఃఖం పొంగుకు వస్తుంది. అయినా కథ ఆపటానికి లేదు. అలా దుఃఖిస్తూనే కథ చెబుతుంటాను. కళ్ళనుంచి నీళ్ళు కారుతూనే ఉంటాయి. నోటి నుంచి కథ కొనసాగుతూనే ఉంటుంది." అని ఈరమ్మ అంటుంది.

అవును, ఈరమ్మ ఇలా చెప్పటంలో జీవిత సత్యముంది. ప్రజలు ఈ సత్యాలను తమ జీవితంలోనే చూసివుంటారు. అనుభవించివుంటారు. పదేపదే ఈ సత్యాలను విని మనస్సుకు ఒకింత నెమ్మదిని, ఓదార్పును తెచ్చుకుంటారు. 'అంతటి వారికే ఇలా జరిగినప్పుడు మనలాంటి సామాన్యులకు ఇది తప్పుతుందా?' అని నిట్టూర్పులు విడుస్తారు.

ఎంత దుఃఖం కలిగినా దాన్ని దిగమింగుకుని ఈరమ్మ చెప్పే కథను పూర్తిగా వినాలి. ఈరమ్మ జీవితంలోనూ దుఃఖముంది. కథలు చెప్పటం మూలకంగా ఆమె ప్రజలతోపాటు తన మనసులోని భారాన్ని దించు కుని మనస్సుకు నెమ్మదిని తెచ్చుకుంటుంది. తన గుండెలోని బరువును తేలిక పరుచుకుంటుంది. 'ఇలాంటి జానపద సందర్భాలను తలుచు కుంటే జీవితంలో ఎన్నో బాధలు అనుభవించిన శ్రామిక స్త్రీలు ఇలాంటి కావ్యాలను రచించివుండొచ్చా? జానపదుల శ్రమ ఇందులో ఉండొ చ్చా?' అని అనిపిస్తుంది.

ఈరమ్మ సొంతంగా పాడటం నేర్చుకుంటున్న సమయంలో ఆమె తండ్రి తోడుగా ఉండేవాడు. ఇప్పుడు అతనూ చనిపోయి చాలా కాలమైంది. ఈరమ్మ తల్లి సుంకులమ్మ. సుంకమ్మ ఈరమ్మలా కష్టాలు అనుభవించలేదు. సంసారంలో సుంకమ్మ ఆమె భర్త లాలప్పలు చాలా అన్యోన్యంగా ఉండేవారు. ఊళ్ళు పట్టుకుని తిరిగినా, కథలు చెప్పడానికి పోయినా పొందికగా ఉండేవారు. సుంకమ్మ కూడా భర్తతో పాటు ఊరూరు తిరుగుతూ భర్తకు తోడుగా గొంతు కలిపి పాడేది. ఇప్పుడు ఆమె కూడా లేదు. కూతురి కష్టసుఖాలు కళ్లారా చూసిన తల్లి సుంకులమ్మ తలచుకుని దుఃఖించేది.

ఈరమ్మ తండ్రి బతికి ఉన్నప్పుడు మూడు ఇండ్లు కట్టించాడు. ముగ్గురు పిల్లలకు పంచాడు. ఇండ్లు కట్టడానికి లాలప్ప ఎప్పుడూ అప్పు చేయలేదు. ముసలితనం వచ్చేవరకూ కథలు చెప్పి బాగా సంపాదించాడు. ఇంట్లో జరిగిన ఏ పెళ్లికి అప్పు చేయలేదు. పైగా ఎవరైనా తమ ఇంట్లో శుభ కార్యముందని అప్పు అడగటానికి వస్తే లేదనకుండా ఎంతో కొంత అప్పు ఇచ్చేవాడు. వాళ్లు ఇచ్చినప్పుడే తీసుకునేవాడు. ఇప్పుడు కాలం మారిపోయింది. అలాంటి నమ్మకాలు, విశ్వాసాలు లేవు. ఇప్పుడంతా 'వ్యవహారాలే' ముఖ్యమవుతున్నాయి. డబ్బు సంపాదన పెరుగుతున్నట్టల్లా నమ్మకాలు, విశ్వాసాలు తగ్గుతూ పోయాయి.

ఈరమ్మ అప్పటి కాలాన్ని గుర్తుచేసుకుని, "ఆ కాలంలో రూపాయికి నాలుగు సేర్లు జొన్నలు వచ్చేవి. బొట్లు, చిల్లు నాణ్యాలు, రాగి పైసలు, పావలా అర్ధణా, తెల్లటి అర్ధణాలు, కిరీటం రాణి బొమ్మ నాణ్యం, జనం యుద్ధాలకు పోయేవాళ్లు. ఎర్రటోపీల ఉండేవి. అప్పుడు కూడా కథలు చెప్పించుకునేవాళ్లు. అప్పుడునేను బొబ్బిలి నాగిరెడ్డి కథ చెప్పాను" అని ఆ కాలాన్ని ఈరమ్మ గుర్తు చేసుకుని కళ్లల్లో నీళ్లు నింపుకునేది.

అయితే ఈరమ్మకు స్వాతంత్ర్యం కాలంనాటి జ్ఞాపకాలు అంతగా లేవు.

హాళెదరోజి– సుందూరుకు దగ్గరో ఉండటం వల్ల సందూరు మహారాజుల గురించి, వారి సంస్థానం పాలన గురించి అడిగితే –"వాళ్ళంతా రాజ్యాల్ని పాలించిన వాళ్లు. అప్పట్లో కుమారస్వామి చిన్నరాతి విగ్రహరూపం ఉండేది. చుట్టూ అరుగు ఉండేది. అప్పుడప్పుడే మేము ఇక్కడికి వచ్చి మకాం పెట్టాం. సందూరు నగరానికి ఏడు ద్వారాలు. ఢిల్లీ బాదుషా సుందూరులోనే పెళ్ళి చేసుకున్నాడు. రాణి పుట్టిల్లు ఇదే. అయితే అతను ఢిల్లీలో ఉండేవాడు. ఈ రాజ్యమంతా ముసల్మానులది. ఈ దేశమంతావారిదే. ఆనెగొంది రాజ కుమారుడిలాంటివారు మంత్రులుగా ఉన్నారు. ఢిల్లీ రాజు మూడు పెండ్లిండ్లు చేసుకున్నా పిల్లలులేరు. చివరికి ఒక ఆడపిల్ల పుట్టింది" – అని చెబుతున్న ఆమెను ఒక క్షణం ఆపి, "ఇది కథనా లేదా నిజమా?" అని అడగితే, అప్పుడామె, "వాళ్ళు పాలించి, జీవించిన కథనే చెబుతున్నాను" అని అంటుంది. ఈరమ్మ చెప్పే ఈ కథ ఇక్కడితో ముగియదు.

కళ్ళముందు జరుగుతున్న సంఘటన అన్నట్టు దాన్ని కథలుగా అల్లి వర్ణించటంలోనే ఈరమ్మ సృజనాత్మక శక్తి సామర్థ్యాలు తెలుస్తాయి. అయితే ఇందులో సత్యాసత్యాలు ఎంతో చెప్పలేం.

"అప్పట్లో ఇప్పుడున్నట్టు బస్సు, లారీలు, బండ్లు లేవు. కాలినడకనే వెళ్లాల్సి వచ్చేది. నేను కుమారస్వామి కొండెక్కినా ఆయనను చూడలేకపోయాను. అతడి తల్లితండ్రులను చూశాను. మేము అసలే సంచార జీవులం. నడక మాకు అలవాటే. మేము, 'స్వామి, మేము కాలినడకన వస్తాం. మా కష్టాలు తొలగించు' అని వేడుకున్నాం. మూడు రోజుల జాతర ఇంకా రాకముందే మేము కాలినడకన బయలుదేరేవాళ్లం. ఇక్కడినుంచి సుందూరుకు వెళ్ళి అక్కడ రాత్రి బసచేసి, మరుసటి రోజు కుమారస్వామి గుడిని చేరేవాళ్ళం. ఇదే విధంగా 'నాయకనహట్టి'కి కూడా నడుచుకుంటూనే వెళ్లేవాళ్లం. నాకు తోడుగా కడుపుతో ఉన్న మా అన్న భార్య కూడా మొక్కుకుని నడిచి వచ్చేది. మేము నడుచుకుంటూ వెళుతంటే మా వెంట భజన చేసే గుంపు కూడా నడుచుకుంటూ బయలుదేరేది. అప్పట్లో కంప్లి, బళ్లారిలోనే పెద్ద సంత జరిగేది. అక్కడికీ వెళ్లేవాళ్లం. పదిరూపాయలు ఉంటే సంత చేసేవాళ్లం. గింజలు, ధాన్యాం అక్కడ కొనేవాళ్లం కాదు. సామాన్యంగా కల్లంచేసే రోజుల్లో అక్కడికే వెళ్లి రైతుల దగ్గర గింజలు

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

ఇప్పించుకుని వచ్చేవాళ్లం. అయితే ఉల్లిపాయలు, కారంపొడి, చింత పండు ఇలాంటి వాటినే సంతలో కొనేవాళ్లం. మిగిలినవన్నీ గ్రామస్థులే ఇచ్చేవారు" అని ఈరమ్మ ఆ కాలపు బతుకు చిత్రాన్ని కనుల ముందు నిలిపేది.

ఈరమ్మ ఇంటి దేవతలు జంబలమ్మ, సుంకులమ్మ, మారె మ్మలు. శుక్ర,మంగళవారాల్లో ఈ దేవతలకు ప్రత్యేకమైన పూజలు చేసేవారు. ఈరమ్మ అన్నదమ్ములంతా సంవత్సరానికి ఒకసారి లేదా రెండు సంవత్సరాలకు ఒకసారి ఒంటిపూట ఉపవాసం ఉండేవారు. ఒకవేళ వీళ్ళంతా కలిసి ఉండకపోయినా, వేరువేరు ఊళ్లల్లో ఉన్నా కూడా ఈ పద్ధతిని పాటించేవాళ్లు.

ఈ సందర్భంలో నాలుగైదు కేజీల అలసందులు తెచ్చి ఉడికించి పెట్టేవారు. సజ్జలు విసిరి, కుడుములు చేసేవాళ్లు. తరువాత బెల్లం పానకం చేస్తారు. గుగ్గులుకూడా చేస్తారు. వీటన్నిటితోపాటు రెండు సీసాల సారాయి తెచ్చి దేవతలకు నైవేద్యం పెట్టేవాళ్లు. దేవుళ్లకు సమర్పించటానికి పూలు కాయ, అగరొత్తులు, కుంకుమలను, దేవుడి కోసమే ప్రత్యేకంగా తీసిపెట్టిన డబ్బునే వాడేవారు. ఇలా పూజచేసిన తరువాత కుడుములు, గుగ్గులు, పానకం, సారా నైవేద్యం పెట్టి, 'అమ్మా మేము ఉపవాసం వదులుతున్నాం' అని చెప్పి ఉపవాసం వదిలేవారు. ఆ సమయంలో వచ్చిన వారందరికి భోజనాలు పెడు తారు. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో ఈ పద్ధతిని తప్పని సరిగా పాటిస్తూనే ఉంటారు.

ఈ సంచార జీవుల్లో కొందరు వేటలకు పోతారు. అయితే ఈరమ్మ ఇంటి వాళ్లు ఇప్పటివరకూ వేటలకు పోలేదు. వీరి ఇంటి దేవతైన నాగలాపుర సుంకులమ్మ ఇప్పుడు ఆంధ్రలో ఉంది. ఎనకాపుర జంబలమ్మ కర్నూలు దగ్గరలో ఉంది. ఇంకా గౌరసంద్రం మారెమ్మ కూడా అక్కడే ఉంది. మొదట్లో ఈరమ్మ ఇంటివాళ్లు, తాత ఇంటివాళ్లు ఈఇంటి దేవతలను కొలిచేవాళ్లు. తాతతోపాటు ఈరమ్మ కూడా అప్పట్లో దర్శనంచేసుకుని వచ్చేది. తాత చనిపోయిన తరువాత మళ్లీ అటువైపు వెళ్లడానికి ఈమెకు సాధ్యపడలేదు. ఈ మధ్య అంటే రెండేళ్ళ క్రితం వెళ్ళి వచ్చింది. అప్పుడప్పుడు శ్రీశైలానికి వెళ్లి వస్తుంటుంది.

హాళె దరోజిలో ఊరి దేవత దేవమ్మ. ఆమెకూ ఆమె పేరిట పెద్ద జాతర జరుగుతుంది. సుమారు 10-12 ఏళ్లకొకసారి ఈ జాతర జరుగుతుంది. ఊళ్లో అప్పుడప్పుడు జరుగుతున్న గొడవలవల్ల దేవమ్మ జాతర వాయిదా పడుతూవచ్చింది. ఆమె జాతర చేయడానికి కొన్ని వర్గాలు పోటీలుపడి పార్టీలు కట్టారు. అందువల్ల మొదట్లో ఆగిపోయిన దేవమ్మ జాతర ఇప్పుడు మళ్లీ మునుపట్లా జరుగుతోంది. ఇక్కడ ఊరమ్మకు బలి ఇచ్చినట్టే, దేవమ్మకు దున్నపోతును బలియిస్తారు.

హాళెదరోజి చుట్టుపక్కల దేవమ్మకు గొప్పపేరు ఉంటే రాం పురం వైపంతా మారెమ్మకు పేరుంది. ఆమెకూ దేవమ్మకు జరిగినట్టే పెద్ద జాతర జరుగుతుంది. ఇక్కడ కూడా కోడెలు, గొర్రెలను బలియిస్తారు. దేవమ్మ పూజారులు వడ్రంగులు. అన్ని వర్గాల ప్రజలు ఈమెను కొలుస్తారు. ఇలాంటి జాతరలకు శ్రీమంతులకన్నా, పేదవాళ్లే ఎక్కువగా వస్తారు. అలా వచ్చివాళ్లు ఎంత పేదవాళ్లయినా కనీసం ఒక కేజి మాంసం వండుతారు. కొందరు అన్నం, పప్పునే నైవేద్యంగా పెట్టి భోంచేస్తారు. మరునాడు తీపివంటకం చేస్తారు. పక్కనేవున్న కణివె మారెమ్మకు 5-10 సంవత్సరాకు ఒకసారి జాతర జరుగు తుంది. అక్కడ 'వేటాడి' వేటనే నైవేద్యంగా పెడతారు.

ఇలాంటి పండుగలు, జాతరలు, ఉత్సవాలు ఎక్కడ జరిగినా అక్కడ బుడగ జంగమ వేషగాళ్లు ఉండనే వుంటారు. దరోజిలో ఉంటే అక్కడే పండుగ జాతర చేస్తారు. మరో ఊరిలో ఉన్నప్పటికీ పద్ధతులు పాటిస్తారు. ఊళ్లూళ్లూ తిరుగుతూ జీవితం సాగించేవారికి ఒక పూట భోజనం దొరికితే అదే పండుగ. ఇలాంటి పండుగల కన్నా బుడగ జంగాల జీవితానికి కొత్త మలుపు ఇచ్చేటటువంటి కులాలను ఒక్కటిగా చేసే పెద్దపండుగ పీర్ల పండుగ ! ఉగాది సమ యంలో జరిగే ఈ పండుగకు మొత్తం బుడగ సముదాయం జనులే అక్కడ కలుసుకుంటారు. వాళ్ళు బయటి రాష్ట్రాలలో ఉన్నప్పటికీ ఇక్కడి 'కులపంచాయితీ'లకు వచ్చి కలుస్తారు. జానపద గురువర్గం మాదిరి ఇక్కడ కూడా కులగురువు మాటే చెల్లుతుంది. వీళ్ళు లేకుండా కులపంచాయితీ జరగదు. ఇది ఈరమ్మ తాత, ముత్తాతల కాలం నుంచి సాగుతూవచ్చింది. తమతమ కులస్థుల ముఖాలను చూడటానికే ఈ పీర్ల పండుగకు ప్రతిఒక్కరూ రావాల్సిందే. వెయ్యో, రెండు వేలో, అవీ లేకపోతే కనీసం అయిదు వందలైనా కూడబెట్టుకుని వస్తారు. అలా వచ్చినవాళ్ళు తన పంచాయితీలను ముగించుకుని పెళ్ళికి అక్కడి పిల్ల, పిల్లవాడిని ఒప్పించి జంగమ కులస్థులందరి సమక్షంలో పెళ్ళి చేసుకుని తమతమ ఊళ్లల్లోని గుడారాలకు వెనుతిరుగుతారు. వెళ్లడానికి ముందు పీర్ల దేవుడికి చక్కెర చదివించి, చేతులు జోడించి భక్తిగా నమస్కరిస్తారు. ఇలా వచ్చినవారు మళ్లీ పీర్ల పండుగ సమయంలోనే 'కుదురెమోతి'కి వస్తారు.

పల్లెల్లో తిరుగుతున్నప్పుడు పంచమి పండుగ, దీపావళీలను గుడారాలలోనే ఆచరించే ఈ జనసముదాయం పీర్ల పండుగ వస్తే ఎలాంటి కలలు, నమ్మకాలు మోసుకుని బయలుదేరుతారో వారికే తెలుసు. మనిషికి పండుగలు కొత్త జీవితపు నమ్మకాన్ని కలిగిస్తాయి అంటూ వాటిని కథలుగా ఈరమ్మ మలుస్తుంది.

'మనం లేకపోయినా భూమి మీద పంటలు పండలేదా? ఎంతటి రాజమహారాజులు ఈ భూమి మీద లేకుండా పోయారు. ఇక మనమెంత? మనం ఉన్నదంతా మోసుకునిపోము. హంపిని పాలించినవారు నాశనమైపోయారు. పెద్దపెద్ద రాళ్ళను లాగించిన వాళ్ళు, ఏనుగు కాళ్ళతో తొక్కించినవాళ్లు, అంబారీ మీద కూర్చున్న వారు అందరూ మట్టిలో కలిసిపోయారు. మోసుకుని పోవడానికి ఏముంది?' ఒక సన్యాసినిలా ఈరమ్మ మాట్లాడుతుంది. ఒక్కొక్కసారి ఆధ్యాత్మికవాదిలా లోక సృష్టి గురించి మాట్లాడుతుంది. బహుశా కావ్యాలే ఆమెలో ఉండి ఇలా మాట్లాడిస్తుండవచ్చు.

*

(వచ్చేసంచికలో..... **తన కావ్యలోకం లోకి...**)

సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650.

డా. కాలువ మల్లయ్య 'సిద్ధాంత గ్రంథం'



రచనా వ్యాసాంగమే జీవితంగా మలుచుకొని సాహిత్య జీవి తాన్ని అనునిత్యం పండించుకుంటూ, 70 వసంతాలకు దగ్గరలో ఉన్న ఒక సాహితీ యోధుడు డా. కాలువ మల్లయ్యగారు. తెలంగాణలోనే కాదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కథా, నవలా రచయిత. ఈ రెండు రంగాలపై పదునైన సాహిత్య విమర్శకుడు. వివిధ సాహిత్య ప్రక్రియలలో ఆరితేరిన సిద్ధహస్తుడు, గత యాబై ఏళ్ళనుండి సాహిత్య రంగంలో అవిశ్రాంతంగా కలాన్ని కదుపుతూ, కాలాన్ని నమోదు చేస్తూ వివిధ ప్రక్రియలలో మేలైన రచనలు చేస్తూ, తన సత్తాను చాటుకుంటున్నారు. ఒక విధంగా చెప్పాలంటే తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నవారిలో వీరు ఒకరు. ఇంతవరకు వీరు రాసిన పుస్తకాలు పరిశీలిస్తే, యాభై దాటిపోయాయి. తొలుత వీరు వచన కవిత్వం రాశారు. తదుపరి కథారచనలపై ప్రధానంగా తమ దృష్టిని కేంద్రీకరించి సుమారు వేయికి పైగా కథలు రాశారు. వీరి కథలు వివిధ పత్రికల్లో ఒక ప్రవాహంలా వచ్చాయి.కట్నం కథలు, ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేదు, రాజు-కోడి, మాకథలు, అవ్వతోడు గిదిమా తెలంగాణ, కాలువ మల్లయ్య కథలు, చెప్పుల తయారీ లాంటి కథాసంపుటాలను ప్రచురించారు. తదుపరి నవలా రచనలపైన కూడా దృష్టి సారించారు. కథారచన, నవలా రచన వీరికి రెండు కళ్ళు. ఈ క్రమంలోనే పదుల సంఖ్యలోనవలలు రాశారు. ఒక దశలో వీరి కథారచనలు, నవలా రచనలు సమాంతరంగా సవ్యసాచిలా సాగాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లానుండి డా.సినారే, పివి, బాపురెడ్డి వంటి వారు ప్రసిద్ధమైన రచనలు చేసి, ఉమ్మడి జిల్లా ప్రతిష్టను పెంచారు. డా. కాలువ మల్లయ్య గారు ప్రస్తుతం నూతన పెద్దపల్లి జిల్లా, జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన వారు. వీరు 1952, జనవరి 12న జన్మించారు.. కథా, నవలా కారుడిగానే కాకుండా, ఈ రెంటిలో సాహిత్య విమర్శకుడిగా ఈ ప్రక్రియలలో పలు లోతైన వ్యాసాలు రాస్తున్నారు. విశ్లేషణలు చేస్తున్నారు. తాను బీసీయైనా, దళిత వాదాన్ని ప్రగాఢంగా విశ్వసిస్తూ, హైదరాబాద్ లోని తెలుగు సాహిత్య అకాడమిలో గత ఏడేళ్ళనుండి సాహిత్య పరిశోధకుడిగా పనిచేస్తూ, కవి చక్రవర్తి గుర్రం జాషువా తదితర అధ్యయన పీఠాలలో పరిశోధక రచనలు చేశారు.

భూమి పుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు, బతుకు పుస్తకం, డబ్బు, తృప్తి ఈజ్ ఈక్వల్టు దుఃఖము, గువ్వల చెన్నా, మాదిగ విజయం, అదృశ్య కోయిల, మెతుకు, తెలంగాణా దేవదాస్ వంటి నవలలు రాశారు. వీరు రాసిన మాదిగ విజయం అనే నవలకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013-14 లో నిర్వహించిన నవలల పోటీలో ఉత్తమ నవలగా ఎన్నికైంది. వీరికి గుర్రం జాషువా పురస్కారం కింద 2013లో రెండు లక్షల నగదు పురస్కారం ఇచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గౌరవించింది.

తెలుగులో ప్రగతిశీల కథాసాహిత్యంపై వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం నుండి1993లో పరిశోధన చేసి, గత ఏడాది అనగా 2017 డిసెంబర్ లో పుస్తక రూపంలో సుమారు 380 పేజీలతో విడుదల చేశారు. కథా సాహిత్యంపై వీరు కేంద్ర సాహిత్య అకాడమి ఫెల్లోషిప్ కింద తొమ్మిది పదుల తెలంగాణా కథలు అనే విమర్శనా గ్రంథం రాశారు. ఇందులో వీరు కథాసాహిత్యం పట్ల ఉన్న లోతైన పరిశోధన కనబడుతుంది. తెలంగాణా కథ, తెలుగు కథ అనే పేరున వీరి వ్యాసాల పుస్తకం వచ్చింది. వీరి కథా, నవలా సాహిత్యంపై 25 మంది వరకు సిద్ధాంత పరిశోధనలు చేశారు. వీరు 16 నవలలు రాయగా, ఇందులో 8 పుస్తకాలుగా వచ్చాయి. ఇవి అవార్డులకు నోచుకున్నవని డా.కాలువ మల్లయ్య తెలిపారు. ఆచార్య బన్న అయిలయ్య వీరి కథా సాహిత్యం పైన ఒక పరిశోధక పుస్తకమే రాశారు.

డా.కాలువ మల్లయ్య గారు తెలుగులోప్రగతిశీల కథా సాహిత్యంపై సిద్ధాంత పరిశోధన చేస్తే, వరవరరావుగారు తెలుగులోనవలా సాహిత్యంపై పరిశోధన చేశారు. 1983లో తెలంగాణా విముక్తి పోరాటం - తెలుగు నవల-సమాజం, సాహిత్యం ల పరస్పర సంబంధంపై ఒక పరిశీలన అనే అంశంపై ప్రముఖ విప్లవకవి డా. పెండ్యాల వరవరరావు సిద్ధాంత గ్రంథం రాసి,పిహెచ్ డి పొందారు. వీరిద్దరు ప్రగతిశీల కథా, నవలా సాహిత్యాలపై వేర్వేరుగా పరిశోధన చేయడం గమనించాల్సిన విషయం. వీరిద్దరి పరిధి ఒక్క తెలంగాణాకే కాకుండా తెలుగు సాహిత్యానికి తీసుకోవడం అభినందించదగిన విషయం.

వీరు తెలుగులో ప్రగతిశీల కథాసాహిత్యంపై పిహెచ్.డి. తీసుకొని ఆ సిద్ధాంత గ్రంథాన్ని గత ఏడాది అచ్చులోకి తెచ్చారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు విభాగం నుండి డా. పి. వి. చలపతిరావు 'గైడ్'గా వెలువడింది. వీరికి పిహెచ్.డి లో సీటు రావడానికి ఉస్మానియా తెలుగు విభాగం అచార్యులు నాయిని కృష్ణకుమారి, డా.కులశేఖర్ రావు, డా.వేటూరి ఆనందమూర్తి, డా.అమరేశ్వరం రాజేశ్వర శర్మ తదితరులు సహకరించారు. డా.ఎన్.వి.రామారావు, డా.ఎన్.గోపి, కథాసాహిత్యంలో తల పండిన డా.కేతు విశ్వనాథరెడ్డి, డా.రావూరి భరద్వాజ, డా.అక్కిరాజు రమాపతిరావు, డా.పోరంకి దక్షిణామూర్తి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, డా.రామలింగం,

వాసిరెడ్డి నవీన్ తదితరులెందరో సహకరించారని రచయితే ప్రకటించుకున్నారు. ప్రజా పోరాటాల కాలంలో ప్రగతిశీల కథంటే, పోరాట కథేనన్న భావంతో రచయిత, ఈ పరిశోధన కొనసాగించడం జరిగింది. ఇలా రచయిత తన పరిశోధనా వస్తువును ఖరారు చేసుకున్నారు. 1970-1990 మధ్య పోరాట సాహిత్యాన్ని ప్రచురించిన పత్రికల్లోని కథల ఆధారంగా ఈ పరిశోధన చేశారు. ఇలాంటి కథలపైన గతంలో ఎలాంటి పరిశో ధనలు జరుగలేదని తెలుసుకున్నాకే రచయిత పరిశోధనలోకి అడుగి డినట్లు కనిపిస్తోంది. ఈ పరిశోధన అయిదేళ్ళు పట్టిందని, ప్రజా కథలుగా పిలువబడి తన పరిశోధన కథలు చదివితే ఎన్నో ఆసక్తి కరమైన విషయాలు తెలిసి వస్తాయని రచయిత చెబుతున్నారు. గుణాద్యుడి పైశాచీ ప్రజలభాషా పరంపరను, పాల్కురికి సబ్బండ వర్ణాల సాంస్కృతిక సంపదను ముందుకు తీసుకెడుతున్న బహుజన బంధువు కథా సాహిత్య పరిమళంగా వీరి పరిశోధనను వర్ణించ వచ్చును.

పరిశోధక రచయిత ఈ సిద్ధాంత గ్రంథాన్ని నాలుగు విభాగాలు చేసి, తన పరిశోధనను విశ్లేషించారు. 1.తెలుగు కథా ఆవిర్భావ వికాసాలు, 2.ప్రగతి శీల కథలు 3.1970 తర్వాత ప్రగతిశీల కథలు 4. మారుతున్న సాహితీ మూల్యాలు-కథానిక భవిష్యత్తు. ఇందుకు రచయిత డా.మల్లయ్య గారు 150 వరకు ఉపయుక్త గ్రంధాలను పరిశీలించారు. కథా సాహిత్యాన్ని ఈ గ్రంథాల నుండి వడబోశారన్నమాటే. మొదటి కథకు శాతవాహనుల కాలం నాటి గుణాధ్యుడు రాసిన బృహత్కథేనని ఆద్య గ్రంథంగా, తెలుగులో స్వతంత్ర గ్రంథ రచనకు, సబ్బండ వర్ణాలను సాహిత్యానికి ఎక్కించిన ఆదికవి పాల్కురికి సోమనాథుడేనని వీరు తేల్చి చెప్పారు. రచయిత ఇందులో తెలుగులో కథా విప్లవాలు, తెలుగు కథల్లో మూడు ప్రాంతాల జీవితాలు- ఉద్యమాలు ప్రతిబింబించిన విధం, మాండలిక భాసకు సాహిత్య గౌరవం తీసుకొచ్చిన కథా రచయితలు. ప్రగతి భావ నిర్మాణ క్రమంలో నిర్వచన నిర్ధారణలు, భూపోరాట కథలు, సాంస్కృతిక కళారూపాల-పోరాటాల కథలు, వర్గ శత్రు నిర్మూలన కథలు, రైతు-రైతు కూలీల కథలు, కార్మికుల కథలు, గిరిజనుల కథలు, విద్యార్థులు-మేధావుల కథలు, మధ్య తరగతి జీవితాలకథలు, స్త్రీల సమస్యలపై కథలు, దళిత కథలు, వ్యవస్థను ప్రశ్నించే వివిధ రకాల కథలు మొదలగు అంశాల కథలను వస్తువు లుగా తీసుకొని పరిశీలించారు. వీటిని సరియైన విధంగా విశ్లేషిం చారు. తెలుగు కథ 1970 నాటికి మధ్యతరగతిని, పట్టణాలను వదిలి గ్రామాలలోని సామాన్య మానవుల దగ్గరికి చేరిందని, తెలంగాణా నుండే ఎక్కువ కథలు వచ్చాయని, ఇతర ప్రాంతాల నుండి తక్కువగా వచ్చాయని తేల్చడం, తెలంగాణాలోని ఉద్యమ ప్రభావమేమని చెప్పడం సహేతుకంగానే వుందని పరిశోధక రచయిత తన పరిశోధన ద్వారా తేల్చడం సరియైనదేనని, ఈ పుస్తకానికి ముందు మాట రాసిన ప్రముఖ సాహిత్య విమర్శకులు డా.రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొనడం గమనించాల్సిన విషయమే.

బహుజనులు, అట్టడుగు వర్గాల వారు రచయితలుగా ఎదిగిన తీరుపై రచయిత విస్తృతంగా చర్చించారు.

ఈ పరిశోధక పుస్తకం పాతికేళ్ళ తర్వాతే అచ్చులోకి వచ్చింది. అయినా కథాసాహిత్య పరిశోధక విలువలతో చెక్కుచెదరకుండా నేటికినీ తన ప్రామాణికతను కోల్పోకుండా వుంది.

తెలుగు కథానిక పునర్జీవ కాలంలో ఈ పరిశోధన జరిగింది. విప్లవ సాహిత్యం ఈ కాలం నుండే మొదలైంది. పోరాట అవసరాన్ని చెప్పే కథలపైనా మల్లయ్యగారి పరిశోధక నిబద్ధత కనబడింది. విప్లవ సాహిత్య కథానికా చరిత్రకి వీరు తమ పరిశోధనద్వారా తగిన న్యాయం చేకూర్చారని చెప్పక తప్పదు. అంటే విప్లవాల కాలాన్ని ఎంచుకొని, కథానికా మలుపుల్ని మన ముందు నిష్పాక్షికంగా వుంచారని చెప్పవచ్చు. అది యాదృచ్ఛికంగా జరిగినా, అనుకూలంగా వచ్చినా డా.కాలువ మల్లయ్య పరిశోధనే గొప్పదని చెప్పవచ్చు. ఆ కాలంలో కథానికా అంశంపై వాదవివాదాలు చర్చలు లేకున్నా, తెలంగాణాలో భండారు అచ్చమాంబ తొలి కథకురాలన్న విశాల ప్రస్తావన రాకున్నా, తెలుగు కథానికా సాహిత్యంలో అచ్చమాంబ పాత్ర అనిర్వచనీయమైంది. ఆధునిక కథ నిర్దుష్ట లక్షణాలు ఉండి, శిల్ప ప్రాధాన్యం గలిగిన ప్రక్రియగా పేర్కొంటున్నారు. కథకి భాష, భావం, శిల్పం, సాంఘిక ప్రయోజనం వంటివి వుండాలని రచయిత డా.మల్లయ్య తన పరిశోధన ద్వార నిగ్గుతేల్చి చెప్పారు. గురజాడ ఈ దృష్టితో కథలు రాసి, చక్కటి పేరు తెచ్చుకున్నారని రచయిత కితాబు నిచ్చారు. వీరు సంపూర్ణంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందే చేరువలో ఉన్నట్లు చెప్పవచ్చును.కథా తొలుత ఉన్నత వర్గాల నుండి వచ్చినా, నేటి కాలానికి అనుగుణంగా మారి పోయిందని,బహుజన, అట్టడుగు సామాజిక వర్గాల విద్యావంతులు, రచయితలు సైతం రాసే స్థాయికి కథ అందుబాటులోనికి వచ్చిందని, ఈ వర్గాల వారు తమ జీవితాల కష్టాలను, కన్నీళ్ళను కథలుగా మలిచారని రచయిత కోరుకుంటాడు.

కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణా ప్రాంతాల నుండి సింగమనేని నారాయణ, స్వామి, మధురాంతకం నరేంద్ర, కవన శర్మ, పాపినేని శివశంకర్, పులుకంటి కృష్ణారెడ్డి, బద్వేలి రమేష్, కళ్యాణరావు, ఉప్పల నరసింహం, జగన్నాథశర్మ, అబ్బూరి ఛాయాదేవి, సదానంద్ శారద, కాట్రగడ్డ దయానంద్, దేవరాజు మహారాజు, కలువకొలను సదానంద్, వివిన మూర్తి, అప్పల నాయుడు, దాట్ల నారాయణమూర్తి, చాగంటి తులసి లాంటి వాళ్ళు కండగల కథలు చక్కటి ప్రయోగాలతో సామాజిక ప్రయోజనాల కోసం రాస్తున్నారని రచయిత కితాబు నిస్తాడు. వ్యాపార ధోరణులను అధిగమిస్తు, తెలుగు కథ మరింత ఉన్నత ప్రమాణాలతో రావాలని రచయిత కోరుకుంటాడు.

ఎంతో విలువైన పరిశోధన ఫలితంగా వచ్చిన ఈ సిద్ధాంత గ్రంథం డా॥ కాలువ మల్లయ్య రచనలలో తలమానికంగా ఎల్లకాలం నిలిచి వుంటుంది.

ప్రజల భాషలో పరిపాలించలేని ప్రభుత్వాలు మనకు సిగ్గుచేటు

భాషోద్యమ కథానిక

నాన్నగారి కల

రాజేష్ యాళ్ళ
9700467675

"నోర్మూసుకో సాత్విక్! అసలేం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తోందా?" కొడుకు మీద కేక పెట్టాడు హరీంద్ర.

"నాన్నగారూ, నేను చదువు మానేస్తా ననలేదు. ఇప్పుడు ఎంసెట్ రాసి ఇంజనీరింగ్ చదవను అంటున్నాను." నెమ్మదిగా చెప్పాడు సాత్విక్.

"చదువు మానేస్తానన డానికీ, నీ ఆలోచనకూ పెద్ద తేడా ఏమీ లేదురా! మూర్ఖంగా



"లేదమ్మా నేను సరిగ్గానే ఆలోచిస్తు న్నాను. అయినా ఎందుకమ్మా నాన్నగారికి అంత చిన్నచూపు?" బాధగా అడిగాడు సాత్విక్.

ఆలోచిస్తున్నావ్!" గద్దించాడు హరీంద్ర.

"మూర్ఖత్వం ఏమీ లేదు నాన్నగారూ. చిన్నప్పటినుంచి చదువు విషయంలో మీరెలా చెబితే అలా నడుచుకున్నాను. దయచేసి నా మాట వినండి నాన్నగారూ! మా మేష్టారిని కూడా నా నిర్ణయం తప్పా అని అడిగాను. ఆయన సంతోషించారు కూడా. వీలైతే మీతో కూడా మాట్లాడతానన్నారు."

"మేష్టారంటే ఆ శర్మగారే కదా...? ఆయనకేంరా అలానే చెబుతారు. వాళ్ళంటే పండితుల కుటుంబంలోంచి వచ్చిన విద్వాంసులు కాబట్టి రాణిస్తారు....నష్టపోయేది మనం! పైగా నువ్వేమీ ఆ కులంలో పుట్టలేదు మహాపండితుడివి అయిపోవడానికి." ఈసడిస్తూ అన్నాడు హరీంద్ర.

"నాన్నగారూ భాషకు కులం అంటూ ఎలా ఉంటుంది? పట్టుదల, ఆసక్తి అంటూ ఉంటే ఎవ్వరైనా నేర్చుకోవచ్చు. మీరు చెప్పినట్టుగా గొప్ప పండితుడిని అవ్వలేకపోవచ్చు నాన్నగారూ! మీకు తెలుసు నాకు తెలుగు భాషంటే ఎంత ఇష్టమో! దానికి కారణం చిన్నప్పుడు మీరు దిద్దించిన తెలుగు అక్షరాలే, నేర్పిన తెలుగు పలుకుబడులే! ఆ తర్వాతే బడిలో తెలుగు ఉపాధ్యాయులు చెప్పిన విధానంతో తెలుగు భాషపై మరింతగా నాకు ఆకర్షణ పెరిగింది. ఇష్టమైన భాషనే ఉపాధి మార్గంగా ఎంచుకోవడంలో నాకు తప్పు కనిపించడంలేదు." నెమ్మదిగా అన్నా, సాత్విక్ కంఠంలో స్థిరత్వం ఉంది.

"నా కొడుకు ఇంజనీరింగ్ చదువుతున్నాడని గర్వంగా చెప్పుకోవచ్చు అనుకున్నాను. నువ్వు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌వై ఆర్థికంగా ఎంతో ఉన్నతి సాధిస్తావ్ అనుకున్నాను. కానీ ఇలా బీ ఏ తెలుగు సాహిత్యంలో చేరతానని చెప్పి నీ బంగారుభవిత కోసం మేము కన్న కలలమేడలన్నీ ఇలా కూల్చేస్తావనుకోలేదురా!" హరీంద్ర గొంతు బొంగురు పోయింది.

"క్షమించండి నాన్నగారూ! ఇప్పుడందరూ చదువును ఒక చట్రంలో ఇరికించి చదువుతున్నారు. ఉద్యోగాలు కూడా అందుకు తగ్గట్టుగానే ఉంటున్నాయి. అందులో వ్యక్తిగతమైన అభిరుచికి అసలు స్థానమే లేదు. నేనెంచుకున్న చదువు, ఉద్యోగం నేను మనసు తీరా ఆస్వాదించేలా ఉండాలి. అది నాకు తెలుగు భాష గురించి చదువుకోవడంలోనే దొరుకుతుంది....." గబగబా తను చెప్పాలను కున్న మాటలు చెప్పేసి వెళ్ళిపోయాడు సాత్విక్. శిలాప్రతిమల్లానే చూస్తూ ఉండిపోయారు హరీంద్ర, సుమతి దంపతులు.

✶

"బిడ్డలను కనగలం కానీ బిడ్డల రాతలను కనలేమనే సామెత ఎందుకు పుట్టిందో నాకిప్పుడు అర్థమవుతోంది." నిర్వేదంగా చెప్పాడు హరీంద్ర.

"ఈ చిన్న విషయాన్ని మీరే పెద్ద సమస్యగా ఆలోచిస్తున్నారేమోనండీ!" భర్తను సమాధానపరచడం తనకు అసాధ్యమని సుమతికి తెలుసు. అయినా తన ప్రయత్నాల్లో పడిందామె.

"జీవితాన్ని మలుపు తిప్పే వయసులో వాడి ఆలోచన నీకు చిన్న విషయంగా అనిపిస్తుందా?" హరీంద్ర స్వరం హెచ్చింది.

"కొంచెం మీ కోపాన్ని తగ్గించుకుని నిదానంగా ఆలోచించండి. సాత్విక్ ఒక్కడే కొడుకు మనకు. పైగా లేక లేక పుట్టిన ఒకే ఒక్క సంతానం. ఈ జన్మకు ఇది చాలు అన్నట్టుగా అపురూపమైన వరంలా దేవుడు మనకు వాడినిచ్చాడు. వయసు తెచ్చిన అహాన్ని పక్కన పెట్టి వాడి ఆలోచనలను మనం అర్థం చేసుకోవాలి కదా!" సున్నితమైన స్వరం తో చెప్పింది సుమతి.

"ఎప్పుడు చూసినా నా అహంకారమే నీకు కనిపిస్తుంది కానీ దాని వెనకాల ఉండే ప్రేమ నీకెప్పుడూ కనపడదు కదా? వాడికి భాషాభిమానం ప్రకోపించి తప్పుదారిలోకి వెళుతున్నాడు. ఈరోజుల్లో ఏం చదివినా కడుపుకింత అన్నం పెట్టేటట్టుండాలి సుమతీ!!" బాధగా చెప్పాడు హరీంద్ర.

"అయ్యో...అలా అనుకోకండి. పిల్లలందరూ ఒకలా ఉండరండీ. పైగా ఇప్పుడు వాళ్ళవి స్వతంత్రమైన ఆలోచనలు. చదువు–ఉద్యోగం విషయంలో కూడా అంతే. వాళ్ళ ఆలోచనలు మనతో ఏకీభవించాలని లేదు. మనం ఒకలా అయితే బావుంటుంది అని ఆలోచిస్తాం. వాళ్ళకది నచ్చలేదనుకోండి. మనం ఎంత చెప్పినా చెయ్యరు." కాస్త భయంగానే భర్త వైపు చూసింది సుమతి.

"మా నాన్నగారికి నేను నాలుగో సంతానం. ఇద్దరక్కయ్యలూ, మా అన్నయ్యా కూడా నాన్నగారి మాటలు తు.చ. తప్పకుండానే పాటించాం. అందరికీ మంచి బ్రతుకుతెరువే ఏర్పడింది. అందరి జీవి తాలూ ఇప్పుడు సుఖమయంగానే నడుస్తున్నాయి. ఒక్కనాడూ ఆయన నిర్ణయానికి మేము ఎదురు తిరగలేదు. నీ సుపుత్రుడు మాత్రం అలా కాదు. పదహారో ప్రాయంలో పడ్డాడో లేదో తండ్రి మాటకే ఎదురుచెప్పేటంత ధైర్యం వాడికి వచ్చేసింది. ఇదంతా నువ్విచ్చిన అలుసే కదా?!" కోపం కట్టలు తెచ్చుకుంటోంది హరీంద్రకు.

"చూడండీ మనం చాలా అదృష్టవంతులం. వాడికి మీ ఆలోచన నచ్చలేదన్న విషయం ముందుగానే చెప్పాడు. అలా కాకుండా మీ మాటను విని ఆ తర్వాత కావా లని చదువును నిర్లక్ష్యం చేసి, వెనుకబడి పోయి, ఆ తర్వాత ఇదేమని అడిగితే 'అందుకే ముందే ఈ చదువు నాకిష్టం లేదని మీకు ముందే చెప్పాను' అని అంటే అప్పుడు ఇంకా బాధ కదండీ! మీ మాటను వాడు ధిక్కరించినట్టుగా మీరనుకుంటున్నారు. కానీ వాడి నిర్ణయాన్ని చెప్పి మీ గౌరవాన్ని ఉంచి నట్టుగా నాకనిపిస్తోంది." భర్తను అనున యించింది సుమతి.

"సుమతీ, వాడంటే నాకెంత ఇష్టమో నీకూ తెలుసు. మా సహోద్యోగుల పిల్లలంతా ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఎంత బాగా సంపాదించుకుంటున్నారో కూడా నీకు తెలుసు. దాదాపు అందరి పిల్లలు కూడా విదేశాల్లోనే ఉన్నారు. అది వాళ్ళకెంత గర్వకారణం! పుత్రోత్సాహమైనా, పుత్రికోత్సాహమైనా కూడా నిజంగా అదే! కానీ మన సాత్విక్ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే మాత్రం నాకలా అనిపించడంలేదు. వాడిది ఉడుకురక్తం. తెలిసీతెలియని వయసులో ఏవేవో నిర్ణయాలు తీసేసుకుంటే సరిచెయ్య వల

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

సిన బాధ్యత మన పైన ఉంటుంది కదా!" హరీంద్ర ముఖంలో దిగులుమేఘాలు కమ్ము కొచ్చాయి.

"దిగాలు పడకండి. అనవసరంగా మీరలా భయపడుతున్నారేమో! ఒక్కొక్కసారి పిల్లల నిర్ణయాలు కూడా సరిగ్గానే ఉంటాయి. వాడెంచుకున్న మార్గంలో వాడికే గమ్యం కని పించిందో మనమేం చెప్పగలం? నిజానికి వాడు మీ మాట కాదని వేరే చదువును ఎంచుకొంటున్నాడంటే వాడికి తన భవిష్యత్తు పట్ల స్పష్టమైన లక్ష్యముందేమో కదా!"

అవునూ కాదూ అన్నట్టుగా చూస్తూ నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాడు హరీంద్ర. భర్త ముఖంలోని చీకట్లను తొలగించలేక పోయినందుకు బాధపడుతూ సుమతి కూడా నిద్రకు ఉపక్రమించింది. వారిద్దరి ప్రయత్నా లనూ విఫలం చేస్తూ సూరీడు పొద్దు పొడవనే పొడిచాడు.

*

"రాత్రంతా నాన్నగారు నిద్రపోలేదురా సాత్విక్! నువ్వు మరీ తీవ్రమైన నిర్ణయం తీసుకున్నావేమో ఆలోచించరా!" కొడుకును బ్రతిమాలింది సుమతి.

"లేదమ్మా నేను సరిగ్గానే ఆలోచిస్తు న్నాను. అయినా ఎందుకమ్మా నాన్నగారికి అంత చిన్నచూపు?" బాధగా అడిగాడు సాత్విక్.

"ఇలాంటి భాషాశాస్త్రాలు మనకు సరైన ఉపాధి కల్పించవు కన్నా! అదే నాన్న గారి బాధ. పైగా తన సహోద్యోగుల పిల్లలు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూండటం, వాళ్ళు అక్కడికి వెళ్ళి పిల్లలను చూసి వచ్చి ఈయ నతో చెప్తూ ఉంటే మన సాత్విక్ కూడా అక్కడ ఉద్యోగం సంపాదించుకుని మననూ తీసుకె ళ్తాడే అని చెప్తూండేవారు. నువ్విలా ఆయనకు దిగ్భ్రాంతి కలిగిస్తావనుకోలేదు." కొడుకు నిర్ణయంలో మార్పు వస్తే బావుణ్ణని ఆమెకూ ఉంది. అప్పటికే సుమతి భర్తకూ కొడుకుకూ మధ్య నలిగిపోతున్న పోకచెక్క అయి ఉంది.

"నాన్నగారిపై ఉన్న ఆపేక్షతో నువ్వు నన్ను బ్రతిమాలుతున్నావు. కానీ ఈ ఒక్క విషయంలో నన్ను మీరిద్దరూ క్షమించం డమ్మా!" కన్నీళ్ళతో రెండు చేతులూ జోడిం చాడు సాత్విక్.

తన కన్నుల్లోనూ గిర్రుమంటూ నీళ్ళు సుడులు తిరగగా కొడుకును దగ్గరకు హత్తు కుంది సుమతి.

కాలక్రమంలో మరో ఏడేళ్లు నిశ్శ బ్దంగా గడిచిపోయాయి.

వరండాలో కూర్చుని పేపర్ చదువు కుంటున్నాడు హరీంద్ర.

"కాఫీ తీసుకోండి." అంటూ వచ్చింది సుమతి... భర్తకు కాఫీ కప్పును అందించి ఆమె కూడా కాఫీకప్పుతో ఆయన పక్కన కూర్చుంది.

"ఏ ఊరు వెళ్ళాడు నీ సుపుత్రుడు?" హరీంద్ర ముఖంలో హేళన.

"రాజమహేంద్రవరం! కందుకూరి పీఠం వాళ్ళు అష్టావధానానికి పిలిచారు." సుమతి ముఖంలో మటుకు గర్వం తొంగి చూసింది.

"ఏం పెడతాయే ఈ అవధానాలు... ఓ పూలదండా, ఓ శాలువా - వాళ్ళు దయ దలిస్తే కాసిన్ని డబ్బులూ! అంతేగా?!" అక్క సుగా అడిగాడు హరీంద్ర.

"చూస్తున్నారు కదండీ, మన సాత్విక్ ఇప్పుడు అందరినీ తన విద్వత్తుతో అలరించే చక్కటి విద్వాంసుడు. అతి చిన్నవయసులోనే తెలుగు అధ్యాపకుడిగా విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టి, అతి తక్కువకాలంలోనే గొప్ప సాహితీవేత్తగా ఎదిగిన వాడి ప్రతిభకు తెలుగు జాతి అంతా నీరాజనం పడుతోంది. పైగా వాడు మన కళ్ళ ముందే ఉన్నాడు. మన ఇద్దరినీ కళ్ళలో పెట్టుకుని చూసుకుంటు న్నాడు. ఇంతకంటే ఏం కావాలి మీకు?" భర్తను అడిగింది సుమతి.

పెదవి విరుస్తూ ఏదో అనబోయిన హరీంద్ర తన చరవాణి మ్రోగడంతో ఎత్తి "హలో" అన్నాడు. పైకి మాటలు వినపడేలా ఉంచిన ఆ చరవాణినుండి వినవస్తోన్న మాట లకు అతని ముఖంలో మార్పులు వస్తు న్నాయి... "హలో హరీంద్ర గారూ నమ స్కారం! నేను అమెరికా తెలుగు సంఘం నుంచి మాట్లాడుతున్నానండీ. ఎన్నో కావ్యా లను అవపోసన పట్టడంతో పట్టడమే కాకుం డా వాటికి అందమైన భాష్యం చెప్పటంతో పాటు ఆశువుగా అన్నిరకాలైన పద్యాలతో పాటు అనేక చమత్కారాలతో మీ అబ్బాయి సాత్విక్ అతిచిన్న వయసులోనే సాధించిన భాషా నైపుణ్యాలు కానీ ఆయన చేస్తోన్న సాహిత్యసృష్టి కానీ తెలుగుభాషను కాపా డేందుకు యువతను ప్రేరేపిస్తూ ఊరూరూ తిరుగుతూ ఆయన చేస్తోన్న కృషి కానీ నిజంగా అద్భుతాలే!

ఇక్కడి ప్రవాసులై ఉన్న తెలుగు వారం దరికీ మీ అబ్బాయి రాక చక్కటి విజ్ఞాన వినో దాలను పంచుతుంది. తెలుగు యువతరాని కంతటికీ భాషాభిమానం పెంచడంతో పాటు ఆసక్తినీ స్ఫూర్తినీ పెంచుతుంది. అందువలన ఆయనను నెలరోజుల అమెరికా పర్యటనకు ఆహ్వానించాము.

కానీ ఆయన ఒక ఆంక్ష పెట్టారు. ఆయనతో పాటు తల్లిదండ్రులైన మీ ఇద్దరినీ కూడా పిలిస్తేనే వస్తానని అంటున్నారు. దయచేసి మీరు కూడా తప్పకుండా రావాలని మా ఆహ్వానం. మీ ముగ్గురికీ టికెట్స్ పంపి స్తాము...ఉంటానండీ. నమస్కారం."

తన కలలను నెరవేర్చబోయే ఆ మాట లను విని చెమర్చిన కన్నులతో భార్య వైపు చూసాడు హరీంద్ర. సుమతి కన్నులు కూడా అందుకు భిన్నంగా లేవు!

*

భాష నా ప్రాణం!

భాష జాతి గుర్తు, భాష పూర్వుల నిధి
మాతృభాషతోనే మనకు ప్రగతి,
పరుల భాష దాది, స్వంత భాషయె తల్లి,
తల్లి నుడిని మరువ తగదు తగదు


తెలుగు సాహిత్యం నా దేహం
తెలుగు భాష నా ప్రాణం

డా॥ మలయశ్రీ
9866546220

ఆహ్వానం, వేదిక అలంకారం, సభ నిర్వహణ - అంతా తెలుగులోనే ఉండాలి

రెహమానుద్దీన్ షేక్
9686903386

పఠాభి(తిక్కవరపు పఠాభిరామిరెడ్డి) శతజయంతి



నెల్లూరు పట్టణంలోని టౌనుహాలు (రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం) లో మనసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పఠాభి(తిక్కవరపు పఠాభిరామిరెడ్డి) శతజయంతి సభ జరిగింది. ఈ సభలో మనసు ఫౌండేషన్ ప్రచురించిన పఠాభి సర్వలభ్య రచనల సంకలనం విడుదల జరిగింది.

తిక్కవరపు పఠాభిరామిరెడ్డి ప్రముఖ తెలుగు కవి, తెలుగు, కన్నడ సినిమా నిర్మాత, దర్శకులు. పఠాభిగా ఆయన ప్రసిద్ధులు. ఫిడేలు రాగాల డజన్, పఠాభి ఫన్‌చాంగం అనేవి ఆయన ప్రసిద్ధ రచనలు. ఆయన తెలుగులో పెళ్లినాటి ప్రమాణాలు, శ్రీకృష్ణార్జున యుద్ధం, భాగ్యచక్రం సినిమాలు నిర్మించారు. కన్నడ సినిమా రంగానికి తొలి స్వర్ణ కమలం సాధించిపెట్టిన సంస్కార చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించారు. చండ మారుత, శృంగార మాస, దేవర కాడు అనే కన్నడ సినిమాలను నిర్మించారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహిత్యం, సినిమాలేగాక రాజకీయ, సామాజిక రంగాల్లో కూడా కృషి చేసారు.

భావ కవిత్వం మీద దండయాత్ర: ఫిడేల్ రాగాల డజన్

ఈ వ్యాసం వెల్చేరు నారాయణరావు గారి సిద్ధాంత గ్రంథమైన "కవితా విప్లవాల స్వరూపం" నుండి తీసుకోబడినది.

భావ కవిత్వం మీద పనిగట్టుకుని దండయాత్ర చేసినవాడు పఠాభి. ఫిడేలు రాగాల డజన్ భావకవిత్వ హేళన ప్రతిభావంతంగా చేసిన కావ్యం. శుక్లపక్షంలా జడ దృక్పథంతో భావకవిత్వాన్ని హేళన చేసిన కావ్యం కాదిది. భావకవిత్వం వల్ల ఏర్పడిన జడత్వాన్ని తొలగించే దృక్పథంతో చేసిన ప్రాణవంతమైన హేళన ఇది.

కలకత్తా విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న పఠాభికి 1938 లో ఇలా అనిపించిందట:

"As I lay on my bed and looked through the window, I saw the full moon surreptitiously peering through the smoke filled sky. All the thousand metaphors I had read in Bhava Kavitwam, in Prabandhams and in Tagore%Ñ%s songs, suddenly lost all their meaning"

అనుసరిస్తాను నవీన పంథ్మా కానీ
భావకవిన్మాత్రము కాన్మే నే
నహంభావకవిని.

అని ప్రకటించుకుని ప్రకటించిన ఫిడేలు రాగాల డజన్, వెల డజన్ అర్ధణాలు. ఇత్యాది ముఖపత్ర చమత్కారల వల్లనే కాకుండా, కవిత్వంగా ఆనాటి కవిత్వానికి విద్యుత్ చికిత్స అయింది. భావకవిత్వంలో ఏవి సున్నితంగా చెప్పుకుంటారో వాటి నన్నిటినీ హేళన చేసిన "anti-poem" పఠాభి రచన. తెలుగు కవిత్వంలో చిరకాలంగా కవితావస్తువులుగా అలవాటయిన ప్రతి వస్తువునూ, భావాన్నీ, శైలినీ అకవిత్వాంశాలుగా ప్రదర్శించడం కనిపిస్తుంది ఇందులో.

"తగిలింపబడియున్నది జాబిల్లి
చయినా బజారు గగనములోన్మ్మ పయిన
అనవసరంగా అఘోరంగా!"

అని కవిత్వంలో సుప్రతిష్ఠితుడయిన చంద్రుణ్ణి ఎలక్ట్రిక్ దీపంతో సమానంగా చూసి, వెండి రూపాయి కన్న, రంగుల ఎలెక్ట్రిక్ దీపాల కన్న, 'నాగరీక కన్యల పవుడర్ పూయబడిన ముఖాల' కన్న చంద్రుడు తక్కువ వాడుగా చెప్పడం – పాతబడిపోయిన కవిసమయాన్ని బయట పెట్టడం కోసం. ప్రబంధ కవిత్వంలో విసుగు లేకుండా వర్ణితమైన స్తన సౌందర్యాన్ని నిర్మొహమాటంగా –

"అహో జాతికన్నియ చిక్కని నిక్కబొడుచుకొని
వచ్చునట్టి గట్టిరొమ్ము"

అని కల్తీ లేని అకవితా రీతిలో చెప్పేస్తాడు కవి. కార్లనీ, సిగరెట్లనీ, మసాలా దోసెనీ కవితా వస్తువులు చెయ్యడంతో మలయానిలమూ, మల్లెపువ్వులూ మట్టికొట్టుకు పోయాయని చెప్పకుండా చెప్తాడు కూడా. వెతికినా సున్నితమైన భావం, సున్నితమైన పలుకుబడి లేనితనానికి ఈ కవి పనిగట్టుకుని ప్రయత్నిస్తాడు. గ్రాంథికభాషని మాత్రమే కాదు, ఆ భాషలో అలవాటుగా కవిత్వపు భాష వేసుకుని తిరిగే పలుకుబడిని బట్టబయలు చేశాడీయన.

కవిత్వపు వేషం వేసుకుని అకవిత్వం తిరుగుతున్నప్పుడు, కవిత్వం అకవిత్వపు వేషంలో రావలిసి ఉంటుంది. సరిగ్గా ఈ పనే చేసింది పఠాభి కవిత్వం. సారం నశించిన ఆకారాలు, కాలం చెల్లిపోయినా, రాజ్యం చెయ్యకుండా వాటి వికృతిని బయటపెట్టిన విధ్వంసకుడు, iconoclast, పఠాభి.

భావకవులది అమలిన శృంగారం కాగా, పఠాభిది నూటికి నూరుపాళ్ళు మలిన శృంగారం. భావకవులది సుకుమార శృంగారం కాగా, పఠాభిది సుతారమూ సుకుమారత లేని మోటు శృంగారం.

"అరటి పండున్ పక్కు తీసి తినేలా
మ్రింగివేశాన్నేనా నగ్నాంగమును"

ఇత్యాది రీతిలో వుంటాయి పఠాభి 'శృంగార' వర్ణనలు. పురాణ స్త్రీల పాతివ్రత్యాన్ని కూడా నిర్దాక్షిణ్యంగా భగ్నం చేస్తాడు పఠాభి. సీత రాముడి భార్యగా కన్న రావణుడి ప్రియురాలిగా ఉండాలనుకుంటుంది.

భావకవిత్వం ఆత్మాశ్రయం కాగా, పఠాభి కవిత్వం కపట ఆత్మాశ్రయ కవిత్వం. ఈ కవిత్వంలో 'నేను' కవితో తాదత్మ్యం గల



'నేను' కాదు. ఆ కారణంచేతనే పాఠకుడు తాదాత్మ్యం పొందగల 'నేను' కాదు కూడా. ఎదుటివాడిని హేళన చెయ్యడానికి వారి రూపం తన మీద ఆరోపణ చేసుకునే ఎత్తుగడ ఫలితమైన ఆత్మాశ్రయత్వం మాత్రమే ఇది. "ఈ పద్యాలలో వచ్చునట్టి 'పఠాభి' అను పేరుగల పాత్రకు గ్రంథకర్తకు ఏ మాత్రం సంబంధం లేదని గమనింపు" అని ప్రకటించి – కృష్ణపక్షం లోని 'కృష్ణ' కును దాని గ్రంథకర్త నామంలోని 'కృష్ణ'కును ఎలా సంబంధం లేదో అలాగే – అని పోలిక తేవడం వెక్కిరింపుకోసం. నిజానికి కృష్ణపక్షంలో కృష్ణకు కృష్ణ శాస్త్రిలో కృష్ణకీ సంబంధం ఉంది. ఉన్న సంబంధం సున్నితంగా వ్యక్తం కావటానికి వదిలేసి దాన్ని స్పష్టంగా అవును – కాదు అని చెప్పకుండా ఉండడం భావ కవిత్వపు పద్ధతి. కొన్ని భావాలు అలాగా ఊహకి వదిలెయ్యాలి మాటల్లోకి తెచ్చామంటే చాలు అవి దెబ్బ తింటాయి అనేది భావకవిత్వపు తరహా. కావాలని బాహాటంగా పఠాభి అనే పేరు కవిత్వంలో వాడి, ఆ పఠాభి, కవి పఠాభి ఒకరు కారనటం – ఆ తరహాని వెక్కిరించడం కోసం.

ఆఖరికి ఫిడేలు రాగాల డజన్ అంకితం కూడా భావకవిత్వం మీద వెక్కిరింపు కోసం చేసినదే. 'మృణాళినికి – కాదు కళ్యాణికి, కాదు ఇరువురికి' అని ఇద్దరికి అంకితం చెయ్యడం బాహాటంగా ఇద్దరిపట్ల ఇష్టం చూపించడంకోసం.

"నా యంతరంగ శాంతిదేవత......నా తపః కల్పవల్లి"

ఇలా ఆమెని గురించి ప్రతీకవీ పూజభావంతో చెప్పడం, ఆమెతో అనుబంధం 'జన్మ జన్మల యాత్ర' కావడం భావకవిత్వంలో సుప్రసిద్ధం. ఆ అలవాటుని వేళాకోళం చెయ్యడం ఈ అంకితంలో కనిపిస్తుంది.

ఆర్జవం, అనుభూతి, సెంటిమెంట్ – ఇవి పఠాభి కవిత్వంలో వెతికినా కనిపించని విషయాలు. కవిత్వపు వేషం వేసుకుని అకవిత్వం తిరుగుతున్నప్పుడు, కవిత్వం అకవిత్వపు వేషంలో రావలిసి ఉంటుంది. సరిగ్గా ఈ పనే చేసింది పఠాభి కవిత్వం. సారం నశించిన ఆకారాలు, కాలం చెల్లిపోయినా, రాజ్యం చెయ్యకుండా వాటి వికృతిని బయట పెట్టిన విధ్వంసకుడు, iconoclast, పఠాభి. ఫిడేల్ రాగాల డజన్ భావకవిత్వానికి 'దహన సంస్కారం' చేసింది. ఇంక ఆ తరువాత ప్రతిభావంతులెవ్వరూ భావకవిత్వం రాయలేదు. అలవాటుని ఆశ్ర యించుకున్న రెండవ తరగతి కవులు ఎప్పుడూ ఉంటారు.

అయితే పఠాభి కవిత్వం మీద న్యాయమైన విమర్శ ఇంత వరకూ రాలేదు. దువ్వూరి రామిరెడ్డి ఫిడేల్ రాగాలని తీవ్రంగా ఖండిం చారు. "యవ్వన ప్రాదుర్భావ సమయమున కామోద్రిక్తుడు 'కామర్తాహి ప్రకృతి కృపణా శ్చేతనా చేతనేషు' అను కాళిదాసు సూక్తికి ఉదాహరణ ప్రాయు డయి వలపు వస్తువులతో నవసి మతి చెడిన యువకుని ఉన్మత్త ప్రలాపములు" గా స్ఫురించాయి పఠాభి పద్యాలాయనకు. దాదాపు అంత కోపమూ వచ్చింది సి. నారాయణ రెడ్డిగారికి. " పాశవిక శృంగార క్రీడలకు, అసంపూర్ణ కామ వాంఛలకు పతాకల వంటి" వని ఈ గేయాలన్నిటినీ ఖండించి "ఈ ధోరణి పఠాభితోనే అస్త మించుట తెలుగు కవితలోని ఆరోగ్య వంతమైన లక్షణములలో నెన్నదగినది" అని రాశారాయన.

వీళ్ళకి ఎందుకింత కోపం వచ్చిం దో తెలియదు కాని ఫిడేలు రాగాలలో కామపరతంత్రత లేదు. నిజానికి ఫిడేలు రాగాలు ఏ ఆవేశాన్ని కలిగించే రచన కాదు. ఈ రచనా ధోరణి ఆవేశ వ్యతిరేక మైన ధోరణి, అపహాస్య ధోరణి. భావకవిత్వపు 'అకామ' తత్వాన్ని వెక్కిరించడానికి పఠాభి చేసిన ఈ 'కామ వర్ణనలు' ఏవీ నిజంగా కామాన్ని రెచ్చగొట్టేవి కావు. ఇందులో నాయికా నాయకుల పట్ల కవికి గూడా హాస్య దృష్టే ఉంటుంది. ఉదాహరణకి 'ఆ రోజు' అనే పద్యంలో నాయకుడైన 'పఠాభి' శర్కరస్వరం (కర్కశ స్వరాన్ని జ్ఞాపకం తెచ్చే పదం). నాయిక అతనితో 'సమానమయిన లావుంగల్గి/ దిట్టంగా జంతువట్లుంటుంది' . 'ఫ్లోరింగదిరేలా/ బాటా హయిహీలు బూట్సుల మీదన్ / సవారీ జేన్తా' వస్తుంది. వారిద్దరూ 'ఏనుంగున్నలా' గుంటారు. వాళ్ళు '20 అయిటమ్సు లంచి హిమాలయమంత' భుజిస్తారు. ఈ పద్యంలో 'ప్రాచీ దిశ సూర్యచక్రం రక్త వర్ణంతో / కన్పట్టింది'. ఇందులో 'బీదావర్ణిత అధరాలు' 'అపూర్వంబగు మజా' ఇలాటివి, భావ కవిత్వంలోనూ సంప్రదాయ కవిత్వంలోనూ అలవాటుగా ఒక భావాన్ని చెప్పే సందర్భాలలో వాడే మాటలకి వికృతీకరణలు. ఒక కామభావాన్ని ప్రవర్తింప జెయ్యాలనే దృష్టి కవికి ఉంటే, ఆయా ఘట్టాలలో ఈ వికృతీకరణవల్ల కలిగే అపహాస్య భావానికి ఆస్కారం లేదు. పఠాభి పద్యాలలో కామోద్రిక్తతను చూడడం పద్య ప్రదేశాన్ని అతిక్రమించడం వల్ల జరిగిన పొరపాటు. కాగా భావకవితా మర్యా దలపట్ల అశేష అభిమానాదరాలు గమనించవలసి ఉంటుంది. అంతే.

(ఇంతకు మించి 'ఫ్రాయిడ్ ప్రతిపాదించిన సెక్స్ సిద్ధాంతము' పఠాభి కవిత్వంలో ఉందని సి. నారాయణరెడ్డిగారు, వాల్ట్‌విట్‌మెన్ పద్యములకు పఠాభి వచన పద్యాలు 'అనుకరణలు' అని రామిరెడ్డి గారు అన్నారు, కాని ఆ మాటలు పరిశీలనకు నిలవవు. వ్యక్తిగా పఠాభికి ఫ్రాయిడ్, వాల్ట్‌విట్‌మెన్ అభిమాన రచయితలన్నమాట ఆయనే చెప్పుకున్నాడు. కాని ఆయన కవిత్వంమీద ఆ ప్రభావాలుం డడానికి అంతమాత్రాన ఆస్కారం లేదు. ఇలాగే పఠాభి మీద ఇలియట్ ప్రభావం ఉందని ఆరుద్ర అన్నమాట కూడా పరిశీలనకు నిలవదు. నగర జీవిత చిత్రణ చేసిన మొదటి తెలుగుకవి పఠాభి అని ఆరుద్ర అన్నారు. అక్షరాలా ఇది సరి కాదు. పఠాభి చేసినది ఏ జీవిత చిత్రణా కాదు. కాని పఠాభి ఫిడేలు రాగాలలో నగర వాతా వరణం ఉంది. నిజమే కాని అంత మాత్రాన ఇలియట్ కీ ఈయనకీ

పోలిక చూపించడానికి పూనుకోవడం సరికాదు. తెలుగు కవుల మీద ఇంగ్లీష్ కవిత్వపు ప్రభావాలు చెప్పడంలో ఇంతకన్నా ఎక్కువ మెలకువ అవసరం).

భావ కవతా పక్షపాతంతో రామిరెడ్డి, నారాయణరెడ్డి గార్లు పఠాభిని చూడగా, రమణారెడ్డిగారు అభ్యుదయ కవితాదృష్టితో చూశారు. పఠాభి 'అహంభావ' కవిత్వాన్ని విపరీత వ్యక్తి వాదంగా పరిగణించి, అది బూర్జువా బోర్‌డమ్ నుండి పుట్టిన కళారూపంగా భావించారాయన.

"చలనమే గాని నిలుపు లేదు. వేషణమే కాని ఇష్టఫల సిద్ధి లేదు. తృష్ణేకాని తృప్తిలేదు. ఉన్నది సరిపోదు. లేనిదే కావాలి. ఉన్న దానితోనే ఈసడింపు, లేనిదానితోనే తగని వలపు. అందుచేతనే భావం లోకాని భాషలో కాని 'నిత్య నవీనత' 'అపూర్వత' లక్ష్యమౌతుంది. 'వైచిత్రి' ఆరాధ్యమవుతుంది. భాష నాజూకుగా లేదు కాబట్టి, అవసరం కొద్ది కాకుండా నాజూకు కోసం ఇంగ్లీష్ పదాలను తెచ్చి తెలుగు పదాలకు తోకలు తగిలించు సాంప్రదాయిక భావం కిట్టదు కాబట్టి, అరువు తెచ్చుకుని సొంతపరుచుకున్న నవీన పాశ్చాత్య భావాలను దేశవాళీ జనబాణీ భావాలకు ఎరువుపెట్టు."

బలంగా ప్రతిపాదించిన తన విమర్శలో రమణారెడ్డిగారు చేసే ముఖ్యమైన ఆరోపణ పఠాభిది వైచిత్రీ ప్రియత్వంకోసం వచ్చిన నవ్యత అని. రెండవ ఆరోపణ ఇందులో "శుష్క మనోవిలసనమేకాని హృదయ ప్రచాలనం దాదాపు లే" దని. మూడవ ఆరోపణ పఠాభి కవిత్వం ఏమీ బోధించదని. నాలుగవ ఆరోపణ అతను 'పక్షాతీతు' డనీ, 'అలకా పురానికీ – అలగా జనానికీ జరిగే' పోరాటంలో ఏ పక్షమూ వహించడనీ. ఈ కారణాలు చూపించి "ఈ మనస్తత్వం ఒక వ్యాధి లక్షణం అనీ, తనలో పేరుకుపోయిన జిడ్డు వంటి అసం యమిత క్షుద్రోద్రేకాలకు బానిస" అనీ నిర్ణయించారు రమణారెడ్డిగారు. తమ అభిప్రాయాలకు పాశ్చాత్య కవిత్వ విమర్శలో కూడా తోడ్పాటు ఉందని రోజర్ గరాడీ రాసిన లిటరేచర్ అఫ్ ది గ్రేవ్ యార్డ్ ని ఆధా రంగా చూపించారు.

అసలు రోజర్ గరాడీ చేసిన విమర్శనీ, బూర్జువా బోర్‌డమ్ సిద్ధాంతాన్నీ పఠాభి కవిత్వానికి వర్తింపజెయ్య వచ్చునా అన్న సంగతి చూసే ముందు రమణా రెడ్డి గారు పరిగణించని అంశాలు రెండు న్నాయి: 1. ఫిడేల్ రాగాలు ప్రచురితమైన సందర్భంల్మ చారిత్రకంగా అప్పటి కవిత్వంలో ఈ పుస్తకం వల్ల నెరవేరిన ప్రయోజనం. 2) ఫిడేల్ రాగాలలో 'కామా' నికున్న పాత్ర. వీటిలో మొదటి అంశం ఈయన పూర్తిగా విస్మరించారు. రెండవ అంశంలో రామిరెడ్డి, నారా యణ రెడ్డి గార్ల లాగానే అతి నైతిక దృష్టి అవలంబించారు.

ఫిడేల్ రాగాల డజన్ భావకవిత్వానికి 'దహన సంస్కారం' చేసింది. ఇంక ఆ తరువాత ప్రతిభావంతులెవ్వరూ భావకవిత్వం రాయలేదు.

ఫిడేల్ రాగాలు ప్రధానంగా హేళన కావ్యమనీ, భావకవితా కాలంలో ప్రసిద్ధమైన శైలినీ, అభిప్రాయాల్నీ, దృష్టినీ, ధ్వంసం చేయడం దానివల్ల నెరవేరిన ప్రయోజనమనీ రమణారెడ్డి గారు గమనించలేదు. అందులో ఇంతగా కోపగించుకోవలసిన కామ విశృంఖలత నిజానికి లేదనీ, ప్రతి పద్యాన్ని ఉన్నది ఉన్నట్టుగా పరిశీలిస్తే కలిగేది అపహాస్య కామమే కాని కామోద్రేకం అందులో లేదని ఆయన చూడలేదు.

ఇక ఇందులో వైచిత్రీ ప్రియత్వస్వరూపం ఎలాంటిదో చూద్దాం. ఇందులో ఇంగ్లీష్ పదాల వాడిక, అసంప్రదాయక భావాల కూడిక, ఈ రెండింటికీ, విధ్వంసక తత్త్వమే ప్రధాన ప్రేరణలు. వీటికి కేవల వైచిత్రీ ప్రియత్వం కారణాలుగా ప్రతిపాదించడం సరికాదు. ఇందు లోని ప్రతి కొత్త ప్రయోగమూ, ఊహ, అంతకు ముందు కవిత్వంలో ఒక నిస్సారమైన అంశానికి హేళన. ప్రయోజనరహితమూ, తదేక పరమార్థమూ అయిన కొత్తదనమే వైచిత్రీప్రియత్వం అవుతుంది. అలాంటిది బూర్జువా బోర్‌డమ్ ఫలితమని అనవచ్చును. కాని పఠాభి రచన ఆ నిందకి తగదు. ఏమన్నా అయితే ఇది 'పాకీ సాహిత్యం' literary scavenger పఠాభి .. సామాజిక ప్రయోజనం దీనివల్ల ప్రత్యక్షంగా లేదు. కాని జడతామయమైన సాహిత్య రూపాల్ని ధ్వంసం చేసిన రచన ఇది.

రోజర్ గరాడీ విమర్శనకు తెలుగు సాహిత్యంలోని ఈ పరి స్థితికి పోలికలేదు. యూరప్ లోని తాత్త్విక పరమార్థాల, ఆచరణ మార్గాల ఘర్షణలో, గతి తార్కిక భౌతిక వాదాన్నీ, కమ్యూనిస్టు రాజ కీయాలనూ విడనాడి, తెగనాడి, ఒక అరాజక అనిబద్ధ స్వేచ్ఛాజనిత క్షోభనీ, గత్యంతర రహిత అశక్తతనీ అవలంబించి, దానికి విశేష ప్రచారం, ప్రాముఖ్యం కలిగించిన ఒక వర్గం రచయితలు ఏర్పడ్డ పరిస్థితిలో రోజర్ గరాడీ ఈ పుస్తకం రాశాడు. ఆ పరిస్థితిలో వర్తించే వాదనలను పఠాభి పుస్తకానికి పట్టించడం సమర్థం కాదు.

అహంభావ కవిని అని పఠాభి చెప్పుకున్న పేరు రమణారెడ్డి గారు కూడా వాచ్యార్థంలోనే గ్రహించారు. ఈ అహంభావం నిజానికి ఈ కవిత్వపు లక్షణం కాదు, భావ కవిత్వపు లక్షణంల్మ సంప్రదాయ కవిత్వ లక్షణం.

ఎవ్వరని ఎంతురో నన్ను ఏ ననంత
శోక భీకర తిమిర లోకైక పతిని


అని అతిలోకమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకుంటాడు భావకవి. ఇక సంప్రదాయ కవులైతే కవిత్వ వ్యక్తి చాటు కూడా లేకుండా నేరుగా తమను గురించి తామే గొప్పలు చెప్పుకోడం ప్రత్యేక కళగా సాధన చేశారు. భావకవిత్వం నుండి అప్పుడే విడిపోయి ఒక కొత్త ప్రాచీన సంప్రదాయ మార్గానికి ఆచార్యత్వం వహించబోతున్న విశ్వనాథ సత్య నారాయణ గారు తాము – "అలఘు స్వాదు రసావతార ధిషణాహం కార సంభార దోహల బ్రాహ్మీమయ మూర్తి" నని చెప్పుకున్నారు. ఈ లక్షణం మీద సాముదాయికంగానూ, భావకవి అహంకార ప్రద ర్శనం మీద ప్రత్యేకంగానూ ఈసడింపు ప్రకటించే పేరు – పఠాభి పెట్టుకున్న 'అహంభావ కవి' అనే పేరు. దీనికి వాచ్యార్థం పొసగదు. అంతే కాదు ఫిడేల్ రాగాలలో ఒక విలక్షణమైన ఆత్మనిరాకరణతత్వం ఉంది. ఇది భావకవిత్వం పట్లా, సంప్రదాయ కవిత్వం పట్లా పరిహాస దృష్టిని కల్పించడమే కాని, తన రచనా మార్గంపట్ల అనుయాయిత్వాన్ని ప్రోత్సహించదు.

పఠాభిని చూసి ఇంగ్లీష్ – తెలుగు కలగాయ భాషతో రచనలు చేసిన వారు పఠాభి కవితా మార్గాన్ని అనుసరించడం లేదు. అతనిలో ఉపరితలం మీద కనిపించే లక్షణాలను అనుకరిస్తున్నారంతే. నిజానికి పఠాభికి ఇతరులు అనుసరించదగిన కవితా మార్గం లేదు. ఎలా రాయకూడదో చెప్పడమే అతని పుస్తకం చేసే పని.

జి. వెంకటేశ్వరరావు
9491457496

అలంపూరు దేవాలయ శిల్పసంపదను సంరక్షించిన చరిత్రకారుడు

గడియారం రామకృష్ణ శర్మ



గడియారం రామకృష్ణశర్మ పుట్టింది రాయలసీమలో. శ్రమపడింది తెలంగాణాలో. తెలంగాణాలోని అలంపూరు శిల్ప సంపదను కాపాడినారు. తెలంగాణా తెలుగు సాహిత్యానికి వీరు చేసిన సేవ చిరస్మరణీయమైనది. 'సుజాత' అనే సాహిత్య పత్రికను స్థాపించి – తెలంగాణా సాహిత్యానికి ఎనలేని సేవలను అందించారు. మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయోద్యమానికి పునాదులు వేసిన వ్యక్తి గడియారం వారే.

గడియారం రామకృష్ణశర్మ (1919లో అనంతపురం జిల్లా కదిరిలో జన్మించారు. చిన్నతనంలోనే అలంపురంలో స్థిరపడినారు. తెలంగాణా చరిత్రకు, సాహిత్యానికి, సంస్కృతికి చిరస్మరణీయమైన సేవలను అందించారు. తెలంగాణా పునర్వికాస ఉద్యమానికి ఊపిరి లూది, చైతన్యాన్ని ప్రోది చేసిన పండిత, పరిశోధకుడు, సంపాదకుడు. గతానికి, వర్తమానానికి వారధి గడియారం రామకృష్ణశర్మ. హైదరాబాదు రాష్ట్రంలో తెలుగు సాహిత్యానికి ప్రాణం పోసి, సుజాత పత్రిక సంపాదకులుగా, శాసనాల పరిష్కర్తగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా, సారస్వత పరిషత్తు నిర్వాహకుడిగా, సభలు – సమావేశాల నిర్వాహకుడిగా, రేడియో ప్రయోక్తగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా తెలుగుజాతికి – ముఖ్యంగా తెలంగాణాకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయములు. కాలగమనంలో కలిసిపోయిన చరిత్రను రికార్డు చేసే విధంగా కొమర్రాజు లక్ష్మణరావు స్ఫూర్తి ప్రోత్సాహంతో తెలంగాణా శాసనములు – మొదట 1935లో లక్ష్మణరాయ పరిశోధక మండలి పక్షాన ఆదిరాజు వీరభద్రరావు ప్రచురించారు. దూపాటి వెంకటరమణాచార్యులు, ఆదిరాజు వీరభద్రరావు పరంపరను కొనసాగిస్తూ – తరువాతి కాలాలు తెలంగాణా, శాసనములు – రెండవ భాగాన్ని రామకృష్ణ శర్మ సంపాదకత్వంలో ప్రచురించారు.

గడియారం వారు అనేక (183) శాసనములకు నకళ్ళు వ్రాసి ఉన్నారు. రామకృష్ణశర్మ చరిత్రాభిమానమును, ఉత్సాహాన్ని, రచనా నైపుణ్యమును గురించి తెలంగాణా శాసనాలు – అనే గ్రంథం తెలియజేస్తుంది. కొమర్రాజు లక్ష్మణ రావు పరిశోధక మండలి గౌరవ కార్యదర్శి ఆదిరాజు వీరభద్రరావు తన పీఠికలో వ్రాస్తూ "రామకృష్ణ శర్మ ఈ గ్రంథ సంపాదకీయ భారము వహించి మమ్ములను కృతకృత్యులను చేసినారు. సంస్కృతాంధ్ర కర్ణాటక, ఆంగ్ల భాషలందు పండితులును, విశేషించి శాసనములను వ్యాఖ్యాన సహితంగా ఆంగ్లంలోను, తెలుగులోను ప్రకటించి చరిత్ర పరిశోధకుల మెప్పును గడించారు" అని పేర్కొన్నారు. దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన అలంపూరు శిల్ప సంపదను గురించి 1946లోనే పుస్తకాన్ని వెలువరించడమే కాకుండా, శిథిలావస్థలో ఉన్న ముంపుకు గురి అయిన గుడులను యథావిధిగా ఒడ్డుకు తరలించడంలో కీలక పాత్రను పోషించారు. కేవలం శాసనాలే కాకుండా, తెలంగాణా సాహిత్యానికి ఆయన చేసిన సేవ చిరస్మరణీయమైనవి. ప్రముఖ చరిత్రకారుడు సురవరం ప్రతాపరెడ్డి ప్రోత్సాహంతో 1950లో 'సుజాత' అనే సాహిత్య పత్రికను ప్రారంభించారు. ఇందులో ఆదిరాజు వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, సామల సదాశివ – మల్లంపల్లి సోమశేఖర శరమ రచనలతో – యువ కవులు – దాశరథి 'నా తెలంగాణా కోటి రతనాల వీణ' కవిత ఈ పత్రికలో ప్రచురింప బడినవి.

మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయోద్యమానికి పునాదులు వేసింది కూడా గడియారం వారే. వీరు రచించిన స్వీయ చరిత్ర 'శతపత్రం'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఇవేగాక దశ రూపసారం, భారత దేశ చరిత్ర, అలంపురం క్షేత్ర చరిత్ర, అలంపురం శిథిలములు, తెలుగు సిరి, బీచుపల్లి క్షేత్ర మహాత్మ్యం, రమామహేశ్వర చరిత్ర, భారతీయ వాస్తు విద్యా మొదలగు గ్రంథములను రచించెను. భారతీయ వాస్త విద్యా మొదలగు గ్రంథములను రచించెను. ఈ విధంగా వీరు తెలంగాణాకు చేసిన సాహిత్య సేవల

చిరకాలం ఉండిపోతాయి.

రామకృష్ణశర్మ భాగ్యనగర్ రేడియోగా ప్రసిద్ధి పొందినారు. రామకృష్ణశర్మ స్వాతంత్ర్య ఉద్యమకార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. కానీ వీరి అనుచరులు మాత్రం వీరిని సత్యాగ్రహం చేయవద్దని, కర్నూలు కార్యాలయాల్లోనే ఉండి ఉద్యమకార్యకర్తలకు సహకరించాలని కోరినారు. అందువల్ల శర్మ అలంపూర్ పట్టణంలో సత్యాగ్రహాన్ని మానుకొన వలసి వచ్చింది. గ్రామాలకు వెళ్ళి కార్యకర్తలను ప్రోత్సహించేవారు. రామకృష్ణశర్మకు వార్తా బులిటన్ల ప్రచురణ, రేడియో ప్రసారాల బాధ్యత అప్పగించబడింది. వీరు వార్తలను సేకరించి ప్రచురించడం జరిగింది. గొట్టిముక్కల కృష్ణమూర్తి ఇందుకు సహకరించారు.

రేడియో భాగ్యనగర్ ప్రతిదినం సాయంకాలం గంట సేపు వార్తలను ప్రసారం చేసేది. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ప్రసారం చేసేది. వార్తలలో నిజాం ప్రభువు దురాగతాలను, అతిశయోక్తులతో హాస్య ధోరణిలో ప్రసారం చేసేవారు. ఈ వార్తలను ఆంధ్రప్రభ పత్రిక యధాతథంగా ప్రచురించేది. ఈ భాగ్యనగర్ కార్యక్రమాలు మొత్తం నిజాం సంస్థనంలోనే కాకుండా –మద్రాసు, వంటి ప్రాంతాలలో కూడా వినపడేవి. 1948 జనవరి 30వ తేదీన గాంధీజీ హత్య కావించబడటంతో చివరివాణి వినిపించి భాగ్యనగర్ రేడియో అంతరించింది.

రామకృష్ణ శర్మ అత్యంత సాహసోపేతంగా భాగ్యనగర్ రేడియో సారధ్యం వహించి స్వాతంత్ర్య ఉద్యమానికి తనవంతు సహకారం అందించారు. భాగ్యనగర్ రేడియో ద్వారా నిత్యము రజాకర్లచే చంపేయబడుచుండిన హిందూ ప్రజలు – భారతదేశంలోనే ఉండరేమో ! అని రామకృష్ణ శర్మ వ్యాఖ్యానించారు. రామకృష్ణ శర్మ వ్యాఖ్యానించారు. రామకృష్ణశర్మ స్వాతంత్ర్య ఉద్యమాన్ని భాగ్యనగర్ రేడియో ద్వారా ప్రేరేపించి తన జాతీయ భావాన్ని వ్యక్తం చేశారు. ఆయన జీవితం ఈ విధంగా ధన్యమైనది. చరిత్రకారునిగా, సాహితీవేత్తగా, స్వాతంత్ర్య ఉద్యమకారునిగా రామకృష్ణశర్మ చరిత్రలో నిలిచిపోతారు.

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష
గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

భాష లేకపోతే భావం లేదు
నీ భావాల్ని నీ భాషలో
చెప్పడమే సరైనది

తెలుగు సాహిత్యంలో పద్యం సారస్వత చిరంజీవి

– ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి



తెలుగు సాహిత్యంలో పద్యం సారస్వత చిరంజీవి అని,ఎన్ని ప్రక్రియలు వచ్చినా పద్యమే కలకాలం నిలుస్తుందని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జాతీయ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.పాలమూరు సాహితి మహిళా విభాగం ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 9 న ప్రముఖ కవయిత్రి రావూరి వనజ రచించిన శారదాంబ శతకం ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యాలు మానవతా సందేశాలను అందిస్తాయని, ఏ పద్యం చదివినా అది నీతిని బోధిస్తుందని తెలిపారు.తల్లి, తండ్రి, గురువు, విద్య మొదలైన అంశాలు చోటు చేసుకున్నాయన్నారు.గౌరవ అతిథి డాక్టర్ పొద్దుటూరి ఎల్లారెడ్డి మాట్లాడుతూ శారదాంబ శతకంలోని పద్యాలు సరళసుందరంగా ఉన్నాయని ప్రశంసించారు. తెలుగు సాహితీ పీఠం అధ్యక్షులు డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి గ్రంథ సమీక్ష చేస్తూ ఇందులోని ప్రతి పద్యాలు నీతిసుబోధకంగా ఉన్నాయని పేర్కొన్నారు.

కళాశాల ప్రధానాచార్యులు జె.సత్యనారాయణ రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన స్వర్ణపుష్పం మాసపత్రిక సంపాదకులు డాక్టర్ మక్కపాటి మంగళ ,సావరీన్ సర్వీసెస్ ఎం.డి బోగ కోదండపాణి,రావూరి సూర్యనారాయణ రావు, విశ్రాంత జిల్లా విద్యాధికారి డాక్టర్ ఎస్.విజయకుమార్ తదితరులు శతకం గురించి మాట్లాడారు. సభకు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

హైదరాబాదులో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం






ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని కమలా మెమోరియల్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్పేస్ అధ్యక్షులు డా. సామల రమేష్‌బాబు, స్పేస్ సెక్రటరీ ప్రొ. పూర్ణచంద్రరావు, విక్కీపీడియాలో తెలుగు భాషా నిపుణులు శ్రీ షేక్ రహమానుద్దీన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఎస్ఆర్‌సి డైరెక్టర్ డా. బండి సాయన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి జహేదా అన్సారీ, కరస్పాండెంట్ శ్రీ అన్సారీగారు వేదికనలంకరించారు. కార్యక్రమంలో ముందుగా ఆ బడిలో చదువుతున్న వేరువేరు భాషల నేపథ్యంగల 13 మంది పిల్లలతో వారివారి భాషల్లో నమస్కరించి, కుశల ప్రశ్నలు వేయించిన తరువాత రాజ్యాంగ పీఠికను ఆ 13 భాషల్లో చదివించడం ఆదర్శంగా నిలిచింది. స్వాగతోపన్యాసం చేసిన పాఠశాల డైరెక్టర్ శ్రీమతి సనా మాతృభాషా దినోత్సవం ప్రత్యేకతను వివరించి, తమ పాఠశాలలో ఆల్ లాంగ్వేజెస్ డే' నిర్వహించుకోవాలనుకున్నామని చెప్పారు. ప్రపంచంలో ఉపయోగంలో ఉన్న సుమారు 7000 భాషల్లో ఆదివాసీ భాషలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని యునెస్కో ఈ 2019 సంవత్సరాన్ని అంతర్జాతీయ ఆదివాసీ భాషల సంవత్సరంగా ప్రకటించిందని వివరించారు. డా.సామల రమేష్ బాబు మాట్లాడుతూ మాతృభాషపై పట్టు వుంటే అన్ని భాషలు తేలికగా అబ్బుతాయని చెపుతూ, గతంలో 16 భాషలు వచ్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుగారిని, ఇన్ని భాషలు ఎట్లా నేర్చుకోగలిగారంటే, ఆ రహస్యం నా మాతృభాషను బాగా నేర్చుకోవడం అని చెప్పారని గుర్తు చేశారు. మాతృభాష మాధ్యమంలో కనీసం ప్రాథమిక స్థాయి విద్యాభ్యాసం అయినా చేయడం వల్ల విద్యార్థికి కలిగే లాభాన్ని వివరించారాయన. శ్రీ షేక్ రహమానుద్దీన్ 2001 జనవరి 15న ఊపిరి పోసుకున్న వికీపిడియా పుట్టు పూర్వోత్తరాలను వివరించారు. ప్రస్తుతం సాధించిన సాంకేతికాభివృద్ధిని వివరించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భాషలను కాపాడి స్థిరపరచడాన్ని గురించి వివరించారు. భాషకు సంబంధించిన చదవడం, రాయడం, మాట్లాడడం, వినడం అనే నాలుగు ప్రక్రియలు నేటి కంప్యూటర్ల ద్వారా జరుగుతున్న తీరు తెన్నులను వివరించారు. భాషల డిజిటలైజేషన్ ద్వారా ప్రపంచంలో నమోదైన భాషలను ఇతర అవసరమైన భాషలోకి కంప్యూటర్ ఎంత తేలికగా అనువదించగలుగుతున్నదో వివరించారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దేశంలో గుర్తించిన అధికారిక భాషలన్నింటిని డిజిటలైజ్ చేయగలిగిందని, సదరు యాప్‌ను వివరించారు. కెమెరా ఉన్న ఫోన్ ఉంటే లిపిని చూపితే సదరు యాప్ మనకు కావలసిన భాషలోకి తర్జుమా చేసి ఇవ్వగలిగిన స్థాయికి ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిందని వివరించారు. ప్రొ. పూర్ణచంద్ర రావుగారు మాట్లాడుతూ అన్ని భాషలు గొప్పవే. వాటిని కాపాడు కోవాల్సిన అవసరం మనకు ఉంది అన్నారు. మాతృభాషలో సంస్కృతి మూలాలు ఉంటాయన్నారు. చివరగా శ్రీమతి జహేదా అన్సారీ తెలుగులో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృత జ్ఞతలు చెపుతూ...నా మాతృభాషలో కూడా మాట్లాడతాను అంటూ తమ పాఠశాలలకు ఒక ప్రత్యేకతను తెచ్చి పెట్టారు అంటూ శ్రీ నారాయణ గారికి, కీ.శే. రావెళ్ల కృష్ణారావుగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పులే

పుస్తక సమీక్ష

పోతనామాత్య కింకరుడు



సంతేకల్లహళ్ళి శ్రీ ఆలూరు లక్ష్మీ నరసింహశాస్త్రి
కన్నడ మూలం : బి.శంకర & ఆర్.శేషశాస్త్రి
తెలుగు అనువాదం : గుత్తి చంద్రశేఖర్ రెడ్డి
వెల: 60/-
ప్రతులకు: గుత్తి చంద్రశేఖరరెడ్డి
15, మొదటి దశ, జయప్రకాశ్‌నగర్, (వయా) మియాపూర్, హైదరాబాదు - 50

ఇది ఒక జీవిత చరిత్ర, సాహిత్య తపస్వి, కన్నడ సరస్వతీ దేవి వర పుత్రుడు శ్రీ ఆలూరు లక్ష్మీ నరసింహశాస్త్రి జీవితం, సాహిత్యాన్ని పరిచయం చేసిన సంక్షిప్త గ్రంథం. విశ్రాంత కన్నడ ఆచార్యులు (కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం) ఎ.ఆర్. శేషశాస్త్రి తన సోదరునితో కలిసి కన్నడ భాషలో రచించిన 'పోతనా మాత్య కింకర' ను, తెలుగు కన్నడ భాషా, సాహిత్యాల వోధి గుత్తి చంద్రశేఖర రెడ్డి మూలాన్ని అనుసరిస్తూనే, స్వతంత్రంగా తెలుగులో అనుసృజన చేసారు.

నేటి కడప జిల్లా పులివెందుల ప్రాంతం వారై యుండి, కోలారు ప్రాంతానికి వలస వెళ్ళి మొదట 'సంతీ కల్లహళ్ళి' గ్రామంలోను, పిదప బెంగుళూరులోను స్థిరపడిన అద్వైత, శంకర మతాను యాయులైన బ్రాహ్మణ కుటుంబంలోని వారసుడు - సంస్కృత, ఆంధ్ర కన్నడ భాషలలో ప్రగాఢ పాండిత్యం కలిగిన శ్రీ ఆలూరు లక్ష్మీ నరసింహశాస్త్రి (1898 - 1965) జీవిత కథ ఈ పుస్తకం. దీనిలో గల ఐదు అధ్యాయాలలో శ్రీ శాస్త్రిగారి నేపథ్యం, వారి పూర్వులు, వారి ఆత్మ బంధువులు, సాహిత్య రచనల గురించిన సమాచారం ఉంది. అనుబంధంగా ఆ మహాకవికి 'నటన కళా సంఘం' (బెంగుళూరు) సత్కరించిన సందర్భంలో సమర్పించిన సన్మానపత్రం ఉంది. శ్రీ శాస్త్రిగారి నిరాడంబర, త్యాగమయ జీవితం, అధ్యయన శీలత, సేవాతత్త్వం, నిగర్వత, అహంకార స్పర్శ లేని ఆత్మాభిమానం, దైవభక్తి స్నేహ సౌజన్యాలు, మానవీయ విలువల గురించిన విశేషాలను అనువాదకులు సరళంగాను ఆసక్తికరంగాను ఉదాహరణ పూర్వకంగా పేర్కొన్నారు.

కులమత ప్రాతిపదికన కాకుండా, పిల్లల ఆసక్తి అర్హతలను బట్టి విద్యాభ్యాసం, భోజన వసతి, వారి అభివృద్ధికై తోడ్పడుట ; తన గ్రామంలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు, పోస్టాఫీసును ఏర్పాటు చేయించటం, తన యింటినే తాత్కాలిక ఆసుపత్రిగా చేసి సౌకర్యాలు, వైద్య సదుపాయం కల్గించటం వంటి సామాజిక కార్యక్రమాలలో శాస్త్రిగారు ఎంత కృషి చేసారో తెలుస్తుంది.

ఇక, వారి సాహిత్య రచనల విషయాలకు వస్తే - 60కి పైగా రచనలు చేసినా చాల పుస్తకాలు లభ్యం కావటం లేదని పేర్కొన్నారు. 'జయ చామ నృపాలన', 'రామ రాజ్య విలాస', 'సంక్షిప్త శంకర విజయ', 'శంకరాచార్యుల స్తోత్రాల కన్నడ అనువాదం' మొ॥ వి షట్పది ఛందో రూపంలో పద్య రూపంలో రాసారు. 'శ్రీ శైలపురి రామాయణం' (సంతే కల్లహళ్ళి కన్నడంలో గ్రామనామం - సంస్కృతంలో శైలపురి) 1945లో వాల్మీకి మరియు ఇతర రామాయణాలను అధ్యయనం చేసి పూర్తి చేశారు. లభ్యమవుతున్న వారి గద్య గ్రంథాలలో పోతనామాత్యుని ఆంధ్ర శ్రీ మద్భాగవతాన్ని, కన్నడ వచన కావ్యంగా రాసి (1958 - 1962) 1200 పేజీల గ్రంథంగా ఐదు సంపుటాలుగ ప్రకటించి, జగద్గురు విద్యా తీర్థ మహా స్వామికి సమర్పించారు. పద్య రూపంలో కాకుండా గద్య రూపంలో ఉంటేనే సామాన్య జనానికి చదువను అనుకూలంగా ఉంటుందని శాస్త్రిగారు భావించారు. శేషప్ప కవి 'నృసింహ శతకాన్ని' కన్నడంలోకి అనువదించారు. త్యాగరాజు, వెంగమాంబ, బమ్మెర పోతన, పురందర దాసు, కనక దాసులు, కైవారం నారాయణప్ప మొ॥ విశిష్ట వ్యక్తుల జీవితం, వారి చరిత్రలను కథా రూపంలో కన్నడ ప్రజలకు పరిచయం చేసారు.

ఈ జీవిత చరిత్రలో సాహితీ ప్రియులను, పాఠకులను ప్రముఖంగ ఆకర్షించే అంశం - శ్రీ శాస్త్రిగారు తాను జీవించి ఉన్నప్పుడే ప్రారంభించిన 'పోతన జయంతి' ఉత్సవాలు యిప్పటికీ ప్రతీ సం॥ జరుగుతూ ఉండటం. ఎక్కడో కన్నడ దేశపు మారుమూల, క్రమం తప్పకుండా పోతన జయంతి జరగటం ఎంతో విశేషంగా భావిద్దాం.

శ్రీ శాస్త్రిగారు తెలుగు భాషలో రచనలు చేయకపోయినా, వారి వ్యక్తిత్వం, సాహిత్య సేవ, తెలుగు కవులు, భక్తులు, సంకీర్తనా కారులను కన్నడగులకు పరిచయం చేయుటం విశేషించి పోతనామాత్యుని కింకరునిగా శ్రీమద్భాగవతాన్ని కన్నడ భాషలో వచన రూపంలో వెలువరించిన సరళ, సురస కన్నడ అనువాద గ్రంథంగా, మేరు సదృశమైన వచన రచనగా పేరు పొందింది.

సాహిత్య రచన జనులకు అందుబాటులో ఉండాలని, వారిలో నైతిక విలువలను పెంచాలనేది లక్ష్యంగా శాస్త్రిగారి రచనలు సాగినట్టుగా వారి జీవిత చరిత్ర ద్వారా తెలియ వస్తుంది. పోతనలాగే నిర్వికార నిరాడంబర జీవితం గడిపి కీర్తి భాజనులైన ఆలూరు లక్ష్మీ నరసింహ శాస్త్రి జీవితం తెలుగు భాషాభిమానం కలవారిలో స్ఫూర్తిని కలిగించాలని అనువాదకుని ఆకాంక్ష నెరవేరాలని భావిద్దాం.

ఎమ్.వి.శాస్త్రి
9441342999

పుస్తక సమీక్ష

వర్తమాన భారతం



వర్తమాన భారతం
(సి.వి. చివరి రచనల సంపుటి)
వెల: 100/-
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్డు
విజయవాడ - 2


దైవ, మత, కుల, అంధ విశ్వాసాలకి వ్యతిరేక ఉద్యమాలే ప్రధాన లక్ష్యంగా ప్రచారం చేసి జనంతో సాంస్కృతిక చైతన్య జ్వాలల్ని జ్వలింప చేయడానికే తన కలం, గళం చివరికంటా ఉపయోగించిన 'హేతువాద జాబాలి' - సి.వి. తన యావచ్ఛక్తినీ సిద్ధాంత పరిజ్ఞానాన్ని, సమస్త మేధస్సునీ, హేతువాద - నాస్తికోద్యమ శ్రేయస్సుకీ హృదయ పూర్వకంగా అంకితం చేసి, ఆధునికాంధ్ర హేతువాద నాస్తికోద్యమ సింధువులో కేవలం తానొక బిందువునని, భారత సాంస్కృతిక విప్లవోద్యమానికి చెందిన అత్యంత సాధారణ కార్యకర్తనని తనను గురించి చెప్పుకున్న సి.వి. పూర్తిపేరు చిత్తజల్లు వరహాల రావు (1930-2017) కవి, రచయిత, విమర్శకుడు సి.వి., సి. విజయ లక్ష్మి, అరుణశ్రీ, ఆర్.వి.రామిరెడ్డి మొ॥ కలం పేర్లతో తుఫానులాంటి శైలి, రాజకీయ సామాజిక చైతన్యం, మార్క్సిస్ట్ దృక్పథంతో హేతువాద, నాస్తిక వాద కవిత్వాన్ని రాసారు. వచన కవిత్వంలో కావ్యాలు, మహాకావ్యాలు, నాటకాలు, కథా కావ్యాలు రాసారు. దిగంబర కవులకన్నా ముందే సమాజంలోని దారుణ పరిస్థితుల పట్ల అసహ్యంతో, వ్యవస్థ మీద తీవ్రమైన కసితో 'విషాద భారతం' (1964) 'కారుచీకట్లో కాంతిరేఖ' (1965) వంటి కావ్యాలతో ప్రగతి శీల కవిత్వం సృష్టించి అభ్యుదయ సాహిత్యలోకంలో ఎంతో సంచలనాన్ని కలిగించారు.

సి.వి. ప్రథమ సంస్మరణ (08 నవంబరు 2018) సందర్భంగా ప్రచురింపబడిన వారి చివరి రచనల సంపుటిలో మొత్తం 133 వచన కవితలున్నాయి. 'వర్తమాన భారతం', 'వీళ్ళా దేవుళ్ళు?' 'సాంస్కృతిక ఉద్యమం కావాలి' 'ఆదాము - అవ్వ', 'సనాతన ధర్మ రక్షణ' అనే ఐదు అధ్యాయాలుగా వర్గీకరించబడ్డాయి. అనుబంధం 1&2 గా చివరలో 'సి.వి. గురించి సి.వి' శీర్షికన 1989లో బి. సాంబశివరావుకు ఉత్తరాల ద్వారా తన గురించి తానే వ్యక్త పరచిన అభిప్రాయాలు - తన మరణానంతరం మాత్రమే దీనిని ముద్రించాలని కోరిన వైనం మనకు కొత్తగా తెలియవస్తుంది. కవితాత్మక శైలితో, లేఖా రచనను కూడా ఉద్యమ స్పృహతో రాయటం సి.వి. ప్రత్యేకత అన్న వాస్తవం మన దృష్టికి వస్తుంది. 'మన పవిత్ర మాతృభూమి నేడే సాంస్కృతిక / మూఢ విశ్వాసాల నాగుపాముల పుట్టలో కూరుకు పోయింది / అంధకారంలో మునిగిపోయింది...' అంటూ, దీని నుంచి బయటపడటానికి సాంస్కృతిక ఉద్యమం రావాలి, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం కావాలి అంటారుసి.వి. 'అరవయ్యేళ్లకు పూర్వం మన దేశానికి / స్వాతంత్ర్యం వచ్చింది గానీ మానవత్వం రాలేదు / స్వరాజ్యం వచ్చిందిగానీ సమానత్వం రాలేదు - అంటూ విచారం వ్యక్తం చేస్తారు. సనాతన ధర్మాన్ని పునరుద్ధరించడానికి ఆధ్యాత్మిక వేత్తలు చేస్తున్న ప్రయత్నాల నుండి ఈ దేశాన్ని, ఈ 130 కోట్లమంది ప్రజల్ని రక్షించడానికి కవులు, కళాకారులు కంకణం కట్టుకుని, కార్యరంగంలోకి దూక వలసిన సమయం ఆసన్నమైంది అంటూ, నూతన సాంస్కృతిక ఉద్యమం రావాలని గాఢంగాను, ఆర్తితోను తన బాధనే కవిత్వానికి పర్యాయ పదంగా, కవితా రచన అంటే ఒక మహోగ్రమైన తపస్సు, ఒక భీకరమైన బాధ అని చెప్పే సి.వి. మాటలకు ఈ సంపుటిలోని, కవితలన్నీ అక్షర రూపంలో కనిపిస్తాయి. వచన కవితలతోపాటు అక్కడక్కడ కొంత వచనం కూడా రాసారు. "కంటికి కన్పించే ఈ ప్రపంచమే సత్యం / కంటికి కన్పించని దైవం పచ్చి అబద్ధం", అంటూ తన నిశిత కవనాగ్నిని కురిపించినా 'లక్షలాది కోణాలున్న మానవ జీవితానికి / మానవత్వమే మౌలికమైన మూలం' అని గాఢంగా నమ్మిన కవి సి.వి. వారు కోరుకున్న అత్యంత శక్తిమంతమైన సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం కావాలని రావాలని సి.వి. గారి బాధ, కోరిక, విన్నపం - అంటూ ముందు మాట'లోసి.వి. సహచరి పేర్కొన్నారు. అయితే, సి.వి. అభ్యుదయ, హేతువాత, నాస్తిక సిద్ధాంతాలతో అందరూ ఏకీభవించలేక పోవచ్చు. కాని, దేశం, సమాజం, సమానత్వం, సాంస్కృతికంగా సివి చిత్తశుద్ధిని మాత్రం ఎవరూ కాదనలేరు. సివి అభిమానులకు వారి సిద్ధాంతాలను ఆమోదించేవారికి, రచనల సంపుటి చక్కగా ఉపకరిస్తుంది.


ఎం.వి. శాస్త్రి
9441342999




డా॥ ఎన్.గోపి రచించిన 'వృద్ధోపనిషత్' కావ్యాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రముఖ పాత్రికేయులు కె.రామ చంద్రమూర్తి ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో కిన్నెర అధినేత మద్దాలి రఘురాం, ఆకాశవాణి కార్యనిర్వహణాధికారి సి.యస్.రాంబాబు, ఎన్.బి.టి అధికారి డా॥ పత్తిపాక మోహన్, కృతి స్వీకర్త హర్షవర్ధన్, సభాధ్యక్షులు డా॥ వోలేటి పార్వతీశం, కవి గోపి, డా॥సి. భవానీదేవి, డా॥ ఎస్. రఘు ఉన్నారు.



గండికోట నాయకరాజుల చరిత్ర - పౌరాణిక, చారిత్రక, సామాజిక పరిశోధనా గ్రంథం
రచయిత : భట్టరుశెట్టి పద్మారావు రాయలు
పుటలు: 345, వెల: రు.200/-
ప్రతులకు :భట్టరుశెట్టి పద్మారావు రాయలు,
బలిజపాలెం పోస్టు, బొట్ల గూడూరు (వయా),
పామూరు (మం), ప్రకాశం (జిల్లా) - 523 110
ఫోన్ : 9010429826



మోదుకూరు గ్రామ వేమన జయంతి ఉత్సవాలు
సంకలనం : మొవ్వా శ్రీనివాసరెడ్డి,
తియ్యగూర సీతారామిరెడ్డి
పుటలు:168
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక మరియు సంస్కృతి సమితి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము



గుంటూరు జిల్లాలో ఉప్పు సత్యాగ్రహం
కూర్పు : రావినూతల శ్రీరాములు
పుటలు: 36, వెల: అమూల్యం
ప్రతులకు :గుంటూరు కేసరి సేవా సమితి
12-25-46, శ్రీ సదనము, కొత్తపేట, మెయిన్‌రోడ్డు
గుంటూరు - 522 001



చదువుల చెలమ : విద్యా వికాస కథలు
రచన : ఎల్.ఆర్.వెంకటరమణ
పుటలు:176, వెల: రు.100/-
ప్రతులకు : ఎల్.ఆర్. వెంకటరమణ, 2-198
రెండవ వీధి, న్యూటవున్
అనంతపురం - 515 004
సెల్ : 98661 58908




ఒక సాయంత్రం త్వరగా ఇల్లు చేరినప్పుడు (కథలు)
రచన : పలమనేరు బాలాజి
పుటలు:160, వెల: రు.100/
ప్రతులకు: శ్రీమతి గండికోట వారిజ
6-219, గుడియాత్తం రోడ్డు, పలమనేరు
చిత్తూరు జిల్లా - 517 408
సెల్ : 9440995010




ఎక్కడికీ పయనం
కవిత్వం
రచన : డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి
పుటలు:100, వెల: రు.100/-
ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సాంస్కృతిక శాఖ
ఘంటశాల సంగీత నృత్య కళాశాల, దుర్గాపురం, విజయవాడ



లైఫ్ హాలిడే
రచన : అక్షరమాలి సురేష్
పుటలు: 75, వెల: రు.100/-
ప్రతులకు :అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు
ఫోన్ : 94938 32470 (సురేష్)



వ్యతిరిక్త ప్రవాహమ్ : కవిత్వం
రచయిత:సత్యోదయ్
పుటలు:104, వెల: రు.100/-
ప్రతులకు : అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు
మరియు 1-9-1352/4, దీన్‌దయాల్ నగర్,
నంది హిల్స్, వరంగల్
ఫోన్ : 7702722064



ప్రస్థానం : కథలు
రచన: సమతా శ్రీధర్
పుటలు: 236, వెల: రు.80/-
ప్రతులకు: సమతా నర్సింగ్ హోం, ఇంటి నెం. 15/9-455, కవిరాజ నగర్, ఇల్లందు క్రాస్‌రోడ్, ఖమ్మం, తెలంగాణ - 507 002, సెల్ : 98481 56198



భూమిక
(సుధామ పీఠికలు - ముందు మాటలు)
సంపాదకులు : అల్లంరాజు ఉషారాణి
పుటలు:470, వెల:300/-
ప్రతులకు: ఎ. ఉషారాణి, స్నేహిత స్రవంతి, జి. 12, సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్, హైదరాబాద్ - 500 036
సెల్: 9849297958



నాకు నీవు నీకు నేను :నానీలు
రచన :కమ్మల నర్సిములు
పుటలు: 40, వెల :40/-
ప్రతులకు :కె. రవిందర్
ఇంటి నెం. 3-188/7, టైలర్స్ కాలనీ
ఆదిలాబాద్
సెల్ : 8978367494



సామాజిక నానీలు
రచన : ఎస్.ఎం. సుభాని
పుటలు:40, వెల: రు.60/-
ప్రతులకు: షేక్ సలీం బేగమ్
8-3-248/బి, 6వ లైను, బుచ్చయ్య తోట,
గుంటూరు - 522 001

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

తెలుగుశాసనాలు, తాళపత్రగ్రంథాలు, రాతప్రతులపై శిక్షణశిబిరం





ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, భారతీయభాషా సంస్థ, మైసూరు మరియు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనాలయం, హైదరాబాదు సంయుక్తంగా 2019-2- 11 నుంచి 17 వరకు తెలుగు శాసనాలు, తాళపత్రగ్రంథాలు, రాతప్రతులపై నిర్వహించిన శిక్షణ శిబిర ప్రారంభోత్సవం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్. రామచంద్రం ముఖ్య అతిథిగా, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు సభాప్రారంభకులుగా, ప్రముఖ కవి, పరిశోధక పండితులు ఆచార్య ఆర్వీయస్ సుందరం కీలకోపన్యాసం చేశారు.

ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య జయధీర్ తిరుమలరావు, గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం సంచాలకులు శ్రీ ఆకునూరి మురళి ఐఎఎస్ గారి అధ్యక్షతన ప్రారంభోత్సవ సభ ఎంతో విజ్ఞానదాయకంగా, విజయవంతంగా జరిగింది.

ఫిబ్రవరి 11, 2019 నాడు ప్రారంభ సమావేశంలో ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనాలయం పూర్వ సంచాలకులు శ్రీ జయధీర్ తిరుమలరావు గారు రాతప్రతులు అని వేటినంటారో తెలుపుతూ కాగితపు ప్రతులు, తాళపత్ర ప్రతుల గురించి పరిచయం చేశారు. మరో ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య రవ్వా శ్రీహరి గారు తాళపత్రగ్రంథాల, రాతప్రతుల పరిశీలన, ఆవశ్యకతను భాస్కర రామాయణాన్ని ఆధారంగా చేసుకొని సాధికారంగా ప్రసంగించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం – పరిశోధనాలయం సంచాలకులు శ్రీ ఆకునూరి మురళి ఐఎఎస్ గారు రాతప్రతుల్లో విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వాటిని వెలికితీసి పరిష్కరించి లోకానికి ప్రకటించడం వల్ల ఎంతో మేలు కలుగుతుందన్నారు.

ఈ శిక్షణ శిబిరం ప్రారంభకులుగా విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణగారు ఈ సందర్భంగా తాళపత్ర గ్రంథాలు, రాతప్రతులపై పరిశోధనకు తమ జీవితాంతం కృషిచేసిన పాశ్చాత్యులు సిపి బ్రౌన్, కల్నల్ మెకంజీ మరియు తెలుగు మౌలిక పరిశోధకులను పేరు పేరునా ప్రస్తుతిస్తూ కార్యశాల ప్రారంభ ప్రకటన చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. రామచంద్రం గారు తాళపత్రాలు, రాతప్రతులను గురించి పట్టించుకోనటువంటి ప్రస్తుత సమాజంలో ఈ కార్యశాల ద్వారా మంచి తాళపత్ర గ్రంథ పరిశోధకులు తయారవ్వాలని ఆకాంక్షించారు. కీలకోపన్యాసం చేసిన మైసూరు విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య ఆర్వీయస్ సుందరం గారు ఒక భాషకు ప్రాచీన హోదా ఇవ్వాలంటే ఉండాల్సిన అర్హతలను గురించి ప్రస్తావిస్తూ, మన తెలుగు భాషకు ప్రాచీనహోదాను సంపాదించిన విధానాన్ని కూలంకషంగా తెలియచేశారు.

ఏడురోజులు శిక్షణ శిబిర ముగింపు సమావేశానికి డా. కె.వి రమణాచారి ముఖ్య అతిథిగా, డా. అయాచితం శ్రీధర్ సమాపనోత్సవ ప్రసంగ కర్తగా, తెలంగాణ పత్రికా సంపాదకులు శీ ఎ. రామ్మోహనరావు, ప్రాచ్యలిఖిత గ్రంథాలయం సహాయ సంచాలకులు డా. పాలెపు సుబ్బారావు అతిథులుగా పాల్గొన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు అధ్యక్షతన సమావేశం విజయవంతంగా జరిగింది. ఇందులో కేంద్రం సిబ్బంది డా. మిరియాల సత్యనారాయణ, డా. బి. నాగశేషులు పాల్గొన్నారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
March 2019 Vol :5, Issue 1
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244